- మాజీ అగ్నివీర్లకు 10% రిజర్వేషన్లు
- పాల కల్తీని ఆవిరితో గుర్తించొచ్చు!
- మన దేశీ స్పేస్‌స్టేషన్.. బీఏఎస్
- కేంద్రంపై మళ్లీ రైతుల పోరుబాట
- నీట్‌పై విచారణ జులై 18కి వాయిదా

..లోపలి పేజీల్లో

మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA

శుక్రవారం FRIDAY 12.7.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4 Pages: 12+4 | సంపుటి (Volume): 14 | సంచిక (Issue): 37 | వెల (Price) రూ.6.50

షష్ఠి

శుక్రవారం, సూర్యోదయం: 5-49, సూర్యాస్తమయం: 6-54. శ్రీ క్రోధి నామ సంవత్సరం ఉత్తరాయణం గ్రీష్మ ఋతువు ఆషాఢ మాసం శుక్ల పక్షం తిథి: షష్ఠి పగలు 12-32 వరకు, తదుపరి సప్తమి. నక్షత్రం: ఉత్తరఫల్గుణి సాయంత్రం 4-09 వరకు, తదుపరి హస్త. వర్జ్యం: రాత్రి 1-38 నుంచి రాత్రి 3-27 వరకు. రాహుకాలం: ఉదయం 10-43 నుంచి ఉదయం 12-21 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 8-26 నుంచి ఉదయం 9-18 వరకు, పునః దుర్ముహూర్తం: పగలు 12-47 నుంచి పగలు 1-40 వరకు. అమృతకాలం: ఉదయం 8-01 నుంచి ఉదయం 9-49 వరకు.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline



ప్రశ్నించినందుకు వేధింపులు
గిరిజనుడిపై దౌర్జన్యం

- కాంగ్రెస్ ఎమ్మెల్యేను నిలదీస్తూ పోస్టులు పెట్టాడని ఎస్సై జులుం
- తొర్రూరు రాణాకు పిలిపించి తీవ్రంగా కొట్టి బెదిరింపులు
- ఎమ్మెల్యే పీఏ ప్రోద్బలంతోనే కొట్టారు: బాధితుడు సురేశ్
- 50 ఏండ్లు కాంగ్రెస్ జెండామోసిన ఫలితమిదని ఆవేదన
- పోలీసుల తీరును తప్పుపట్టిన కేటీఆర్.. డీజీపీకి వినతి
- విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి: హరీశ్‌రావు
- ఎస్సై, ఎమ్మెల్యే పీఏపై అట్రాసిటీ కేసుపెట్టాలి: ఎల్‌హెచ్‌పీఎస్

› 5




కాంగ్రెస్ నేత బెదిరింపులు
రైతు ఆత్మహత్యాయత్నం

- భూమి విషయంలో కాంగ్రెస్ నాయకుడి దౌర్జన్యకాండ
- మితిమీరిన గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే అనుచరుడి అరాచకం
- రైతు పొలానికి దారి ఇచ్చేందుకు 20 లక్షలు డిమాండ్!
- వేధింపులు తాళలేక పురుగులమందు తాగిన కిష్టయ్య
- గాంధీ దవాఖానకు తరలింపు.. రైతు పరిస్థితి విషమం
- భూమిని గుంజుకోవాలని చూస్తున్నారు: భార్య కనకవ్వ
- ప్రభుత్వం తమదేనంటూ వేధిస్తున్నారని ఆరోపణ

› 2

భూమి చెర.. బాంచెన్ దొర!

- భూముల కోసం సర్కారీ దొరల ముంగిట సాగిలా
- హైదరాబాద్ శివారు ఎమ్మెల్యేకు తీరని భూదాహం
- రైతులను బెదిరించి, అడ్డగోలుగా భూముల చెర
- దళితులకు చెందిన అసైన్డ్ భూములకూ ఎసరు
- కేసీఆర్ హయాంలో పారని ప్రజాప్రతినిధి పాచిక
- భూముల రెగ్యులరైజేషన్‌కు గత సర్కార్ ససేమిరా
- ఇప్పుడు ఆ భూముల కోసమే పార్టీ మార్పు?
- భూతర్పణకు పచ్చజెండా ఊపిన రేవంత్ సర్కార్?



BBB

భూములు.. బిల్లులు.. బ్లాక్ మెయిల్

ఫిరాయింపులకు ఫార్ములా ఇదీ!

- బీఆర్‌ఎస్ నేతలపై కాంగ్రెస్ ప్రయోగం
- తప్పనిసరి పరిస్థితుల్లో నేతల కప్పదాటు
- ఇందుకోసం ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు!

అరాచకీయమే రాజకీయమైనప్పుడు అధికారమే అంతిమలక్ష్యం అవుతుంది. భూమిపై మోహం భూతమై వెంటాడుతున్నప్పుడు ప్రభుత్వ ప్రాపకమే పరమావధి అవుతుంది. ఇప్పుడదే జరుగుతున్నది. నగర శివార్ల నుంచి గెలిచిన ఒక బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేకు... ఇప్పుడు గెలిపించిన ప్రజలకన్నా, వారి అభిమతం కన్నా, టికెట్ ఇచ్చిన పార్టీ కన్నా, రాజకీయ నిబద్ధత కన్నా భూమందారే ప్రధానమైపోయింది. ఎంద్కుగా పెరుట్టిన వందల ఎకరాల భూమిని పూర్తిగా చేజిక్కించుకోవాలంటే సర్కారీ పార్టీలో చేరడమే సరైన మార్గమైంది.

పదేండ్లు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేగా ఉన్నా కేసీఆర్ ప్రభుత్వంలో ఇందుకూడా ముందడుగుపడని ఆట.. ఆ నేతకు కాంగ్రెస్‌లో చేరితే భూమేత మేయవచ్చనే ఆఫర్ దక్కింది. ఇంకేముంది కండువా కప్పుకునేందుకు మెడ వంగిపోయింది. కేసీఆర్ సర్కారులో సాధ్యం కానిదాన్ని ఇప్పుడు సుసాధ్యం చేసుకోవచ్చన్న ఆశ సర్కారీ దొరల ముందు సాగిలపడేలా చేస్తున్నది. తెలంగాణలో ఫిరాయింపుల కోసం త్రీ-బీ (బీబీబీ) ఫార్ములా నడుస్తున్నది. అయితే భూములు, లేదంటే బిల్లులు, కాదంటే బ్లాక్ మెయిలింగ్! ఎమ్మెల్యేలను లొంగదీసుకోవడానికి ఇదీ లెక్క! 'చెరబట్టిన భూములు నీకేఉండాలా? పెండింగ్ బిల్లులు విడుదల కావాలా? కేసులు పెట్టకుండా ఆగాలా? అయితే గోడదూకు! మా పార్టీలో చేరు! కండువా కప్పుకో!' ఇప్పుడిదే ఆఫర్.. ఫిరాయింపులకు తెర లేపుతున్నది. గత్తర లేపుతున్నది!

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, జూలై 11 (నమస్తే తెలంగాణ)/మణికొండ: శంషాబాద్ మండలం సుల్తాన్‌పల్లిలో 75 మంది రైతులు దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న దాదాపు 200 ఎకరాలకు పైగా భూములు ఒక మాజీ ఎంపీ తనవంటూ దాక్యుమెంట్లు చూపారు. ఉమ్మడి రాష్ట్రంలోనే ఈ వివాదం న్యాయస్థానానికి వెళ్లింది. అప్పి ఒక ప్రజాప్రతినిధి రంగప్రవేశం చేసి ఐరుప్పెపులా రాజీ కుదిర్చి ఆ భూములను ఒక ప్రైవేటు కంపెనీకి అప్పగించే ప్రయత్నం చేసి భారీగా లాభపడ్డారు. కేసీఆర్ హయాంలో ఈ జాగీర్దారీ భూములపై ప్రభుత్వాధికారులు న్యాయస్థానంలో పోరాటం చేశారు. దీంతో ఈ భూములపై 'వివాదం కోర్టులో ఉన్నది' అని ధరణిలో నమోదు చేసి ముటేషన్లు నిలిపివేశారు. ఫలితంగా సదరు ప్రజాప్రతినిధి పాచిక పారలేదు. శంషాబాద్‌లో జాతీయ రహదారిని ఆనుకుని సర్వే నంబరు 720 నుంచి 730 వరకు సుమారు 181 ఎకరాల హెచ్‌ఎండీఏ భూములు ఉన్నాయి. దీనిపై కన్నేసిన సదరు ప్రజాప్రతినిధి అల్లుడు కొంత దిని రంగంలోకి దించి ఆ భూములను కొట్టేసేందుకు విశ్వ ప్రయత్నం చేశారు. కానీ, కేసీఆర్ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు › 2వ పేజీలో

హైదరాబాద్, జూలై 11 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో జరుగుతున్న పార్టీ ఫిరాయింపులకు సంబంధించి ఇటీవలే పార్టీ మారిన ఓ ఎమ్మెల్యే చేస్తున్న వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశం అవుతున్నాయి. తనకు ఎదురైన అనుభవాన్ని సదరు ఎమ్మెల్యే కలిసిందిన వారందరితో చెప్పి ఆవేదన వ్యక్తం చేస్తున్నట్టు తెలిసింది. చేసిన పనులకు బిల్లులు కావాలంటే కాంగ్రెస్ కండువా కప్పుకోవాల్సిందేనని, లేదంటే బిల్లులను మర్చిపోవాల్సిందేనని ప్రభుత్వ పెద్ద ఒకరు హుకుం జారీచేశారట. ఉత్తర తెలంగాణకు చెందిన ఒక ఎమ్మెల్యే పెద్మొంకుడే బిల్లుల చెల్లింపుల విషయంలో ఇలా బెదిరించినట్టు తెలిసింది. ఇంకా బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతాం అంటే మీ ఇష్టమని తేల్చి చెప్పడంతో సదరు ఎమ్మెల్యే రాత్రికి రాత్రే కాంగ్రెస్ కండువా కప్పుకున్నారని ప్రచారం జరుగుతున్నది. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ వర్గాల్లో ఇప్పుడిది హాట్ టాపిక్‌గా మారింది. 'నువ్వు నా సొంత జిల్లా మనిషివి. నేను ఇక్కడ ఉండగా నువ్వు అక్కడ ఉంటే ప్రయోజనం ఏమిటి? నేను తలచుకుంటే కాలు తీసి కాలు కదపలేవు. రాజకీయాలు చేయాలంటే ఇటు రావాల్సిందే. లేదంటే దందా బంద్' అని ఫత్వా జారీ కావడంతో అనేక తర్జనభర్జనలు పడి చివరికి పార్టీ మారాల్సిన అనివార్యత నెలకొనడంతో మరో నేత బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో › 2వ పేజీలో



గుండె లయ వినాలయా..!

- గుండెపోటుకు నెల ముందే 6 సంకేతాలు
- అమెరికన్ హార్ట్ అసోసియేషన్ వెల్లడి


ఆహారపుటలవాట్లు, జీవనశైలిలో వచ్చిన మార్పులతో నేటి కాలంలో గుండెజబ్బులు ఎక్కువయ్యాయి. భారత్‌లో ఏటా గుండెపోటుతో 30 వేల మంది మరణిస్తున్నట్టు నివేదికలు వెలుతున్నాయి. గుండెపోటును ముందస్తుగా గుర్తించకపోవడంతోనే మరణాలూ ఎక్కువవుతున్నట్టు వైద్యనిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో గుండెపోటు వచ్చే ప్రమాదాన్ని శరీరంలో వచ్చే అరు మార్పులతో నెల ముందుగానే పసిగట్టవచ్చని 'అమెరికన్ హార్ట్ అసోసియేషన్' తాజాగా వెల్లడించింది. ఆ సంకేతాలను అర్థం చేసుకుని మసలుకుంటే ప్రమాదాన్ని ముందుగానే నివారించవచ్చని నిపుణులు చెప్తున్నారు. › 8

పగలబడి నవ్వండి

- గట్టిగా నవ్వితే గుండె సమస్యలు దూరం.. 'లాఫర్ స్టడీ' వెల్లడి › 8
- కడుపుబ్బా నవ్వితే చురుగ్గా రక్త ప్రసరణ, మానసిక ప్రశాంతత
- రోజులో ఒక్కసారైనా పొట్ట చెక్కలవ్వాలి.. జపాన్‌లో కొత్త రూల్

ఆత్మహత్యల భారతం

ప్రపంచంలో ఎక్కువ బలవన్మరణాలు మన దేశంలోనే



› 8



నిరుద్యోగుల పోరాటంపై ప్రభుత్వ దమనకాండ, పోలీసుల దౌర్జన్యం నేపథ్యంలో గురువారం బీఆర్‌ఎస్వీ నాయకులతో సమావేశమైన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

డీఎస్సీ వాయిదాకు ఢిల్లీకి నిరుద్యోగులు

- అయినా మొండిగానే రాష్ట్ర సర్కారు
- వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లు
- 18 నుంచి ఆగస్టు 5 వరకు పరీక్షలు

హైదరాబాద్, జూలై 11 (నమస్తే తెలంగాణ): డీఎస్సీని వాయిదా వేయాలంటూ నిరుద్యోగులు చేస్తున్న ధర్నాలు, ఆందోళనలను ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో మొండిగా వ్యవహరిస్తున్న ప్రభుత్వం మెడలు వచ్చేందుకు 'చలో ఢిల్లీ'కి నిరుద్యోగులు పిలుపునిచ్చారు. అక్కడ రాహుల్‌గాంధీని కలిసి సమస్యలు వివరించి, వాయిదా కోరాలని నిర్ణయించారు. వారు ఆ పనిలో ఉండగానే రాష్ట్ర ప్రభుత్వం నిక్కబ్బంగా డీఎస్సీ హాల్‌టికెట్లను వెబ్‌సైట్‌లో పెట్టేసింది. ఈ నెల 18 నుంచి ఆగస్టు 5 వరకు ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించనున్నామని, అభ్యర్థులు హాల్ టికెట్లను డౌన్‌లోడ్ › 3వ పేజీలో

వెంచర్ల రైతుబంధు వాపస్



- మేడ్చల్ జిల్లాలో రైతుకు నోటీసులిచ్చేందుకు రంగం సిద్ధం
- వెంచర్ చేసిన భూమికి 16 లక్షలు పొందినట్టు నిర్ధారణ
- ఆ మొత్తాన్ని రికవరీ చేసే పనిలో రెవెన్యూ యంత్రాంగం
- రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయేతర భూములపై ప్రభుత్వం సర్వే
- సాగులోలేని భూములకు 25 వేల కోట్లు ఇచ్చినట్టు గుర్తింపు
- రాష్ట్రవ్యాప్తంగా రైతుల నుంచి రికవరీ ఉంటుందా?
- రైతుబంధు వెనక్కి తీసుకునే చర్యలతో రైతుల్లో ఆందోళన

హైదరాబాద్/మేడ్చల్, జూలై 11(నమస్తే తెలంగాణ): వ్యవసాయేతర భూములకు గతంలో రైతుబంధు పథకం కింద అందజేసిన పెట్టుబడి సాయాన్ని వాపస్ తీసుకునేందుకు ప్రభుత్వ యంత్రాంగం సిద్ధమవుతున్నది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పోచారం గ్రామానికి చెందిన రైతు మొత్కుపల్లి యాదగిరిరెడ్డి గతంలో అందజేసిన రైతుబంధును వాపస్ ఇవ్వాలంటూ నోటీసులు జారీచేసేందుకు రెవెన్యూ అధికారులు సిద్ధమవుతున్నారు. జిల్లా కలెక్టర్ అనుమతితో రెండు రోజుల్లో ఆయనకు నోటీసులు ఇవ్వనున్నట్టు ఘట్‌కేసర్ తహసీల్దార్ రజని తెలిపారు. పోచారం గ్రామానికి చెందిన రైతు › 6వ పేజీలో

విద్యార్థినులను కొరికిన ఎలుకలు

మెదక్ జిల్లా రామాయంపేట గురుకులంలో ఘటన



కాలికి ఎలుక కరిచినట్టు చూపిస్తున్న విద్యార్థిని

రామాయంపేట, జూలై 11 : మెదక్ జిల్లా రామాయంపేట పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల హాస్టల్‌లో ఎలుకల దాడిలో 12 మంది విద్యార్థినులు గాయపడ్డారు. రామాయంపేటలోని కాళ్లగడ్డ వద్ద ఉన్న గురుకుల పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థినులు వసతి గృహంలో ఎలుకలు › 2వ పేజీలో

తెల్లవార్లూ బదిలీల కౌన్సెలింగ్

షెడ్యూల్‌లో ఒకటి.. కొనసాగుతున్నది మరొకటి

ఐదీ సోషల్ వెల్ఫేర్ గురుకుల సొసైటీ తీరు › 6

'వైద్య' బదిలీలు ఆగమాగం

డీపీహెచ్ కార్యాలయం ముందు నర్సుల ఆందోళన

సీనియార్టీ జాబితాలో తప్పులంటూ విమర్శలు › 6

రాష్ట్రంలో నిలిచిన రిజిస్ట్రేషన్లు

ఈ-కేవైసీ సమస్యలతో అంతరాయం

క్రయవిక్రయాలకు విఘాతం › 6

ఫేక్ ఫోన్‌పేతో పేమెంట్ మోసం

వ్యాపారులే లక్ష్యంగా చీటింగ్

నిర్మల్‌లో నలుగురు యువకుల అరెస్ట్ › 2

అదానీకి అప్పగిస్తే ఒప్పుకోం

- ఒక్క సర్కిల్, ఫీడర్‌ను ప్రైవేటుకిచ్చినా సహించం
- అదానీకి ఇచ్చేందుకు దావోస్‌లో రేవంత్ ఒప్పందం
- విద్యుత్తు ఉద్యోగులను ఏం చేయాలనుకున్నరు?
- కరెంట్ బిల్లుల వసూలుపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలి
- రక్షణ కల్పిస్తే ఎంతటి వారికైనా నోటీసులిస్తాం
- టీఎస్‌యూఈఈయూ కార్మికుల స్పష్టీకరణ
- ఎస్పీడీసీఎల్ కార్యాలయం ఎదుట భారీ ధర్నా



మింట్‌కాంపౌండ్‌లోని ఎస్పీడీసీఎల్ ఆఫీసు ముందు కార్మికుల ధర్నా

హైదరాబాద్, జూలై 11 (నమస్తే తెలంగాణ)/సిటీబ్యూరో: హైదరాబాద్ సౌత్ సర్కిల్‌లో విద్యుత్తు బిల్లుల వసూలును అదానీ గ్రూప్‌కు అప్పగిస్తున్నట్టు వస్తున్న వార్తలపై తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ భగ్గుమన్నది. సౌత్ సర్కిల్‌తోపాటు రాష్ట్రంలో ఏ ఒక్క సర్కిల్, ఫీడర్, కంపెనీలను ప్రైవేటు సంస్థలకు ఇవ్వొద్దని డిమాండ్ చేసింది. ఈ విధానాలను తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం హైదరాబాద్ మింట్‌కాంపౌండ్‌లోని టీజీఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించింది. బిల్లుల వసూళ్లకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఆ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బిల్లులకు వెళ్లిన విద్యుత్తు ఉద్యోగులపై దాడులకు పాల్పడితే › 2వ పేజీలో


పన్నులు పిండండి.. ఆదాయం పెంచండి

- పన్ను వసూళ్లపై అధికారులు కఠినంగా వ్యవహరించాలి
- మంత్లీ టార్గెట్లు పెట్టుకోండి..ఇకపై ప్రతి నెలా సమీక్షిస్తా: సీఎం



- ఈ ఏడాది ఆదాయం ఆశాజనకంగా లేదు
- జీఎస్టీ రాబడిని పెంచే మార్గాలు వెతకండి
- మద్యం అక్రమ సరఫరాకు అడ్డుకట్టవేయాలి
- ఆదాయ వనరులు, పన్ను వసూళ్లపై నజర్
- ఏవియేషన్ ఇంధన పన్ను సవరణపై యోచన
- మంత్రులు, అధికారులతో సమీక్షలో రేవంత్
- తగిన ఆదాయం రావడం లేదని అసంతృప్తి

› 2



నల్లనేలలో ఎర్ర చట్టం!

సింగరేణి కార్మికులకు ఎల్లో, రెడ్ వార్నింగ్

- కొత్త సర్క్యులర్ తెచ్చిన యాజమాన్యం
- సంఘాలతో చర్చించకుండానే అమలు
- నేరుగా కార్మికుల సెల్‌ఫోన్లకు మెసేజీలు
- సంజాయిషీకి అవకాశమే ఇవ్వని సంస్థ
- భూపాలపల్లిలో 34 మందికి కార్డులు జారీ
- భయాందోళనలో బొగ్గు గని కార్మికులు

సింగరేణిలో మళ్లీ పాత రోజులు పునరావృతమవుతున్నాయి. ఇప్పటికే ఆందోళనలపై ఉక్కుపాదం మోపుతున్న యాజమాన్యం ఇప్పుడు మరో కార్మిక వ్యతిరేక వర్గాన్ని తీసుకువచ్చింది. ఎల్లో, రెడ్ కార్డ్ మెసేజ్‌లతో సింగరేణి కార్మికులపై వేధింపులకు దిగుతున్నది. › 3



గురువారం తన పుట్టినరోజు సందర్భంగా బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకుంటున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

భూమి చెర.. బాంచెన్ దొర!



> మొదటిపేజీ తరువాయి...

వెళ్లి ఆ భూములు హెచ్‌ఎండీఏకు చెందినవేనని తీర్పు వచ్చే వరకు పోరాడింది. కబ్జాదారులు ఎవరైనా సరే ఉపేక్షించవద్దంటూ హెచ్‌ఎండీఏ అధికారులు అందులోని అక్రమ నిర్మాణాలన్నింటినీ నేలమట్టం చేసి సుమారు రూ.1,000 కోట్ల విలువైన భూముల్ని ప్రభుత్వపరం చేశారు. శంషాబాద్ మండలం సయ్యద్‌గూడ, చిన్న గోల్కొండ పంచాయతీ సర్వే నంబరు 24లో 200 ఎకరాలు, పెద్ద గోల్కొండ పరిధిలో సర్వేనంబర్ 114నుంచి 176వరకు 185 ఎకరాలు.. ఇలా మొత్తం 385 ఎకరాల అసైన్డ్ భూములు ఉన్నాయి. దీనిపై కన్నేసిన సదరు ప్రజాప్రతినిధి రైతులను బెదిరించి తోచినంత ముట్టజెప్పి నయవంచనకు పాల్పడి ప్రభుత్వ భూమిని రిజిస్ట్రేషన్ చేయించి, రెవెన్యూ రికార్డులను మార్చేందుకు ప్రయత్నించారు. కానీ, కేసీఆర్ ప్రభుత్వం ఆ అక్రమాలను అడ్డుకుంది. రిజిస్ట్రేషన్లను నిలిపివేసింది. మ్యుటేషన్లు కాకుండా కట్టడి చేసింది. శంషాబాద్ మండలం ఘాన్సిమియాగూడ పరిధిలోని సర్వే నంబర్ 4లో జాగీర్దార్ భూములున్నాయి. నిబంధనల ప్రకారం లెక్కిస్తే, లేదంటే ప్రభుత్వ ఖాతాలో ఉండాలి. కానీ కొందరు పెద్దలు ఈ భూముల్లో కన్నేసి పంచుకున్నారు. ఇందులో సదరు ప్రజాప్రతినిధి బినామీల భూమిని మలుపుకొని ప్రహరీతో గ్రేహౌండ్స్ నిర్మించుకున్నారు. గతంలో ఈ భూముల్ని పేదలకు పంచాలంటూ ప్రస్తుత సీఎం రేవంత్ టీడీపీలో ఉన్నప్పుడు ధర్నా కూడా చేశారు. సదరు ప్రజాప్రతినిధి ఆ భూములను పట్టా భూములుగా మార్చేందుకు పదేండ్లుగా ప్రయత్నం చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఎక్కే గడప దిగే గడప అన్నట్లుగా వెంపర్లాడారు. కానీ ఆయన పాచిక పారలేదు.

చిన్న అవకాశాన్నీ ఇవ్వని కేసీఆర్ సర్కార్

గొల్లపల్లి, బహదూర్‌గూడ పరిధిలోని అసైన్డ్ భూములతో పాటు ఎయిర్‌పోర్టు కాలనీలో హెచ్‌ఎండీఏకు చెందిన 13 ఎకరాలపైనా సదరు ప్రజాప్రతినిధి, ఆయన అల్లుడు కన్నేసి స్వాధీనం చేసుకునేందుకు నానా తంటాలుపడ్డారు. కానీ కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఎప్పటికప్పుడు అధికారులు ఆ ప్రయత్నాలను తిప్పికొట్టారు. సర్కారు రికార్డుల్లో ఎక్కడా ప్రభుత్వ భూములను పట్టాలుగా మార్చే చిన్న అవకాశాన్ని కూడా ఇవ్వలేదు. అందుకే ఆ ఘనత వహించిన ప్రజాప్రతినిధి ఇప్పుడు గోడ దూకేందుకు సిద్ధమయ్యారు. ఓట్లేసిన జనాన్ని నట్టేట ముంచుతూ వారి నమ్మకాన్ని వమ్ము చేస్తూ మరికొన్ని గంటల్లోనే పార్టీ కండువా మార్చనున్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు పదేండ్లుగా ఎక్కడా సందు దొరకక తికమకపడుతున్న ఆ ప్రజాప్రతినిధి 'భూ'చీరి అడ్డుపెట్టుకొని అధికార కాంగ్రెస్ పంచన చేరింది. బీఆర్‌ఎస్ కావాలా? భూములు కావాలా? అని పాచిక విసిరింది. దీంతో ఫిరాయింపునకు ముహూర్తం ఖరారైంది.

చర్చనీయాంశంగా ఎమ్మెల్యే భూ దాహం

తాజాగా నగర శివారులో జంపింగ్‌కు సిద్ధమైన ఒక ఎమ్మెల్యే భూ దాహం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. అధికారం, అంతకుమించి ప్రభుత్వ, నిరుపేదల భూములను పందలాదిగా స్వాధీనం చేసుకోవాలనే చిరకాల స్వప్నంతో కండువాలు మార్చుతున్న వైనంపై పెద్ద ఎత్తున గుసగుసలు మొదలయ్యాయి. మరికొన్ని గంటల్లో మళ్లీ మూడో పార్టీ మార్చనున్న సదరు ఎమ్మెల్యే భూ లీలలను ఇప్పుడు నియోజకవర్గంలో కథలు కథలుగా చెప్పుకుంటున్నారు. నాలుగు దశాబ్దాల కిందట శంషాబాద్ మండలం సుల్తాన్‌పల్లి గ్రామ జాగీర్దార్ భూములపై వివాదం రాజుకుంది. 200 ఎకరాలకుపైగా ఉన్న ఆ భూముల్లో 75 నాగళ్లు (నాగలికి మూడెకరాలు) కింద రైతులు సాగు చేసుకునేవారు. ఆ భూములను జాగీర్దార్ల నుంచి తాము కొనుగోలు చేశామంటూ మాజీ ఎంపీ తులసీరాం భూముల స్వాధీనానికి తీవ్ర ప్రయత్నాలు చేశారు. అప్పట్లో ప్రభుత్వాలపై ఒత్తిడితెచ్చినా వివాదం కొలిక్కి రాకపోవడంతో న్యాయస్థానం పరిధిలోకి వెళ్లింది. ఈ క్రమంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాదయాత్ర సందర్భంగా రైతులు తమ భూములను తమకు ఇప్పించాలని వినతిపత్రం ఇవ్వడంతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొంత మేర ఆ దిశగా అడుగులు పడి, అప్పై వివాదం మళ్లీ మొదటికొచ్చింది. అనంతరం 2009 తర్వాత వివాదం మరో మలుపు తిరిగింది. ఇందులోకి కొత్తగా 'ప్రజాప్రతినిధి' రంగ ప్రవేశం చేశారు. ప్రైవేటు కంపెనీ ఆ భూములను కట్టబెట్టేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. 2014 తర్వాత ఈ పని కోసమే అప్పట్లో అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్‌లోకి వచ్చినా ఆయన పాచిక పారలేదు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రికార్డులను ఏమార్చేందుకు ఆయన అనేక రకాల ఒత్తిడి తెచ్చినా సఫలం కాలేదు.

అక్రమాలకు గ్రీన్‌సిగ్నల్ వచ్చిందా?

గతంలో భూ లావాదేవీల కోసమే సదరు ప్రజాప్రతినిధి పార్టీ మారినట్లుగా అర్థమవుతున్నదని పలువురు రాజకీయ పరిశీలకులు చెప్తున్నారు. గత పదేండ్లలో ఆ పాచికలు పారకపోవడంతో తాజాగా అధికార కాంగ్రెస్ వైపు తొంగిచూశారు. అక్కడా ఇదే అదునుగా భూ గాలం విసరడంతో ఈ అక్రమాలకు మార్గం సుగమం చేస్తామనే హామీ లభించిందనే ప్రచారం జరుగుతున్నది. గత కొన్నిరోజులుగా జరిగిన చర్చల్లోనూ ఈ భూ లావాదేవీల క్లియరెన్స్ అంశమే ప్రధాన ఎజెండాగా ఉన్నదనే వార్తలు వినిపించాయి. అటువైపు నుంచి గ్రీన్‌సిగ్నల్ రావడంతో అధికార పార్టీలోకి దూకేందుకు ముహూర్తం ఖరారు చేసుకున్నారని నియోజకవర్గంలో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతున్నది.

అల్లుడు.. సర్కారు భూముల గిల్లుడు

సదరు ప్రజాప్రతినిధి పదేండ్లపాటు నియోజకవర్గంలోని ప్రభుత్వ, అసైన్డ్ భూములపై కన్నేయడం, ఆయన అల్లుడు రంగంలోకి దిగి దార్జాలు చక్కబెట్టడం పరిపాటిగా మారింది. హెచ్‌ఎండీఏ భూములపై అనేకసార్లు కన్నేసి తప్పుడు దాఖలామెంట్లతో వాటిని స్వాధీనం చేసుకునేందుకు విశ్వప్రయత్నం చేశారు. పలుచోట్ల అసైన్డ్ రైతులను బెదిరించి అత్తికి పావుసేరులా కొనుగోలు చేసి ప్రభుత్వ రికార్డుల్లో పట్టా మార్చేందుకు రెవెన్యూ అధికారులపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తెచ్చిన సందర్భాలున్నాయి. కేసీఆర్ ప్రభుత్వ అండతో అధికారులు న్యాయస్థానాల్లో వాస్తవ దాఖలామెంట్లతో అఫిడవిట్లు వేసి న్యాయ పోరాటం చేశారు. సుప్రీంకోర్టు వరకు వెళ్లారు. పలు కేసుల్లో ప్రభుత్వం విజయం సాధించి రూ.వేల కోట్ల భూముల్ని తిరిగి స్వాధీనం చేసుకున్న దాఖలాలు ఉన్నాయి. సదరు ప్రజాప్రతినిధి అప్పట్లో ప్రభుత్వ పెద్దలను కలిసినా ఆయన కన్నేసిన వందలాది ఎకరాల భూములకు సంబంధించి రికార్డుల్లో మార్పు జరగలేదు.

భూములు.. బిల్లులు.. బ్లాక్ మెయిల్

> మొదటిపేజీ తరువాయి...

చేరాలని ఆ జిల్లాలో జోరుగా ప్రచారం జరుగుతున్నది. 'పార్టీలో చేరుతావా? లేదంటే పలానా కేసులో లోపల తోయాలా?' అని ఓ ఎమ్మెల్సీకి బెదిరింపు వర్తమానం చేరగానే ఆయన పార్టీ మారారని ప్రచారం సాగుతున్నది. బీఆర్‌ఎస్ నుంచి గెలిచిన ప్రజాప్రతినిధులపై కాంగ్రెస్ పార్టీ 'బీ క్యూబ్' (బిల్లు, భూమి, బ్లాక్‌మెయిల్) ఫార్ములాను ప్రయోగిస్తున్నదని జరుగుతున్న పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి.

బీఆర్‌ఎస్‌ను బలహీనపరిచే వ్యూహం

అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ కూటమికి 64 సీట్లు రాగా, బీఆర్‌ఎస్ పార్టీ నుంచి 39 మంది ఎమ్మెల్యేలు గెలుపొందారు. శాసనసభలో బీఆర్‌ఎస్ బలమైన ప్రతిపక్షంగా ఉన్నది. శాసనమండలిలోనూ బీఆర్‌ఎస్‌కు ఏకపక్ష మెజార్టీ ఉంది. అధికార పార్టీకి ఇది తలనొప్పిగా మారింది. దీంతో బీఆర్‌ఎస్‌ను అటునుంచి నరుక్కొచ్చి బలహీనపరిచే వ్యూహాన్ని రచించినట్టు తెలిసింది.

పార్లమెంట్ ఎన్నికలకు ముందు నుంచే

నిర్దేశించుకున్న చేరికల లక్ష్యాన్ని చేరుకునేందుకు కాంగ్రెస్ పార్టీ 'బీబీబీ' వ్యూహాన్ని రచించిందని, పార్లమెంటు ఎన్నికల సమయంలో దానిని ప్రయోగించిందని రాజకీయ వర్గాలు చెప్తున్నాయి. అందులో భాగంగానే 'భూ' ఆరోపణలను ఎదుర్కొంటున్న సిట్టింగ్ ఎంపీని, ఒక ఎమ్మెల్యేను చేర్చుకొని వారికి టికెట్లు ఇచ్చి ఎన్నికల్లో పోటీ చేయించిందని రాజకీయ వర్గాల్లో అప్పట్లో జోరుగా ప్రచారం జరిగింది. అలా పోటీలోకి దిగిన ఇద్దరూ ఆ ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. వ్యాపారరంగంలో అరితేరిన ఉత్తర తెలంగాణకు చెందిన ఒక ఎమ్మెల్యేకు ఐటీ తరహా బెదిరింపులు వెళ్లాయని ప్రచారం జరుగుతున్నది. 'బీఆర్‌ఎస్‌లో ఉంటే లాభం లేదు. జంప్ చేయ్. పార్టీలో చేరగానే ఎంపీ టికెట్ ఇచ్చి గెలిపించుకుంటాం' అని సదరు ఎమ్మెల్యేకు ఆఫర్ ఇచ్చి, ఆ ఎమ్మెల్యే ససేమిరా అని మొండికేశారని అప్పట్లో విస్తృతంగా ప్రచారం సాగింది.

బీబీబీ కోసం ఓ వ్యవస్థ

బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను చేర్చుకొనేందుకు అనుసరిస్తున్న బీక్యూబ్ ఫార్ములాను పార్లమెంట్ ఎన్నికల తర్వాత విస్తృతంగా ప్రయోగిస్తున్నట్టు జరుగుతున్న పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ఇందుకోసం ప్రభుత్వంలో ఒక వ్యవస్థ ఏర్పడినట్టు సమాచారం. అర్ధరాత్రి ఆరుగురు ఎమ్మెల్సీలను చేర్చుకోవడం, వాయిదా పద్ధతుల్లో ఎమ్మెల్యేలను చేర్చుకోవడం వంటి పరిణామాలు అందులో భాగమేనని చెప్తున్నారు. ఆ ప్రచారం నిజమేనని చేరికలు స్పష్టం చేస్తున్నాయని రాజకీయ పండితులు ఉదహరిస్తున్నారు. ఆ ఫార్ములాను అనుసరించే ఎమ్మెల్యేలకు గాలం వేస్తున్నారని, నేడో రేపు మరో ఇద్దరు ముగ్గురు చేరబోతున్నారని అంటున్నారు. ఒక సీనియర్ ఎమ్మెల్యే రోజువారీ 'లక్ష'ణమైన సంపాదనకు గండికొడతామనే బెదిరింపులు రావడం, సదరు నేత కొడుకు రాజకీయ భవిష్యత్తును లేకుండా చేస్తామని గట్టి హెచ్చరిక రావడంతో ఆ నేత కాంగ్రెస్‌పార్టీ కండువా కప్పుకొని జాగ్రత్త పడ్డారనే ప్రచారం జరుగుతున్నది. మొత్తంగా కాంగ్రెస్ పార్టీ బీబీబీ విధానాన్ని నమ్ముకొని ముందుకు సాగుతున్నదే తప్ప ప్రజామోద నిర్ణయాలు తీసుకొని పాలన సాగించాలని అనుకోవడం లేదని రాజకీయ విశ్లేషకులు విమర్శిస్తున్నారు.

విద్యార్థినులను కొరికిన ఎలుకలు

> మొదటిపేజీ తరువాయి...

బెడదతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి 12 మంది విద్యార్థినులను ఎలుకలు కరిచాయి. విషయం తెలిసి విద్యార్థినుల తల్లిదండ్రులు గురువారం హాస్టల్‌కు చేరుకుని నిర్వాహకులను నిలదీశారు. ప్రిన్సిపాల్ కలగజేసుకుని విద్యార్థినులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకుంటామని తల్లిదండ్రులకు నచ్చజెప్పి పంపించారు. విద్యార్థినులు మీడియాకు ఎలుకలు కరిచిన గాయాలను చూపించారు. రాత్రి పూట ఎలుకలు నిద్రపోనివ్వడం లేదని, హాస్టల్ ఆవరణలో కుక్కలతోనూ భయంగా ఉన్నదని పేర్కొన్నారు. హాస్టల్‌లో విద్యార్థినులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడతామని ప్రిన్సిపాల్ సరళాదేవి తెలిపారు.

లోకం పోకడ



ఇంట్లో ఎవరూ లేరు అంకుల్.. అమ్మతేమో షాపింగ్‌కు, డాడీ ఎమ్మెల్యేల షాపింగ్‌కు వెళ్లారు!

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
రంగారెడ్డి	36.1°c	23.8°c
ఆదిలాబాద్	35.1°c	25.1°c
మెదక్	34.8°c	25.1°c
హైదరాబాద్	34.5°c	24.5°c
మహబూబ్‌నగర్	34.2°c	24.5°c
నిజామాబాద్	33.4°c	25.6°c
కరీంనగర్	33.0°c	26.0°c
వరంగల్	33.0°c	24.0°c
నల్లగొండ	33.0°c	23.2°c
ఖమ్మం	31.0°c	25.0°c



రెండు రోజులు భారీ వర్షాలు

హైదరాబాద్ వాతావరణ కేంద్రం

హైదరాబాద్, జూలై 11 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని పలు జిల్లాల్లో రానున్న రెండు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. నైరుతి రుతుపవనాలు బలపడటం, బంగాళాఖాతంలో ద్రోణి ప్రభావంతో వర్షాలు పడే అవకాశం ఉందని చెప్పారు. ప్రస్తుతం పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో దక్షిణ ఏపీ తీరం వెంబడి సముద్రమట్టానికి 3.1కి.మీ. నుంచి 7.6 కి.మీ. ఎత్తులో ఉపరితల ఆవర్తనం ఏర్పడిందని తెలిపారు. నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, ఆదిలాబాద్, కుమ్రంభీం-ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, ములుగు, భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు. హైదరాబాద్‌లో పొడి వాతావరణం ఉంటుందని, మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు 30-32 డిగ్రీ సెల్సియస్ మధ్యలో ఉంటాయని చెప్పారు. సాయంత్రం లేదా రాత్రి సమయాల్లో నగరంలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపారు. గురువారం నారాయణపేట జిల్లా మరికల్‌లో 2.66 సెం.మీ., మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్రలో 2.44 సెం.మీ., సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వులో 1 సెం.మీ చొప్పున వర్షపాతం నమోదైనట్టు వాతావరణ శాఖ తెలిపింది.

ఫేక్ ఫోన్‌పేతో మోసాలు

వ్యాపారులే లక్ష్యంగా చీటింగ్

నిర్మల్‌లో నలుగురు యువకుల అరెస్ట్

నిర్మల్ అర్బన్, జూలై 11: డబ్బులు అత్యవసరం ఉందంటూ వ్యాపారులను మోసగిస్తున్న ఫేక్ ఫోన్‌పే యాప్ ముఠా సభ్యులను గురువారం నిర్మల్ పోలీసులు అరెస్టు చేశారు. నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి వెల్లడించిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలంలోని పలు గ్రామాలకు చెందిన జమిల్ల భరత్ (కోరియర్ బాయ్), దరంసోత్ సాయికిరణ్ (కూలీ), రాథోడ్ అరుణ్ (కూలీ), రాథోడ్ జీవన్ (హార్వెస్టర్ ఆపరేటర్) స్నేహితులు. టెన్త్, ఇంటర్ వరకు చదువుకున్న వీరు సులువుగా డబ్బులు సంపాదించాలని ఫేక్ ఫోన్‌పే యాప్‌ను ఉపయోగించి మోసాలకు పాల్పడే వృత్తిని ఎంచుకున్నారు. ఫేక్ యాప్ ద్వారా డబ్బులు పంపకపోయినా పంపినట్టు (అమౌంట్ సెండ్ సక్సెస్‌ఫుల్) రావడంతో నిజామాబాద్, రామాయంపేట, కామారెడ్డి, నిర్మల్ జిల్లాల్లో మోసాలకు పాల్పడ్డారు. జమిల్ల భరత్ స్నేహితులతో కలిసి గత నెల 2న నిర్మల్‌లోని హోటల్ పెట్రోల్ బంక్‌కు వచ్చారు. పెట్రోల్ పోసే వ్యక్తితో అత్యవసరం ఉన్నదని మాయమాటలు చెప్పి రూ.8 వేల నగదు ఫేక్ ఫోన్ పే యాప్ ద్వారా పే చేసినట్టు నమ్మించి నగదు తీసుకున్నారు. వచ్చిన నగదును నలుగురు సమానంగా పంచుకున్నారు. గత నెల 28న నిర్మల్‌లోని కావేరి పెట్రోల్ బంక్‌కు వెళ్లి బంధువులు దవాఖానలో ఉన్నారని నమ్మబలికి వారికి ఫేక్ యాప్ ద్వారా రూ.8 వేలు పంపినట్టు చేసి నగదు తీసుకుని ఉడాయించారు. వ్యాపారి తమ ఖాతాను పరిశీలించి నగదు రాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. గురువారం వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆ నలుగురు అనుమానాస్పదంగా కనిపించడంతో విచారించగా నేరం ఒప్పుకున్నారు. నలుగురిని అరెస్టు చేసి వీరి నుంచి నాలుగు మొబైల్‌ఫోన్లు, ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి వారిని రిమాండ్‌కు తరలించినట్టు పోలీసులు తెలిపారు.

కాంగ్రెస్ నేత భూదాహం.. రైతు ఆత్మహత్యాయత్నం

20 లక్షలు ఇస్తేనే భూమి వదిలేస్తానని బెదిరింపు

రైతు పరిస్థితి విషమం.. గాంధీ దవాఖానకు తరలింపు

సిద్దిపేట ప్రతినిధి/కొండపాక, జూలై 11 (నమస్తే తెలంగాణ): భూమి తగాదా విషయంపై కాంగ్రెస్ నాయకుడి వేధింపులు తాళలేక ఓ పేద రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు వెంటనే ఆయనను హైదరాబాద్‌లోని గాంధీ దవాఖానకు తరలించారు. ఈ ఘటన గురువారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గం కొండపాక మండలం దమ్మక్కపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన బండి పెద్దోళ్ల కిష్టయ్య సర్వేనంబర్ 1039లో ఉన్న 2.13 ఎకరాల భూమిని సాగు చేసుకుంటూ జీవిస్తున్నాడు. అందులో కొంత భూమిని మరొకరికి అమ్ముకున్నాడు. భూమిని కొనుగోలు చేసిన వారికి, తనకు ఉపయోగపడేలా కొంత భూమిని దారి కోసం వదిలి వాడుకుంటున్నాడు. అదే గ్రామానికి చెందిన ఆగంరెడ్డి చాలాకాలం క్రితం సర్వేనంబర్ 1038లో తన పేరుతో ఉన్న భూమిని మరొకరికి అమ్ముకున్నాడు. అందులో తనకు మరింత భూమి రావాలని బండి పెద్దోళ్ల కిష్టయ్య, అతని కుటుంబ సభ్యులను వేధిస్తున్నాడు. మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీ వ్యక్తిగా, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, సిద్దిపేట జిల్లా డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డికి దగ్గర వ్యక్తిగా పేరు పొందాడు. ఇప్పుడు తమ ప్రభుత్వం వచ్చిందని, తనను ఏమీ చేయలేరంటూ నర్సారెడ్డి ద్వారా బెదిరించాడని కిష్టయ్య భార్య కనకవ్వ ఆరోపించింది. 20 రోజులుగా ఈ వేధింపులు భరించలేక తన భూమిని కొలిచి చూపించాలని ప్రభుత్వ సర్వేయర్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. మొదటి రోజు ఎవరికీ లొంగకుండా కిష్టయ్య భూమిని కొలిచిన ప్రభుత్వ సర్వేయర్.. రెండోరోజు భయానికి గురై కిష్టయ్యకు సంబంధించిన భూమి ఆగంరెడ్డికి చెందుతుందని రిపోర్టును తయారుచేశాడు. పంచనామా కాపీని దరఖాస్తుదారుడు కిష్టయ్యకు కాకుండా ఆగంరెడ్డికి అందజేసి వెళ్లాడు. ఈ తప్పుడు రిపోర్టు వల్ల తమ భూమిలోకి వెళ్లేందుకు కిష్టయ్య వేసిన దారి మొత్తం ఆగంరెడ్డికే చెందుతుందని, తమకు తీవ్ర అన్యాయం చేశారని బాధిత రైతు వాపోతున్నాడు. ఇది అన్యాయమని రైతు కిష్టయ్య ఎంత వేడుకున్నా కనికరించని ఆగంరెడ్డి.. రూ.20 లక్షలు ఇస్తేనే దారి వదులుతానని, కిష్టయ్య కుటుంబాన్ని గ్రామంలో ఉండనివ్వనని బెదిరించాడు. మనస్తాపం చెందిన కిష్టయ్య గురువారం సాయంత్రం తన పొలం వద్ద పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు, కుటుంబసభ్యులు వెంటనే సిద్దిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీకి తరలించారు.

పన్నులు పిండండి.. ఆదాయం పెంచండి

- నెలవారీ టార్గెట్లు నిర్దేశించుకోండి
- ప్రతి నెలా మొదటివారంలో సమీక్షిస్తా
- పన్నుల ఎగవేతపై కఠినంగా ఉండండి
- జీఎస్టీ రాబడిని పెంచే మార్గాలు వెతకండి
- మద్యం అక్రమ సరఫరాకు అడ్డుకట్టవదాలి
- ఆదాయం తెచ్చే వనరులు, పన్నుల వసూళ్లపై నజర్
- ఏవియేషన్ ఇంధనంపై ఉన్న పన్ను సవరణపై పరిశీలన
- ఆదాయ మార్గాల పెంపుపై మంత్రులు, అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష



గురువారం సచివాలయంలో పలు శాఖలపై నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న సీఎం రేవంత్. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొంగులేటి, జూపల్లి, సీఎస్ శాంతికుమారి

హైదరాబాద్, జూలై 11 (నమస్తే తెలంగాణ): పన్నుల వసూళ్లలో కఠినంగా వ్యవహరిస్తూ, రాష్ట్ర ఆదాయం పెంచాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో నిర్దేశించిన వార్షిక లక్ష్యంతో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరం జూన్ వరకు వచ్చిన ఆదాయం అంత ఆశాజనకంగా లేదని అసంతృప్తి వ్యక్తంచేశారు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో పొందుపరిచిన వార్షిక లక్ష్యాన్ని చేరుకోవాలంటే, నెలవారీ లక్ష్యాలు నిర్దేశించుకోవాలని సూచించారు. నిర్దిష్ట ఆదాయ లక్ష్యాలపై ఇకనుంచి ప్రతి నెలా మొదటివారంలో తానే సమీక్ష నిర్వహిస్తానని తెలిపారు. ప్రతి శుక్రవారం ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క సంబంధిత శాఖల లక్ష్య సాధన పురోగతిపై సమావేశమవుతారని చెప్పారు. రాష్ట్రానికి ఆదాయం తెచ్చిపెట్టే ఎక్సైజ్, వాణిజ్య పన్నులు, మైనింగ్, స్టాంపులు, రిజిస్ట్రేషన్లు, రవాణా విభాగాల అధికారులతో సీఎం ఏ రేవంత్‌రెడ్డి.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావుతో కలిసి గురువారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రానికి ఆదాయం తెచ్చిపెట్టే విభాగాలన్నీ నిర్దిష్ట వార్షిక లక్ష్యాన్ని సాధించేందుకు ప్రయత్నించాలని అధికారులను ఆదేశించారు. ఇసుక, ఖనిజ వనరుల ద్వారా వచ్చే ఆదాయం పెరగాలంటే అక్రమ రవాణా, లీకేజీలను అరికట్టాలని సూచించారు. గత ఆర్థిక సంవత్సరం కంటే ఈ ఏడాది మరింత ఆదాయం వచ్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. పన్నుల ఎగవేత లేకుండా అన్ని విభాగాలు కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఆదాయ వనరులు, పన్నుల వసూళ్ల విషయంలో అధికారులు నిక్కచ్చిగా వ్యవహరించాలని ఆదేశించారు. ప్రధాన ఆదాయ మార్గమైన జీఎస్టీ ఆదాయం పెంపుదలకోవడానికి కావాల్సిన అన్ని చర్యలను వెంటనే చేపట్టాలని సూచించారు. జీఎస్టీ రాబడి పెంపునకు వాణిజ్య పన్నుల శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని, పకడ్బందీగా ఆడిటింగ్ నిర్వహించాలని ఆదేశించారు. పెట్రోలు, డీజిల్‌పై వ్యాట్ ద్వారా వచ్చే ఆదాయం తగ్గిందని, దానికి ప్రత్యామ్నాయంగా ఏవియేషన్ ఇంధనంపై ఉన్న పన్నును సవరించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు.

మద్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలి

రాష్ట్రంలో ఎన్నికల సమయంలో మద్యం విక్రయాలు ఎక్కువగా జరిగినప్పటికీ ఆదాయం పెరగక పోవడానికి కారణాలను సీఎం రేవంత్‌రెడ్డి ఆరా తీశారు. మద్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ను అరికడితే ఆదాయం పెరిగే అవకాశం ఉన్నదని ఈ సందర్భంగా చర్చించారు. డిస్టిలరీల నుంచి మద్యం అడ్డదారి పట్టకుండా నిఘా పెట్టాలని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఇప్పటికే రాష్ట్రంలో భూములు, స్థిరాస్తుల రేట్లు భారీగా పెరిగాయని, రిజిస్ట్రేషన్లు, స్టాంపుల ద్వారా వచ్చే ఆదాయం పెరిగేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించేందుకు పరిమిత కాలం పన్ను సబ్సిడీ అమల్లోకి వచ్చిందని, తిరిగి పన్ను వసూలు చేయడం ద్వారా వాహనాల అమ్మకాలపై ఏమైనా ప్రభావం పడిందా? అన్న అంశంపై అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.

అదానీకి అప్పగిస్తే ఒప్పుకోం

> మొదటిపేజీ తరువాయి...

యాజమాన్యం రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. సంస్థ డీపీఆ, విజిలెన్స్‌ను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు.

దావోస్‌లోనే అదానీతో లోపాయికారీ ఒప్పందం

అదానీతో దావోస్‌లోనే లోపాయికారీ ఒప్పందం జరిగిందని, వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సు వేదికగా తెలంగాణ కరెంట్‌పై గుత్తాధిపత్యాన్ని అదానీ చేతుల్లో పెట్టడానికి సీఎం రేవంత్‌రెడ్డి అంగీకరించారని యూనియన్ నేతలు ఆరోపించారు. అదానీతో సీఎం రేవంత్‌రెడ్డి చేసుకున్న ఒప్పందాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్, జెన్‌కో, ట్రాన్స్‌కో వంటి సంస్థలన్నీ ప్రజలు చెల్లించిన కరెంట్ బిల్లులతో సంపాదించిన ఆస్తులని తెలిపారు. ఇదేమీ ప్రైవేటు ప్రాపర్టీ కాదని, దీనిపై చేసుకునే ఒప్పందం కూడా పబ్లిక్ డాక్యుమెంటేనని గుర్తుచేశారు. నాలుగు కోట్ల మంది ప్రజలకు చెందిన ఈ ఆస్తులను అదానీకో, అంబానీకో ఇస్తామని అంటే 55 వేల మంది విద్యుత్తు ఉద్యోగులు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. అదానీకి కరెంట్ పంపిణీ వ్యవస్థను, బిల్లుల వసూలును అప్పగించి ఉద్యోగులను ఏం చేస్తారని ప్రశ్నించారు. ఉద్యోగులకు రక్షణ కల్పిస్తే ఎంత పెద్దవాళ్లైనా, ఎంతటి పహిల్వాన్‌లైనా పోటీకి అవసరమైతే ఇచ్చి కరెంట్ సప్లయ్ ఆపేసే సత్తా తమకు ఉందని స్పష్టం చేశారు. సంస్థ ప్రయోజనాల కోసం, సంస్థను సంరక్షించుకునేందుకు తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యుత్తు సవరణ బిల్లు-2022ను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సంస్థ సీఎండీకి అందజేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కే ఈశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి వీ గోవర్ధన్, ప్రెసిడెంట్ కుమారచారి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్ స్వామి, ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్‌నారాయణ, మధు, నాగేశ్వర్‌రావు, వెంకటేశ్వర్‌రావు, కార్యదర్శులు సుధాకర్, రవీంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అదానీపై వైఖరి స్పష్టం చేయండి: కేటీఆర్

అదానీ విషయంలో లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ తన వైఖరిని ప్రకటించాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు డిమాండ్ చేశారు. అదానీ విద్యుత్తు సంస్థల వ్యవహారంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఆవకాశవాద, ద్వంద్వ వైఖరిపై రాహుల్‌గాంధీకి గురువారం ఎక్స్ వేదికగా కేటీఆర్ మరోసారి చురకలు అంటించారు. అదానీ విద్యుత్తుపై కాంగ్రెస్ పార్టీ వైఖరి అర్థం చేసుకోవడం కష్టమంటూ కేటీఆర్ ఎద్దేవా చేశారు. అదానీ విద్యుత్తు సంస్థకు వ్యతిరేకంగా మహారాష్ట్రలో నిరసన కార్యక్రమాలు చేపట్టిన కాంగ్రెస్ శ్రేణులు, మరో వైపు అదే అదానీ సంస్థకు స్వాగతం చెప్పడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు.



నూతన డీజీపీ జితేందర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న తెలంగాణ పోలీసు అధికారుల సంఘం నేతలు

డీజీపీని కలిసిన పోలీసు అధికారుల సంఘం

హైదరాబాద్, జూలై 11 (నమస్తే తెలంగాణ): నూతన డీజీపీ జితేందర్‌ను తెలంగాణ పోలీసు అధికారుల సంఘం గురువారం కలిసి శుభాకాంక్షలు తెలిపింది. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు గోపిరెడ్డి, హైదరాబాద్ సిటీ అధ్యక్షుడు నల్ల శంకర్‌రెడ్డి, రాచకొండ అధ్యక్షుడు భద్రారెడ్డి, నాగర్‌కర్నూల్ అధ్యక్షుడు గుణవర్ధన్, మహబూబ్‌నగర్ అధ్యక్షుడు వెంకటయ్య, వరంగల్ అధ్యక్షుడు కోటేశ్, నల్లగొండ అధ్యక్షుడు జయరాజు, సీఐడీ అధ్యక్షుడు మల్లికార్జున్, పీటీవో అధ్యక్షుడు వెంకటరెడ్డి, నిజామాబాద్ అధ్యక్షుడు మహమ్మద్ షకీల్ పాల్గొన్నారు. అలాగే తెలంగాణ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు కలిసి ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, అసోసియేట్ ప్రెసిడెంట్ శ్యామ్ పాల్గొన్నారు.

కొత్త డీజీపీకి టీజీవో అభినందనలు



రాష్ట్ర నూతన డీజీపీగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ జితేందర్‌ను తెలంగాణ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు గురువారం కలిసి ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి ఏ సత్యనారాయణ, అసోసియేట్ ప్రెసిడెంట్ బీ శ్యామ్, నాయకులు నరహరిరావు, కృష్ణయాదవ్, పరమేశ్వర్‌రెడ్డి, కిషన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మెగా పవర్‌లూం క్లస్టర్‌ను సిరిసిల్లకు తీసుకురావాలి

- పదేండ్లుగా కేంద్రాన్ని కోరినా ఫలితం శూన్యం
- కాంగ్రెస్ సర్కార్ విధానాలతో చేనేత సంక్షోభం
- కేంద్రమంత్రి బండి సంజయ్‌కు కేటీఆర్ లేఖ



హైదరాబాద్, జూలై 11 (నమస్తే తెలంగాణ): సిరిసిల్లలో మెగా పవర్ లూమ్ క్లస్టర్ ఏర్పాటు చేసేందుకు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కృషి చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కోరారు. కేంద్రంలో బీజేపీ సారథ్యంలోని ప్రభుత్వమే అధికారంలో ఉన్నందున ప్రధాని మోదీని ఒప్పించి సిరిసిల్లా మెగా పవర్ లూమ్ క్లస్టర్‌ను తీసుకొచ్చే బాధ్యత తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పదేండ్లు కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉన్నా, ఎంపీగా ఐదేండ్ల క్రితం కూడా బండి సంజయ్ ఎన్నికై అయినా నేతన్నలకు నిరాశే ఎదురైందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పదేండ్లుగా సిరిసిల్లకు మెగా పవర్ లూమ్ క్లస్టర్‌ను తీసుకొచ్చేందుకు తాను ఎన్ని ప్రయత్నాలు చేసినా కేంద్రం నుంచి సరైన స్పందన రాలేదని చెప్పారు. కేంద్రంలో స్మృతి ఇరానీ, అరుణ్ జైట్లీ వంటి అనేక మంది మంత్రులను తాను స్వయంగా కలిసి 10 లేఖలు రాసినా దక్కింది శూన్యమని పేర్కొన్నారు. ప్రస్తుతం కేంద్రంలో మంత్రిగా ఉన్న బండి సంజయ్‌కు సిరిసిల్ల నేతన్నలకు సేవ చేసేందుకు సరైన సమయంగా గుర్తించాలని ఆయన గుర్తుచేశారు. బడ్జెట్‌లో సిరిసిల్ల ప్రాంతానికి మెగా పవర్ లూమ్ క్లస్టర్‌ను ప్రకటించేలా కేంద్రాన్ని ఒప్పించాలని విజ్ఞప్తి చేశారు.

ఆత్మహత్యల్లేని సిరిసిల్ల కోసం..

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి సిరిసిల్లలో మళ్లీ నేతన్నల ఆత్మహత్యలు మొదలయ్యాయని, చేనేత రంగం సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నదని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎనో సార్లు కోరినా పట్టించుకోవటంలేదని, సిరిసిల్లలో మెగా పవర్ లూమ్ క్లస్టర్ ఏర్పాటు చేస్తే ఇక్కడి నేతన్నల కష్టాలు కొంత మేరకు తీరుతాయని ఆశాభావం వ్యక్తంచేశారు. చేతినిండా పనిదొరికి మళ్లీ ఆత్మహత్యలులేని సిరిసిల్లను చూసే అవకాశం ఉంటుందని ఆయన విశ్వాసం వ్యక్తంచేశారు.

ఈ మహా నగరానికి ఏమైంది?

శాంతిభద్రతలు పూర్తిగా అదుపుతప్పాయి.. ఎక్స్ వేదికగా కేటీఆర్

హైదరాబాద్, జూలై 11 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మహానగరంలో శాంతిభద్రతలపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు ఆందోళన వ్యక్తంచేశారు. పత్రికల్లో 'ఈ నగరానికి ఏమైంది?' అని వార్తలు రావడంపై ఆయన స్పందించారు. పరిపాలనా అనుభవంలేని నాయకత్వం ఎలా ఉంటుందో హైదరాబాద్ నుంచి తెలంగాణ పల్లెల వరకూ కనిపిస్తున్నదని ఆయన ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. విశ్వనగరంగా ఎదుగుతున్న వేళ.. హైదరాబాద్ బ్రాండ్ మసకబారుతున్నదని ఆందోళన వ్యక్తంచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు వస్తున్నా పోలీసింగ్‌పై కమాండ్ ఏదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక నగరంలో క్రైం రేటు పెరగడంపై ఆందోళన వ్యక్తం చేశారు. వేలాదిమంది యువత భవిష్యత్తు కొట్టుకుంటా దిక్కుల్లో ఉన్న రాష్ట్ర రాజధానిని కాపాడాలని కోరారు. కాంగ్రెస్ సర్కారు మేల్కొనకపోతే.. హైదరాబాద్ ప్రతిష్ఠ దెబ్బతింటే రాష్ట్రానికే కాకుండా యావత్ దేశానికి నష్టమని స్పష్టంచేశారు. హైదరాబాద్ తెలంగాణ ఎకానమిక్ ఇంజిన్ అని అభివర్ణించారు.

తలలు పగలగొట్టడమే ప్రజాపాలనా?

- రేవంత్‌రెడ్డిది నిరంకుశ పాలన
- ఆ పోలీసులను వదలం
- విద్యార్థుల్ని అధికారం కోసం వాడుకున్న రేవంత్ సన్నాసా? రాహులా?
- విద్యార్థులకు రేవంత్ క్షమాపణ చెప్పాలి: కేటీఆర్



బీఆర్‌ఎస్వీ నాయకుడికి తగిలిన దెబ్బను బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు చూపిస్తున్న గెల్లు శ్రీనివాస్. చిత్రంలో ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

హైదరాబాద్, జూలై 11 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నవారి తలలు, వీపులు పగలగొట్టడం, ప్రజలపై పోలీసులతో దాడులు చేయడమే ప్రజాపాలనా? అంటూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు కాంగ్రెస్ పాలనపై నిప్పులు చెరిగారు. సోషల్‌మీడియాలో పోస్టులు పెడితే కూడా భరించలేని నిరంకుశ మనస్తత్వంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. విధులు నిర్వర్తిస్తున్న జర్నలిస్టులపై పోలీసు దాడులు చేస్తూ ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. గురువారం ఆయన బీఆర్‌ఎస్వీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఉద్యోగాలు, నోటిఫికేషన్ల గురించి అడిగినవారిని అవమానపరిచేలా రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. ఇందుకు రేవంత్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రెండు లక్షల ఉద్యోగాల హామీని నెరవేర్చాలని డిమాండ్ చేస్తున్న నిరుద్యోగులు, విద్యార్థులను రాజకీయాలకు రేవంత్‌రెడ్డి అంటగడుతున్నారని మండిపడ్డారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డితో సహా అనేకమందిని విద్యార్థులు కలిశారని, ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్న తమతోపాటు ఇతర పార్టీ నాయకులను కలుస్తున్నారని చెప్పారు. విద్యార్థుల ముసుగు వేసి వారిని ఎన్నికల కోసం వాడుకున్న రేవంత్‌రెడ్డి సన్నాసా? లేక అప్పుడు వారిని కలిసిన రాహుల్‌గాంధీ సన్నాసా? ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. పాత ఆరాచకాల కాంగ్రెస్ పార్టీ మోసపూరితంగా కొత్త రూపంలో వచ్చిందనే విషయాన్ని ప్రజలు అర్థం చేసుకుంటున్నారని చెప్పారు. ఎన్నికల హామీలను అమలు చేయకపోగా, ఇప్పటికే ఉన్న సంక్షేమ పథకాలను కూడా రద్దు చేస్తున్నారని విమర్శించారు. ఇదేమి అన్యాయమని అడిగినవారిపై కేసులు నమోదు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు వద్దన్న కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి రాగానే ఏడు కొత్త వాటికి అనుమతులు ఇచ్చిందని చెప్పారు. నాడు 50 వేల ఉద్యోగాలతో మెగా డీఎస్సీ విడుదల చేయాలని డిమాండ్ చేసిన రేవంత్‌రెడ్డి నేడు ఆ మాటే మర్చిపోయారని దుయ్యబట్టారు. 6 వేల ఉద్యోగాలే అదనంగా చేర్చి యువతను మోసం చేస్తున్నారని మండిపడ్డారు.

ప్రతి ఒక్కరు తెలంగాణ కథానాయకులే

ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న ప్రతి ఒక్క తెలంగాణ యువకుడు తెలంగాణ కథానాయకుడిగా నిలబడిపోతారని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని విద్యార్థులు, నిరుద్యోగులు మర్చిపోరని హెచ్చరించారు. విద్యార్థులపై పోలీసులు చేస్తున్న దాడులను విద్యార్థి నాయకులు తమ డైరీలో నమోదు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. విద్యార్థులపై, ప్రజలపై దాడులు చేస్తున్న పోలీస్ అధికారులను, తాము అధికారంలోకి వచ్చాక వదిలిపెట్టబోమని హెచ్చరించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో 1.62 లక్షలకుపైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని, మరో 40 వేల ఉద్యోగాల భర్తీ ప్రక్రియ కొనసాగుతూ ఉండేదని చెప్పారు. అందులోంచి 30 వేల ఉద్యోగాల నియామక పత్రాలను రేవంత్‌రెడ్డి ఇచ్చి తామే ఉద్యోగాలు ఇచ్చామని చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం ఉద్యోగాల్లో 95% స్థానిక రిజర్వేషన్లు కల్పించామని చెప్పారు. పార్టీ విద్యార్థి విభాగం నుంచి అనేకమంది నాయకులకు ప్రజాప్రతినిధులుగా, చైర్మన్లుగా, మేయర్లుగా, జిల్లా స్థాయి అధ్యక్షులుగా అవకాశాలు కల్పించామని వివరించారు. నిజాయితీపరులు, దమ్మున్న నాయకులు బీఆర్‌ఎస్‌కు ఆస్తిగా ఉన్నారని చెప్పారు. 2009-2014 మధ్య తెలంగాణ కోసం విద్యార్థులు చేసిన పోరాటాలను ఇప్పటి విద్యార్థులకు చెప్పాలని సూచించారు. విద్యారంగంలో జరిగే ప్రతి అన్యాయంపై విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ఆందోళనలు కొనసాగాలని దిశానిర్దేశం చేశారు. సమావేశంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తలారి స్వామియాదవ్, తుంగ బాలు, పడాల సతీశ్ పాల్గొన్నారు.



నిరాహార దీక్షను విరమించిన అశోక్

హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై11 (నమస్తే తెలంగాణ): నిరుద్యోగుల డిమాండ్ల సాధన కోసం గత పది రోజులుగా దీక్ష చేస్తున్న అశోక్ దీక్ష విరమించారు. గురువారం సాయంత్రం వివిధ సంఘాల నాయకులు చైతన్యపురిలో అశోక్‌ను కలిసి సంఘీభావం ప్రకటించారు. ఆయన ఆరోగ్యం విషమించడంతో విద్యార్థులతో కలిసి దీక్షను విరమింపజేశారు. ఈ సందర్భంగా టీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాంయాదవ్ మాట్లాడుతూ.. అశోక్‌ది కేవలం దీక్ష విరమణ మాత్రమేనని, పోరాట విరమణ కాదని చెప్పారు. విద్యార్థుల పక్షాన ఎంతవరకైనా కొట్లాడతామని, నిరుద్యోగుల డిమాండ్లు సాధిస్తామని పేర్కొన్నారు. జూలై 15న సచివాలయం ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లోనే రేవంత్‌రెడ్డి పతనం ప్రారంభమైందని విమర్శించారు.

జర్నలిస్టు శ్రీచరణ్‌పై దాడి హేయం

హనుమకొండ, మహబూబాబాద్‌లో నిరసన

హనుమకొండ చౌరస్తా, మహబూబాబాద్ రూరల్, జూలై 11 : ఉస్మానియా యూనివర్సిటీలో జర్నలిస్టులపై పోలీసులు చేసిన దాడిని ఖండిస్తూ గురువారం టీయూడబ్ల్యూజే (హెచ్-143) హనుమకొండ జిల్లా శాఖ పక్షాన గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లో నిరసన తెలిపారు. డీఎస్సీ పరీక్ష వాయిదా వేయాలని ఓయూలో నిరుద్యోగ యువకులు ఆందోళన చేస్తుంటే కవర్ చేయడానికి వెళ్లిన జీ న్యూస్ జర్నలిస్టు శ్రీచరణ్‌ను పోలీసులు అరెస్టు చేయడం హేయనీయమని, పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించడం మీడియా భావప్రకటన స్వేచ్ఛను హరించడమేనని అన్నారు. అటు.. మహబూబాబాద్‌లోని నెహ్రూసెంటర్ వద్ద జర్నలిస్టులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తంచేశారు.



డీఎస్సీ వాయిదా వేయాలని జనగామలో మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న నిరుద్యోగ జేఏసీ ప్రతినిధులు

మోకాళ్ల పై నిల్చొని నిరుద్యోగ జేఏసీ నేతల నిరసన

- డీఎస్సీ వాయిదా వేయాలి
- నిరుద్యోగ జేఏసీ కన్వీనర్ మంగళంపల్లి రాజా పిలుపు

జనగామ, జూలై 11 (నమస్తే తెలంగాణ) : డీఎస్సీ వాయిదా వేయాలని కోరుతూ జనగామలో నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో గురువారం యువకులు మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపారు. నిరుద్యోగుల సమస్యల పరిష్కారం, డీఎస్సీ వాయిదా వంటి అంశాలపై మంత్రులు, ఎమ్మెల్యేలను ఎక్కడికక్కడ నిలదీయాలని నిరుద్యోగ జేఏసీ కన్వీనర్ మంగళంపల్లి రాజా పిలుపునిచ్చారు. నిరుద్యోగులు కోచింగ్ సెంటర్లకు అమ్ముడుపోయారని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించడాన్ని తెలంగాణ నిరుద్యోగ జేఏసీ తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. నిరసనలో నిరుద్యోగ జేఏసీ నాయకులు, కేయూ జేఏసీ నాయకులు గన్ను కార్తీక్, ఆవల సుభాష్, తుంగ కౌశిక్, వెంపటి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ వాయిదాకు ఢిల్లీకి నిరుద్యోగులు

> మొదటిపేజీ తరువాయి...

చేసుకోవాలని కోరింది. రాష్ట్రవ్యాప్తంగా 11,062 టీచర్ పోస్టులకు జూన్ 20 వరకు దరఖాస్తులు స్వీకరించారు. దాదాపు 2.7 లక్షల మంది కిపైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. అభ్యర్థులు తమ పేమెంట్ రిఫరెన్స్ ఐడీ లేదా ఆధార్ నంబర్, పోస్టు క్యాటగిరీ, మాధ్యమం, పుట్టిన తేదీ వివరాలను ఎంటర్‌చేసి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. వివరాలకు https://tsdsc.aptonline.in/tsdsc/Hallticket ను చూడవచ్చు.

న్యాయవాదిపై పోలీసుల దాడి హేయం

- సిద్దిపేట ఘటనపై హైకోర్టు బార్ అసోసియేషన్ ఖండన

హైదరాబాద్, జూలై11 (నమస్తే తెలంగాణ): సిద్దిపేటలో ఓ న్యాయవాదిపై పోలీసులు దాడి చేయడాన్ని హైకోర్టు బార్ అసోసియేషన్ తీవ్రంగా ఖండించింది. హైకోర్టు ఆవరణలో గురువారం న్యాయవాదులు పోలీసుల చర్యపై నిరసన తెలిపారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒక కేసులో ముందస్తు బెయిల్ ఉత్తర్వుల ప్రతిని సమర్పించేందుకు వెళ్లిన న్యాయవాది రవికుమార్‌పై ఏసీపీ ఉమారెడ్డి దాడి చేయడం హేయమని మండిపడ్డారు. సీఐ ఆదేశాలకు అనుగుణంగానే ఏసీపీ దాడి చేశారని ఆరోపించారు. ఈ సందర్భంగా హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆయ్యాడపు రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. దాడిని ప్రశ్నించిన న్యాయవాది పోన్‌ను లాక్కోవడమే కాకుండా తీవ్రంగా గాయపరిచారని ఆరోపించారు. పైగా, న్యాయవాదే విధులకు ఆటంకం కలిగించారని పోలీసులు తప్పుడు కేసు నమోదు చేశారన్నారు. డీజీపీ జోక్యం చేసుకుని ఏసీపీతో పాటు తప్పుడు ఎఫ్‌ఐఆర్ నమోదులో పాల్గొన్న పోలీసులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఏసీపీ ఉమారెడ్డిపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేయడంతోపాటు న్యాయవాదిపై పెట్టిన ఎఫ్‌ఐఆర్‌ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు దీప్తి, కార్యదర్శులు శాంతిభూషణ్, సంజీవ్, సంయుక్త కార్యదర్శి సదీప్‌కుమార్, న్యాయవాదులు పాల్గొన్నారు.

దాడులు చేయడమే ప్రజాపాలనా?

- శాంతియుతంగా నిరసన తెలిపితే తప్పా?
- ఉస్మానియా యూనివర్సిటీని పోలీస్ క్యాంప్‌గా మార్చిండ్రు
- హాస్టళ్లు, లైబ్రరీల్లోకి వచ్చి అరెస్టులా?
- జర్నలిస్టులు, నిరుద్యోగులపై దాడి చేసిన పోలీసుల్ని సస్పెండ్ చేయాలి
- విద్యార్థి సంఘాల డిమాండ్

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 11: 'ఉస్మానియా యూనివర్సిటీలో జర్నలిస్టులు, నిరుద్యోగులపై దాడిచేసిన పోలీసులను వెంటనే సస్పెండ్ చేయాలి. ప్రజాపాలన అంటే దాడులు చేయడమా? శాంతియుతంగా నిరసన తెలిపితే తప్పా? ఓయూలో 300మంది పోలీస్ సిబ్బంది ఎందుకు మోహరా కాస్తున్నట్లు? దీనిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలి' అని వివిధ విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. బుధవారం ఓయూలో నిరసన తెలుపుతున్న నిరుద్యోగులు, విద్యార్థులు, వార్తల కవరేజీకి వెళ్లిన జర్నలిస్టులపై పోలీసుల దాడి, అరెస్టులను తీవ్రంగా ఖండించాయి. ఏబీవీపీ ఓయూ కార్యదర్శి నెల్లి సత్య మాట్లాడుతూ ఎన్నికల సమయంలో నిరుద్యోగులు, విద్యార్థులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ వెంటనే అమలు చేయాలని, అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు కావస్తున్నా హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. డిమాండ్ల సాధన కోసం నిరుద్యోగులు శాంతియుతంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలుపుతుంటే పరిష్కరించకుండా ఓయూను పోలీస్ క్యాంపుగా మార్చారని, హాస్టళ్లు, క్లాస్‌రూములు, లైబ్రరీల్లోకి చొరబడి అరెస్టులు చేస్తూ, భౌతిక దాడులకు తెగబడుతున్నారని ధ్వజమెత్తారు. బీఆర్‌ఎస్ పాలనలో ఎన్నడూ హాస్టళ్లలోకి చొరబడి విద్యార్థి నాయకులను అరెస్టు చేసిన సందర్భాలు లేవని గుర్తుచేశారు. ఓయూలో పోలీసు మోహరాను తొలగించి ప్రజాస్వామిక వాతావరణాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.


దాడి అమానుషం: పీడీఎస్‌యూ

ఓయూలో పోలీసుల దాడులు అమానుషమని, ఈ ఘటనను ఖండిస్తున్నామని పీడీఎస్‌యూ జాతీయ నాయకుడు ఎస్. నాగేశ్వరరావు, ఓయూ అధ్యక్షుడు సుమంత్ చెప్పారు. ప్రతిష్ఠాత్మక ఆర్ట్స్ కళాశాల తెలంగాణ ప్రజలకు భరోసా కేంద్రమని, ఇక్కడినుంచి తమ గొంతు వినిపిస్తే న్యాయం జరుగుతుందనే భావన ప్రజల్లో ఉంటుందని, అలాంటి ఓయూలో పదేళ్లలో ఎన్నడూ లేనివిధంగా పోలీసులు పిడిగుద్దులు గుద్దుతూ, గల్లాలు పట్టి ఈడ్చుకుపోవడం తీవ్ర అన్యాయమని ఆవేదన వ్యక్తంచేశారు. దాడిచేసిన పోలీసులపై చర్యలు తీసుకోకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

ప్రశ్నించే గొంతుక ఓయూ: టీజీవీపీ

ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, ప్రశ్నించే గొంతుక ఉస్మానియా యూనివర్సిటీ అని టీజీవీపీ రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి ప్రశాంత్ పేర్కొన్నారు. ఓయూలో దాడులు ప్రజాస్వామ్యానికే విరుద్ధమని, ఆ పోలీసులను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

అక్రమ అరెస్టులు దారుణం: ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్



నిరుద్యోగులు, జర్నలిస్టుల అక్రమ అరెస్టులు దారుణమని దక్షిణ భారత జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ ఆవేదన వ్యక్తంచేశారు. తార్నాకలోని తన కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ న్యాయం చేయాలని మూడు నెలలుగా 30 లక్షల మందికి పైగా నిరుద్యోగులు నిరసన తెలుపుతుంటే పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం, మరోవైపు విధుల్లో ఉన్న విలేకరులపై దౌర్జన్యం చేస్తూ అరెస్టు చేయడం ప్రజాస్వామ్యమా? అని ప్రశ్నించారు. తక్షణమే వారందరినీ బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిరాహార దీక్ష చేస్తున్న బక్క జడ్సన్, అశోక్ ప్రాణాలకు ఎలాంటి ప్రమాదం ఏర్పడినా రేవంత్‌రెడ్డి ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు.



సమీక్ష సమావేశంలో మండలి చైర్మన్ గుత్తా, స్పీకర్ గడ్డం ప్రసాద్, మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, సీఎస్ శాంతికుమారి తదితరులు

అధికారులు ప్రొటోకాల్ పాటించరా?

- వారికి స్పష్టమైన ఆదేశాలివ్వండి
- స్పీకర్, మండలి చైర్మన్ అసంతృప్తి
- సీఎస్, డీజీపీతో సమీక్ష సమావేశం
- 24 నుంచి అసెంబ్లీ సమావేశాలు?

హైదరాబాద్, జూలై 11 (నమస్తే తెలంగాణ) : ప్రొటోకాల్ విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల పర్యటనలు, కొన్నిసార్లు స్పీకర్, మండలి చైర్మన్లకు కూడా అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని సీఎస్ శాంతికుమారి, డీజీపీ జితేందర్ దృష్టికి తీసుకొచ్చారు. అసెంబ్లీ సమావేశాలను ఈనెల 24న ప్రారంభించాలని ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో గురువారం స్పీకర్ చాంబర్‌లో వివిధ శాఖల ఉన్నతాధికారులతో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్ కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నెల 23న కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన అనంతరం రాష్ట్రప్రభుత్వం కూడా బడ్జెట్ సమావేశాలు నిర్వహించాల్సి ఉన్నందున తగిన ఏర్పాట్లపై చర్చించారు. జిల్లాల్లో స్పీకర్, చైర్మన్ పర్యటించినప్పుడు ఆర్డీవో, కనీసం ఎమ్మార్వో స్థాయి అధికారి రావాల్సి ఉన్నా ఎక్కడా పాటించడంలేదని, జిల్లాల్లో అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాల్లో కనీస ప్రొటోకాల్ పాటించడం లేదని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొచ్చారు. మంత్రుల పర్యటనల్లోనూ పోలీసులు ప్రొటోకాల్ పాటించడం లేదని చెప్పారు. ఎస్పై స్థాయిలో బందోబస్తు ఏర్పాటు చేయాల్సి ఉన్నా అమలు కావడంలేదన్నారు. ప్రొటోకాల్‌పై ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని, ఇది భవిష్యత్తులో ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలని, అధికారులకు ఆదేశాలివ్వాలని సీఎస్, డీజీపీలకు సూచించారు. జిల్లాలకు కొత్తగా ఉన్నతాధికారులు బదిలీపై వస్తే మర్యాదపూర్వకంగా స్పీకర్, చైర్మన్‌ను కలవాల్సి ఉంటుందని, ఇదికూడా జరగడంలేదని వాపోయారు. ఎయిర్‌పోర్ట్‌లో స్పీకర్, చైర్మన్, ఇతర చట్టసభల ప్రజాప్రతినిధులకు ప్రొటోకాల్ పాటించడం లేదని, సినిమా వారికి, సెలబ్రిటీలకు పాటిస్తున్న ప్రొటోకాల్‌ను కూడా చట్టసభల అధిపతులు, ప్రజాప్రతినిధులకు ఇవ్వడంలేదని, దీనిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. శాసనసభ, శాసనమండలి, తెలంగాణ స్టేట్ సెక్రటేరియట్‌లో పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. సమావేశంలో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.


నల్లనేలలో 'ఎర్ర' చట్టం!

- సింగరేణిలో 'ఎల్లో, రెడ్' వార్నింగ్
- యాజమాన్యం కొత్త సర్క్యులర్
- సంజాయిషీకి అవకాశమే లేదు
- భూపాలపల్లిలో 34 మందికి కార్డులు జారీ

జయశంకర్ భూపాలపల్లి, జూలై 11 (నమస్తే తెలంగాణ): సింగరేణిలో యాజమాన్యం మరో నల్లచట్టం తీసుకొచ్చింది. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలతో చర్చించకుండానే దానిని అమలు చేసింది. ఎల్లో, రెడ్ కార్డుల పేరుతో తీసుకొచ్చిన ఈ కొత్త సర్క్యులర్‌తో కార్మికుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. గనిలో కార్మికుడు తప్పు చేసినా, నిబంధనలు ఉల్లంఘించినా మొదట ఎల్లో కార్డు పేరుతో కార్మికుడి సెల్‌ఫోన్‌కు మెసేజ్ పంపిస్తారు. ఇలా రెండు మూడు సార్లు ఎల్లో కార్డు మెసేజ్ తర్వాత రెడ్ కార్డ్ మెసేజ్ వస్తుంది. అనంతరం కార్మికుడిపై చర్యలకు సిద్ధం చేస్తారు. ఇక కార్మికుడు సంజాయిషీ ఇచ్చుకునే పరిస్థితి ఉండదు. ఉత్పత్తి, ఉత్పాదకతే లక్ష్యంగా సింగరేణి సంస్థ ముందుకుపోతూ.. కార్మికులపై నల్ల చట్టాలను అమలు చేస్తూ మానసికంగా హింసిస్తున్నదని కార్మిక సంఘాలు మండిపడుతున్నాయి. తాజాగా యాజమాన్యం అమలు చేస్తున్న నూతన సర్క్యులర్‌తో కార్మికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. భూపాలపల్లి ఏరియాలో ఒక్క నెలలోనే 34 మందికి రెడ్, ఎల్లో కార్డులు జారీ చేశారంటే.. సింగరేణి వ్యాప్తంగా ఎంతమందికి జారీ చేసి ఉంటారో అవగతమవుతున్నది.

విచారణకు స్వస్తి

గనుల్లో ఏదైనా ప్రమాదాలు, తప్పులు జరిగితే.. అలా ఎందుకు జరిగిందో తెలుసుకునేందుకు ఇక్కడ విచారణలుండవు. కొత్త సర్క్యులర్ ప్రకారం ఎల్లో కార్డు, అనంతరం రెడ్ కార్డులు జారీ చేసి చర్యలు తీసుకోవడమే ఉంటుంది. సదరు కార్మికుడు సంజాయిషీ ఇచ్చుకునే పరిస్థితి ఉండదు. సెల్‌ఫోన్‌కు ఎల్లో, రెడ్ కార్డు మెసేజ్ వస్తే.. శిక్ష అనుభవించడానికి సిద్ధంగా ఉండాల్సిందే. గతంలో కార్మికుడు గనిలో తప్పు చేస్తే విచారణ జరిపి తప్పు చేసినట్టు నిరూపణ అయితే చార్జిషీట్ ఇవ్వడం లేక మరో చర్య తీసుకునే వారు. డీజీఎంఎస్ విచారణలు కూడా జరిగేవి. ఇలాంటి విచారణలకు యాజమాన్యం స్వస్తి పలికింది. సింగరేణిలో పని చేసే కార్మికుల్లో నిరుద్యోగులే. సెల్‌ఫోన్లలో మెసేజ్‌లు చదువుకోవడం రాక, అక్షరాస్యులైతే ఒక్కోసారి చూసుకోలేకపోతే యాజమాన్యం చర్యలు తీసుకునే వరకు కార్మికుడికి తెలియని పరిస్థితి నెలకొంది. పనిస్థలాల్లో సరైన సౌకర్యాలు కల్పించకుండా, రక్షణ పరికరాలు అందించకుండా తప్పుచేసిన కార్మికుడిపై ఎల్లో, రెడ్ కార్డులు తీసుకురావడంపై కార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నాయి. కార్మికులకు సక్రమంగా బూట్లు, హెల్మెట్‌లు తదితర రక్షణ పరికరాలు అందించడం లేదని, కాలం చెల్లిన యంత్రాలతో పనులు చేయిస్తున్నారని, ఇలాంటప్పుడు ప్రమాదాలు జరగకుండా ఎలా ఉంటాయి? దీనికి కార్మికుడిని బాధ్యుడిని చేయడం ఎంతవరకు సమంజసం? అని ప్రశ్నిస్తున్నాయి.






కార్డులు రద్దు చేయాలి

అధికారుల ప్రమోషన్లు, ఆర్థిక ప్రయోజనాల కోసం కార్మికులను బలిపశువులను చేస్తున్నారు. రెడ్ కార్డు అందుకున్న ఉద్యోగికి చార్జిషీట్‌తోపాటు సస్పెన్షన్, ఇంక్రిమెంట్ కోత, డిస్మిస్ వంటి తీవ్రమైన క్రమశిక్షణ చర్యలకు యాజమాన్యం సిద్ధమవుతున్నది. ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ సంఘాలు యాజమాన్యానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నాయి. వెంటనే ఎల్లో, రెడ్ కార్డు విధానాన్ని రద్దు చేయాలి. లేకపోతే టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తాం

-మిర్యాల రాజిరెడ్డి, టీబీజీకేఎస్ అధ్యక్షుడు



చార్జిషీట్ ఇవ్వాలి

కార్మికుడు, అధికారి తప్పులు చేస్తే స్టాండింగ్ ఆర్డర్స్, మైన్స్ యాక్టులు, డీజీఎంఎస్ విచారణలు అనేకమున్నాయి. ఇప్పుడు కొత్తగా ఎల్లో, రెడ్ కార్డులు ఏంటి? ఇదేమైనా ఫుట్‌బాల్, హాకీ గేమ్‌లా? తమాషాగా ఉందా? తప్పు జరిగితే చార్జిషీట్ ఇవ్వాలి. ప్రిలిమినరీ విచారణ జరపాలి. ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ చేతగానితనం వల్లే యాజమాన్యం ఇలాంటి కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకొస్తున్నది. వెంటనే ఈ సిస్టం ఆపాలి. ఈ విషయమై సింగరేణి సీఎండీకి లేఖ రాసిన.

-రియాజ్ అహ్మద్, హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి

వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

ఆమెకు ఆర్థిక సాధికారత

ఎన్నిచెప్పినా.. మనదింకా, ఇంకా పురుషాధిక్య సమాజమే. ఇప్పటికీ కుటుంబ ఆర్థిక వ్యవహారాల్లో పురుషులే పెత్తనం చెలాయిస్తారు. భార్యాభర్తలు ఇద్దరూ సంపాదనాపరులైనా మనీ పర్సు మగాని చేతుల్లోనే ఉంటుంది. ఇక సంపాదన లేని గృహిణులైతే అస్వతంత్రులుగానే ఉండిపోవాల్సి వస్తుంది. కానీ, 'ఈ ఆర్థిక వివక్ష ఇంకానా, ఇకపై చెల్లదు'ని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. బుధవారం నాటి తీర్పు ఏ రకంగా చూసినా చరిత్రాత్మకమైందేనని చెప్పాలి. నిజానికి తీర్పు వెలువరించింది ఓ ముస్లిం మహిళ మనోవర్తికి సంబంధించింది. కానీ, సర్వోన్నత న్యాయస్థానం డబ్బు వ్యవహారాల్లో భార్యాభర్తల సంబంధాల్లో సుదూర పరిణామాలకు దారితీసే వ్యాఖ్యలు చేసింది. 'మతమేదైనా విడాకులు పొందిన మహిళకు ఆర్థిక రక్షణ కల్పించాల్సిందే' అనేది సుప్రీంకోర్టు మూల తీర్పు సారాంశం. విడాకులు పొందిన మహిళకు భరణం చెల్లించాలని సూచించే సీఆర్పీసీలోని 125వ సెక్షన్ మతాలతో ప్రమేయం లేకుండా అందరికీ వర్తిస్తుందని కోర్టు స్పష్టం చేసింది.

అయితే అంతటితో పరిమితిపెట్టకుండా వివాహం లోపలా, వెలుపలా మహిళకు సంపూర్ణ ఆర్థిక హక్కులు కల్పించాలని చేసిన వ్యాఖ్యలు కీలకమైనవి. 'నేను మగవాణ్ని, పైగా సంపాదిస్తున్నాను. కనుక డబ్బుకు సంబంధించి నా మాటే చెల్లుబాటు కావాల'నే ఆలోచన మారాలని సుప్రీంకోర్టు హితవు చెప్పింది. కుటుంబ ఆర్థిక వ్యవహారాల్లో భార్యకు సమాన భాగస్వామ్యం ఉంటుంది. కుటుంబం కోసం, పిల్లల కోసం ఉద్యోగాలు మానేసి ఇంటికే పరిమితమయ్యే భార్య విషయంలో భర్త ఆలోచనా ధోరణి సమూలంగా మారాలి. ఆమె త్యాగాన్ని గుర్తించి ఆర్థిక సాధికారత కల్పించాల్సిన సమయం వచ్చింది. అందుకు ఉమ్మడి బ్యాంకు ఖాతా తెరవడం, ఏటీఎం పిన్ పంచుకోవడం వంటివి అవసరమని కోర్టు అభిప్రాయపడింది. మారిపోయిన ఆలోచనా ధోరణిని బట్టి ఈ తరహా మార్పులు ఈ పాటికే చాలామంది అమలు చేస్తూ ఉండవచ్చు. సుప్రీంకోర్టు సూచనలు అలా అమలుచేయని వారి గురించే.

ఇక వివాహ బంధం విచ్ఛిన్నమైపోయి విడాకులు తీసుకున్నాక భరణం లేదా మనోవర్తి సమస్య వస్తుంది. ఇప్పటికే మతాలవారీగా తలోదారి కనిపిస్తుంది. కానీ, సుప్రీంకోర్టు అలా కుదరదని చెప్పింది. భరణం అనేది ఏదో దానంగా ఇచ్చేది కాదని, అది స్త్రీల హక్కు అని సర్వోన్నత న్యాయస్థానం నొక్కిచెప్పడం గమనార్హం. ఈ సందర్భంగా షాబానో కేసులో 1985 నాటి సుప్రీంకోర్టు తీర్పు, తదనంతరం 1986లో రాజీవ్ గాంధీ ప్రభుత్వం తెచ్చిన ముస్లిం మహిళల మనోవర్తి చట్టం గురించి తప్పకుండా ప్రస్తావించుకోవాలి. మతంతో సంబంధం లేకుండా విడాకులు పొందిన మహిళలందరికీ 125 సెక్షన్ కింద భరణం హక్కు ఉంటుందని అనాడు సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. దేశంలోని ప్రగతివాదులు ఆ తీర్పుపై హర్షామోదాలు వ్యక్తం చేశారు. కానీ, ఆ తీర్పును నీరుగారుస్తూ అప్పటి రాజీవ్‌గాంధీ ప్రభుత్వం చట్టం చేయడం వివాదాస్పదమైంది. ముస్లింల బుజ్జగింపు రాజకీయాల విషయం వస్తే ఈ చట్టాన్ని ఉటంకించడం సర్వసాధారణమైంది. నిన్నటి తీర్పుతో ఆ మార్పు వల్ల ఏర్పడిన వివక్షకు సరిదిద్దినట్టయింది!

దళితుల కన్నా ఓట్లపైనే మక్కువ

ఎన్నికల గ్యారంటీల అమలుకు కాంగ్రెస్ నేతృత్వంలోని కర్ణాటక ప్రభుత్వం రూ.14,730 కోట్ల ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను మళ్లిస్తున్నది. దళితులు, ఆదివాసీలపై కాంగ్రెస్‌కు ఏ మాత్రం మక్కువ లేదు. వారి ఓట్లపైనే కాంగ్రెస్‌కు మక్కువ.


- ప్రకాశ్ అంబేద్కర్

ఊరకరారు మహాత్ములు!



టంకశాల అశోక్

ఊరకరారు మహాత్ములు. అందులోనూ చంద్రబాబు వంటి మహాత్ములు. అది కూడా హైదరాబాద్ వంటి సిరిసంపదల నగరానికి, పైగా తెలంగాణ ప్రజలు తన గత రికార్డును ఇంకా మరవనేలేదు అనుకుంటుండగానే, తన పాలన యావత్తూ తెలంగాణ పట్ల ఎంత వివక్షతో, దోపిడీమయంగా సాగిందో ఒకవేళ విస్మరించినా, చివరి దశ వచ్చేసరికి ఎట్లా ఒకవైపు విభజనకు మద్దతుగా లేఖను ఇస్తూనే మరొకవైపు విభజన బిల్లు సమయంలో దానిని వ్యతిరేకించాలంటూ ప్రత్యేక విమానంలో వేరు రాష్ట్రాలు తిరిగి మద్దతులు కూడగట్టిన ద్రోహాన్ని ఇంకా క్షమించకముందే, తెలంగాణ రాజకీయాల చాణక్య చరిత్రలో చంద్రబాబు ఒక ప్రత్యేక వ్యక్తి. ఆయన ఒక మహాత్ముడు. తనకు ఒక విజన్-2020 వంటిది హైదరాబాద్ నగరంపై ఇప్పటికీ ఉన్నది. అది ఒక చెదరని కల. అటువంటి మహాత్ములు ఇక్కడకు ఊరకనే రారు.



ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు అద్భుతమైన పోరాటం చేసి అధికారం సంపాదించి తిరిగి అధికారానికి వచ్చారు. గత ఐదేండ్లలో అక్కడ 'అంతా విధ్వంసమే' అని ఎన్నికల ప్రచారానికి ముందే ప్రకటించారు. ఆ 'విధ్వంసం' ఎటువంటిదో అధికారానికి రాగానే శ్వేతపత్రాలు, పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తమ ప్రజలకు వివరించారు. నిరంతరం కృషితో దానినంతా సక్కదిద్దగలనని వాగ్దానం చేశారు. అంతా బాగున్నది. ఆయన ప్రమాణస్వీకారం చేసింది జూన్ 12న. కొత్త క్యాబినెట్ ఏర్పడి, శాఖల కేటాయింపు, మొదటి క్యాబినెట్ సమావేశం జరిగేసరికి మరొక 12 రోజులు గడిచి జూన్ 24 వచ్చింది. అధికారుల నియామకాలు ఇంకా పూర్తికాలేదు. శాఖల సమీక్షలు జరుగలేదు. తాను అన్న విధ్వంసాన్ని ఎట్లా చక్కదిద్దాలో, అభివృద్ధి ఆరంభించటం ఏమిటో ఇంకా ప్రణాళికా రూపకల్పనలు చేయలేదు. ఇవన్నీ తక్షణ కర్తవ్యాలు కావు.

అయినా వాటన్నింటి మధ్య చంద్రబాబుకు ఆ 24 నుంచి మరొక వారానికి తీరుబడుండా, జూలై నెల రాగానే రాకుండా, ఆకస్మాత్తుగా హైదరాబాద్ గుర్తుకువచ్చింది. దానితో, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి జూలై 1న లేఖ రాశారు. విభజన సమస్యల పరిష్కారం పరిష్కారానికి కలిసేదా, వాటిని పరిష్కరించుకొని రెండు రాష్ట్రాల అభివృద్ధికి 'ఉమ్మడి లక్ష్యాల' సాధనకు కృషి చేద్దామన్నారు. అందుకోసం చర్చలకు సమావేశమవుదామంటూ వేదికలు 4 రోజుల వ్యవధితో కాక ఒక తేదీని కూడా సూచిస్తూ లేఖ రాశారు. అది జూలై 6. చంద్రబాబు స్వయంగా అన్నట్టు ఇది నిండు పదేళ్లుగా పరిష్కారం కాని సమస్యలు. అంత క్లిష్టమైనవి. ఆ పదేళ్లలో రెండు రాష్ట్రాలు ఉన్నతాధికారుల మధ్య, ఒక్కోసారి మంత్రుల ప్రమేయంతో, తరచూ కేంద్ర హోంశాఖ నిర్వహణలో చర్చలు జరిగాయి. కానీ తేలిన అంశాలు కొద్ది మాత్రమే. అవి ఎప్పటికి తేలవనీ కాదు. అదే సమయంలో తేలిక కాదు. ఆ విషయమై చంద్రబాబు కొంచెం కలతచెందినట్టు, రేవంత్‌రెడ్డి సమ్మతి, ఉభయుల చర్చల యథాతథంగా అన్నారుకుంటారు. ఇదంతా స్థూలమైన దృష్టి. కానీ, ఇటువంటి దీర్ఘకాలికమైన, క్లిష్టమైన అంశాలకు సంబంధించి సూక్ష్మదృష్టి అనేది ఒకటుంటుంది. దాని ప్రకారం, ముఖ్యమంత్రులిద్దరూ ఆ సమస్యల స్థాయిలో చర్చలకు ముందు, ఉన్నతాధికారులు చర్చించి విభజనల కోసం వీలైనంత మేర ఒక కొలిక్కి తేవాలి. ప్రస్తుత సందర్భంలో అటువంటివేమీ జరగలేదు. చంద్రబాబుకు అప్పటికి వచ్చిందే ఆలోచన. అప్పటికే మంత్రివర్గ నిర్మాణం వంటివి జరిగి, శాఖలపై సమీక్ష జరిపి చేయకముందే ఆంతలోనే లేఖ అంతలోనే చర్చల తేదీతోనే అంతా అనుమానాస్పదంగా మారుతున్నది. ఎందుకింత ఆతురత అన్నది సందేహం.

చంద్రబాబు వంటి అనుభవజ్ఞుడు, సూక్ష్మబుద్ధి, చాణక్యుడు గ్రహించలేని విషయాలు కావివి. తన దిద్దుకునే చేసుకోవలసిన వారికి పట్టు ఇప్పటికీ ఎంతో ప్రసంశాలా గల రేవంత్‌రెడ్డి, చర్చల ప్రతిపాదనకు సమ్మతించడంలో విశేషం లేదు. కానీ పైన చెప్పుకున్న వివిధ విషయాలన్నీ తెలిసిన చంద్రబాబు పరిమితిమేర్పులు ఏమిటి? ఇందువల్ల ఎదురవుతున్నదే తెలంగాణ ప్రజలు జాగ్రత్తగా ఆలోచించవలసిన, అర్థం చేసుకోవలసిన ప్రశ్న. అందుకు సమాధానం జరుపుకుని సమావేశమైన జూలై 6న ఏమీ లభించలేదు. అది పూర్తిగా సుహృద్భావ వాతావరణంలో జరిగింది. అంతకుముందు అయినప్పటికీ దానిని ఒక ఆరంభంగా తీసుకోని మునుముందు ఏమైనా రావచ్చని తెలంగాణ ప్రజలు ఆశించినా, అర్థం గమనించవచ్చు. అయితే, పైనంతా చర్చించిన స్థూలాన్ని, చంద్రబాబు ఆ విధంగా, హఠాత్తుగా, హడావుడి ప్రతిపాదనలోని పరిమితిమేర్పులు ఏమై ఉండవచ్చునన్నది ప్రశ్న.

ఇందుకు సూచనప్రాయ సమాధానాలు మనకు రెండు లేక మూడు లభిస్తున్నాయి. ఒకటి, 6వ తేదీ సమావేశం కోసం 5వ తేదీ సాయంత్రం చంద్రబాబు హైదరాబాద్‌కు చేరుకున్నప్పుడు అక్కడ టీడీపీ వర్గాలు, ఇతర అభిమానులు చేసిన ఆహ్వానం పైన హడావుడి. ఆ తర్వాత, ముఖ్యంగా 6వ తేదీ చర్చల తర్వాత 7వ తేదీన ఆయన ఎన్టీఆర్ భవన్‌లో చేసిన ప్రసంగం. వీటిలో మొదటిదానిని గమనిస్తే, మామూలుగానైతే అక్కడ చంద్రబాబు అభిమానులు తరలివెళ్లడం సహజమే. కానీ అది ఆ వచ్చింది. అంతేగాక, ఆయన తిరిగి అధికారానికి రావటం వారిలో ఉత్సాహాన్ని కలిగించడమూ నిజమే. కానీ ఆయన హైదరాబాద్ పైకి సారించిన, అసాధారణంగా కనిపించే అంశాలు ఒకటి కంటే ఎక్కువ ఉన్నాయి. ఈ సారి స్వాగతాలు రహదారిపై అడుగడుగునా కటౌట్‌లు, బ్యానర్లు, హోర్డింగులు అపురూపంగా ఉన్నాయి. ఇది సామాజికంగా పరిశీలనీయమే, సహజంగా ఉన్నప్పటికీ అది ఆ రాజకీయ సూత్రం. ఇక 7వ తేదీన జరిగింది అన్నింటికన్నా ముఖ్యమైనది. చంద్రబాబు జూలై 1న అంత ఆకస్మికంగా లేఖ ఎందుకు రాశారన్న దాని నుంచి మొదలుకొని, అక్కడ తెలంగాణలో తన భవిష్యత్తు ప్రణాళికలకు సంబంధించిన ఆలోచనలు ఏమిటన్నదానివరకు అన్నింటికీ కీలు అందులో కనిపిస్తూ ఉంది. అది 7వ తేదీ నాటి ప్రసంగంలో.

చంద్రబాబు అసలు ఉద్దేశాలు అవి. కాకపోతే వారిని సమీప విభజన సమస్యల పరిష్కారం, రెండు తెలుగు రాష్ట్రాల అభివృద్ధి అనే అందమైన మాటల ముసుగులో దాచిపెట్టారు. ఈ ముసుగు అనే ఎత్తుగడకు బ్రోజెన్ హార్స్ ఎత్తుగడతో పోల్చవచ్చు. ఇక్కడ కథలు, చరిత్రలు చదవదగ్గ పోలిక. తిరిగి గ్రీకుల బ్రోజెన్ హార్స్ కథ ఏమిటో రెండు మాటల్లో చెప్పుకోవాలి. ఈ కథ గ్రీకు పురాణాల్లోనిది. గ్రీకు రాజులు ట్రాయ్ నగరాన్ని జయించేందుకు పదేండ్ల పాటు విఫలయత్నం చేస్తారు. పదేండ్ల పాటు అనగానే చంద్రబాబు హైదరాబాద్ కోసం పదేండ్ల పాటు సాగించిన ప్రయత్నాలు గుర్తుకువస్తున్నాయి. అది వేరే విషయం. అదట్లా ఉంచితే, గ్రీకు రాజులు చివరికి ఒక ఎత్తుగడ వేస్తారు. దాని ప్రకారం భారీ పొడవైన ఒక కొయ్యగుర్రాన్ని తయారుచేసి, దానిలోపల మెరికల్లాంటి యోధుల్ని నింపి, ట్రాయ్ నగరపు గేట్ల వద్ద ఒక రాత్రి వదులుతారు. దానిని ఉదయం చూసిన ట్రాయ్ వాసులు ముచ్చట పడి కోటలోకి తోలుకుపోతారు. ఆ రాత్రి గ్రీకు సైనికులు ఆ గుర్రం పొట్టలోంచి బయటకు వచ్చి గేట్లు తెరవగా, గ్రీకు సైన్యం లోపల చొరబడి నగరాన్ని స్వాధీనం చేసుకుంటుంది.

ఇప్పుడు చంద్రబాబు విభజన సమస్యల పరిష్కారం, రెండు తెలుగు రాష్ట్రాల అభివృద్ధి అంటున్నవి ఆ బ్రోజెన్ హార్స్ వంటి ఎత్తుగడ. కాకపోతే రెండింటికీ ఒక తేడా ఉన్నది. గ్రీకుల కొయ్యగుర్రం పోలికలో పూర్తిగా పాదర్శకత లేదు. చంద్రబాబు పాదర్శకత కొయ్యగుర్రం. తన ఉద్దేశాలు, ఎత్తుగడలు మనకు తెలిసినా అర్థమవుతాయి. నిజానికి ఆయన ముఖ్యమంత్రిగా ఉండగానే తెలంగాణకు చేసిందేమిటో, తన రెండు కండ్ల సిద్ధాంతమేమిటో, విభజన సమయంలో సాగించిన కపట రాజకీయాలు ఏమిటో, వీటన్నింటికి ముందు ఎన్టీఆర్ విషయంలో చేసిందేమిటో, సమస్తం పారదర్శకంగానే ప్రజలకు తెలిసిపోయాయి. తను గాడంగా నమ్మే ఆర్థిక సంస్కరణల విధానాల పాదర్శకత అవసరాన్ని నొక్కిచెప్పారు. ఆ విధాన సరళి పారదర్శకత కావడాలని కాదన్నది వేరే విషయం. కానీ, చంద్రబాబు రాజకీయ ఆచరణ మాత్రం చాలావరకు పారదర్శకమే. ఆ విధంగా ఆయన విభజన నాటి స్వయం పరిష్కారం, రెండు తెలుగు రాష్ట్రాల అభివృద్ధి పేరిట ఒక బ్రోజెన్ గుర్రాన్ని ఇంకా తెలంగాణపైకి వదిలారు కాని, ఆ ఎత్తుగడలోని పరమార్థాన్ని 7వ తేదీనాటి ఎన్టీఆర్ భవన్ ప్రసంగంలో ఎంతో పారదర్శకంగా వెల్లడించారు.

చంద్రబాబు ప్రసంగ వేదికపైనుండి తన అనుయాయులతోపాటు తెలంగాణ ప్రజలు అమితాశక్తితో చదివే ఉంటారు గనుక, ఇక్కడ మళ్లీ రాయనక్కరలేదేమో. అందులో భీమా బ్రహ్మ రాజులు సారథుల బృందం మొదలై పదేండ్ల పాటు తెలంగాణ వంటి పార్టీ చిందర వందరగా ఉండడం, ఆ పార్టీ ఉద్యమకారుల పాత్ర, ఈ ఏర్పాటు, నవ తెలంగాణలో తెలుగుదేశాన్ని సామాజిక న్యాయం, స్వతంత్రత, సమానత్వం... రాష్ట్ర ఏర్పాటు తర్వాత తెలంగాణ రాష్ట్ర సమితి ప్రభుత్వం ఏర్పడి ప్రస్తుతం పదేండ్లు అధికారంలో లేదు. తెలంగాణ స్వతంత్ర పార్టీ కాంగ్రెస్ 1956 నుంచి కూడా శక్తి లేదు. వారి చరిత్ర యావత్తు అధికారం కోసం కాంట్రాక్టుల కోసం సీమాంధ్రులతో కుమ్మక్కు అయ్యి వారికి ఊడిగం చేయడం, తెలంగాణకు ద్రోహం చేయటం, ఉద్యమకారుల అణచివేత ఇటువంటివి. ఇక చంద్రబాబు ఒక ఘన విజయం సాధించి ఉన్నా, అక్కడ ఆధిపత్య వర్గాల ఉపకారంతో తెలంగాణలో మళ్లీ తెలుగుదేశం వైపు మొగ్గు, ఒక సమావేశంతో ఒక సాహసం. మరి ముఖ్యంగా సిరిసంపదల హైదరాబాద్ గడ్డపై తిరిగి కాలుమోపేందుకు ఇది తగిన తరుణం అని ఆయన నమ్ముతున్నట్టు తన ఎన్టీఆర్ భవన్ ప్రసంగం ఆరంభం నుంచి చివరి వరకు తేటతెల్లమయ్యింది. వారికి హైదరాబాద్‌పై, తెలంగాణపై ఆశలు, కేసీఆర్‌పై కక్షలు ఇంకా చావలేదు.

తెలంగాణ అట్లుండి ఇక్కడ రాయన్న అవకాశం స్థానిక సంస్థల ఎన్నికలు, అందుకోసం టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిగా ఏర్పడి పదవిలోకి ఆశ్వవస్తునున్నారు. అదిగాక అధికారం కోసం ఆడవలసిన తొత్తులు తెలంగాణలో ఇప్పటికే కొందరు లేకపోలేదు. తాము ఇప్పటికే ఇక్కడ ఆధిపత్యంలో ఉండాలన్న ఆశ ఇంకా చంద్రబాబులో లేకపోవచ్చు. కాని, ఆయన 7వ తేదీన స్పష్టంగా అన్నట్టు, తెలుగుదేశం పుట్టిన తెలంగాణ గడ్డ మీద ఆ పార్టీ పనులు ఇంకా 'తిరిగి' నిలదొక్కుకుంటారు, ఆ సంకల్పం మొదలైంది. ప్రస్తుతానికి ఇక్కడ ఒక ఉపాయం అవుతుంది, అందువల్ల, ఇప్పుడు ఇప్పుడు వన వత్తిళ్ళ ఆయనకు చక్కగా ఇక్కడ తగిన అవకాశం లభిస్తే, హైదరాబాద్‌ను ఊరకనే రారు. బ్రోజెన్ హార్స్ మహాత్ములు.

తెలంగాణలో కొలువుల కొలిమి



ప్రజ్ఞ

ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం కొట్లాట, ఆపాయింట్‌మెంట్ ఆర్డర్ల కోసం కొట్లాట, పరీక్షల కోసం వాయిదా కోసం కొట్లాట, పోస్టుల సంఖ్య పెంచాలంటూ కొట్లాట, పరీక్ష వాయిదా వేయాలంటూ కొట్లాట. రాష్ట్రంలో అసలు ఏం జరుగుతోంది? ప్రగతిభవన్ వద్ద బద్దలైన ముళ్లకంచెలు ఇప్పుడు టీజీపీఎస్సీ ఆఫీస్ ముందు ఎందుకు వెలుస్తున్నాయి? పుస్తకాలతో కుస్తీ పట్టాల్సిన కాబోయే టీచర్లు విద్యా కమిషనర్ ఆఫీస్ వద్ద ఎందుకు ధర్నా చేస్తున్నారు? అధ్యాపకుల నిజ హస్తాలు నిరుద్యోగుల కోసం ఎందుకు కొట్లాడుతున్నాయి? ఎన్నికలప్పుడు కాంగ్రెస్‌కు స్నేహ హస్తం అందించిన నిరుద్యోగులు ఇప్పుడెందుకు రోడ్డెక్కుతున్నారు? నిత్యం ధర్నా చౌక్ ఎందుకు దద్దరిల్లుతోంది? నిరుద్యోగులకు న్యాయం చేస్తామని ప్రకటించిన నాటి పీసీసీ అధ్యక్షుడు రేవంత్ నేడు అధికారంలోకి వచ్చాక సీఎం హోదా లో ఎందుకు స్వరం మార్చుకుంటున్నారు?

గ్రూప్స్, డీఎస్సీ అభ్యర్థుల నిరసనపై సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలు గర్హనీయమైనవి. నిరుద్యోగుల డిమాండ్ల న్యాయ పరిష్కారం చేయాల్సిన ముఖ్యమంత్రి 'వాళ్లకు కృత్రిమ ఉద్యమ'మంటూ వ్యాఖ్యానించడం బాధాకరం. స్వర్గంలోంచి దిగొచ్చి చూసినట్టు మాట్లాడిన సీఎం పోరాటానికి రాజకీయ రంగు పులమడం అసమంజసం. నిజంగానే ఎవరైనా కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు అభ్యర్థులను రెచ్చగొట్టి ఉంటే వాళ్లపై కఠిన చర్యలు తీసుకోవచ్చు కదా? ప్రభుత్వంలో ఉన్నది వాళ్లే కదా?


రాష్ట్రంలోని నిరుద్యోగులు తమ డిమాండ్లను నెరవేర్చాలని గత నెల రోజులుగా దీక్షలు, నిరసన కార్యక్రమాలు చేస్తున్నారు. అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కాగా వారిని అరెస్టులు చేస్తూ పాశవికంగా వ్యవహరిస్తున్నది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం గ్రూప్-1 ఉద్యోగాలను అమ్ముకుంటున్నదని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అందుకే జీవో నంబర్ 55ని సవరించాలని నిరుద్యోగులు కోరుతున్నారు. అదేవిధంగా జీవో నెంబర్ 29 తీసుకురావడం వెనుక గల కారణాలను తేల్చాలి. గ్రూప్ 1 ప్రిలిమినరీలో జనరల్ ర్యాంకింగ్ ప్రతిపాదికన ఆ అభ్యర్థులందరితో ఫలితాలు ప్రకటించడం వెనుకున్న ఆంతర్యం ఏమిటో అంతుచిక్కడం లేదు. కాంగ్రెస్ ఎన్నికల్లో హామీ ఇచ్చినట్టుగానే మెగా డీఎస్సీ వేయాలి. తాజాగా టెట్ ఫలితాలు రావడంతో అభ్యర్థుల సంఖ్య పెరిగింది. పరీక్షకు సన్నద్ధమవ్వడానికి సమయం ఇవ్వాలి. డీఎస్సీని 45 రోజుల పాటు వాయిదా వేయాలి.

గ్రూప్ 1 తరహాలో గ్రూప్ 2లో కూడా పోస్టులను పెంచాలి. పరీక్ష తేదీలపై స్పష్టత ఇవ్వాలి. డీఎస్సీ, గ్రూప్-2 పరీక్షలు ఒకే సమయంలో ఉండటంతో అభ్యర్థుల్లో తీవ్ర గందరగోళం నెలకొన్నది. గ్రూప్-2 వాయిదా వేసి మెడికల్ ఎగ్జామ్ వంటి కీలక పరీక్షలకు స్పష్టత ఇవ్వాలి. అంతేకాదు, గ్రూప్-2, గ్రూప్-3 పరీక్షల సిలబస్ దాదాపుగా ఒక్కటే. కాబట్టి, ఈ రెండు పరీక్షలను తక్కువ వ్యవధిలో నిర్వహించాలి. యూపీఎస్సీ తరహాలో 2014 నుంచి టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన పరీక్షల ప్రశ్నపత్రాలతో పాటు జవాబులను వెబ్‌సైట్‌లో పొందుపర్చాలి.

నిరుద్యోగుల సమస్యను రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ కోణంలో కాకుండా సామాజిక, ఆర్థిక, మానవీయ కోణంలో చూడాలి. పంతానికి పోకుండా ఓ మెట్టుదిగి నిరుద్యోగులతో చర్చలు జరపాలి. అప్పుడే నిరుద్యోగుల సమస్యలు పరిష్కారమవుతాయి.



కేజ్రీపై మారని మోదీ తీరు



ప్రేమ్ శంకర్ ఝా

2019 పార్లమెంట్ ఎన్నికల్లో 303 సీట్లు గెలుపొందిన బీజేపీ.. తాజా ఎన్నికల్లో 240కి పడిపోవడంతో 'అబ్ కీ బార్ చార్ సౌ పార్' అన్న ప్రధాని మోదీ కూన్న ప్రగల్భాలను కమలం పార్టీ మర్చిపోవాలని భావిస్తున్నది. తన నిరంకుశ లక్ష్యాలను పంచుకోనటువంటి రెండు ప్రాంతీయ పార్టీల మద్దతుపై బీజేపీ సర్కారు ఆధారపడి ఉంది. గుజరాత్ ముఖ్యమంత్రిగా, దేశ ప్రధానిగా 22 ఏండ్ల తన రాజకీయ జీవితంలో మొదటిసారి ప్రధాని మోదీ కాసింత స్థితికి దూరమయ్యారు. గతంలో ఎన్నడూ లేని ప్రస్తుత పరిస్థితుల్లో తన నిరంకుశ పాలనా శైలిని సర్దుబాటు చేసుకోగలరా? అన్నది ప్రశ్న. ముఖ్యమంత్రిగా గానీ, ప్రధానిగా గానీ ఇటువంటి ఎన్నడూ ఎదుర్కొని, చేయగలిగే వేశాలు కూడా ఏమాత్రం ఈ స్థితిని సూచిస్తున్నది. ఎందుకంటే, ఈ 22 ఏండ్లలో రాజకీయంగా ఎదురుచెప్పిన ప్రతిసారి ఆయన స్పందన ఆవేశపూరితంగానే ఉన్నది.

గడిచిన 22 ఏండ్లలో తన లక్ష్యానికి అడ్డువచ్చిన ప్రతికూలతను ఆయన కోపాన్ని ప్రదర్శించారు. 2001లో గుజరాత్ మాజీ హోంమంత్రి హరేన్ పాండ్యాతో మొదలైన ఈ వరస తాజాగా కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీ, టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా, మనసు పార్టీలు అధ్యక్షులు వరకు గుర్తిస్తుంది. కాంగ్రెస్ నాయకుడు తీస్తా సెతల్వాడ్, గుజరాత్ మాజీ ఐజీపీ ఆర్‌బీ శ్రీకుమార్ వరకు కొనసాగింది. ఈ క్రమంలో తన రాజకీయ ప్రత్యర్థులను భయభ్రాంతులకు గురిచేసేందుకు ప్రభుత్వ యంత్రాంగాన్ని సంస్థలను మోదీ వినియోగించారు. ఇప్పుడు మోదీ ఉక్కుపాదం మోపే ప్రత్యర్థులుగా ఆ కోవల్లో ఆప్, ఆ పార్టీ అధినేత కేజ్రీవాల్‌పై ప్రదర్శిస్తున్నారు.

2014లో ఢిల్లీలోని ఏడు లోక్‌సభ సీట్లను గెలుచుకున్న బీజేపీ.. ఆ తర్వాత 2015లో జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైంది. ఆనంతరం కేజ్రీవాల్‌పై మోదీకి ఆగ్రహం మొదలైంది. 2019, 2024 సార్వత్రిక ఎన్నికల్లోనూ ఢిల్లీలోని అన్ని ఎంపీ సీట్లను బీజేపీ గెలుచుకున్నప్పటికీ ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా మాత్రం తగ్గలేదు. 2015 నుంచి ఈ తొమ్మిదేండ్లలో ఢిల్లీ సర్కార్‌కు అడ్డంకులను సృష్టించేందుకు, ఆప్‌ను దేశ రాజధానిలో అధికార పీఠానికి దూరం చేసేందుకు మోదీ ప్రయత్నాలు ఏ మాత్రం ఆగలేదు. 2021లో ఢిల్లీ ప్రభుత్వం మద్యం పాలసీలో మార్పులు చేయడంతో మోదీ తనకు ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న అవకాశాన్ని పొందారు.

ఏటా ఢిల్లీ ఆదాయంలో 15-30 శాతం మద్యంపై విధిస్తున్న పన్నుల రూపంలో వస్తున్నది. అయితే దేశంలోని ఆక్కడక్కడ పేద కుటుంబాలు మద్యం సేవించడాన్ని అనుసరించుకుంటున్నాయి. ఢిల్లీలో 1970ల చివరి నుంచి మద్యం అమ్మకాన్ని ప్రభుత్వ సంస్థలే పర్యవేక్షణ సాగిస్తున్నాయి. అంతేకాదు, మంత్రి, ఎక్సైజ్ సమ్మేళనం, ఆ శాఖ అధికారులకు అందే ముడుపులకు సంబంధించిన ప్రధాన వనరులలో ఇది కూడా ఒకటి. అందువల్ల, ప్రభుత్వ గుత్తాధిపత్యానికి చరమగీతం పాడి, బహిరంగ వేలం ద్వారా మద్యం వ్యాపారాన్ని నిర్వహించాలని ఆప్ సర్కార్ నిర్ణయించుకున్నది. దీంతో ప్రజల దృష్టిలో ఇదొక అవకతవకలకు చెక్ పెడుతుందని ఇది సమయానికి భావించిన మోదీ ప్రభుత్వం ఏ మాత్రం ఆలస్యం చేయకుండా ఆ అవకాశాన్ని తనకు అనుకూలంగా మలుచుకున్నారు.

2022 తొలి అర్ధ భాగంలో మోదీ తరఫున ఢిల్లీ ప్రధాన కార్యదర్శి నరేశ్ కుమార్ మొదలుగా ఆయన దాన్ని ఎక్కువపెట్టారు. అప్పటి ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ సక్సేనాకు నరేశ్ కుమార్ లేఖ రాశారు. ఎక్సైజ్ మంత్రి సిసోదియా తీసుకున్న ఏకపక్ష నిర్ణయాల ఫలితంగా ఖజానాకు రూ.580 కోట్లకు పైగా నష్టం జరిగిందని ఆ లేఖలో పేర్కొన్నారు. అంతేకాదు, లైసెన్స్ ఫీజులో తగ్గింపు, జరిమానాలపై మినహాయింపు ఇచ్చి నందుకు గానూ మద్యం వ్యాపారులు, నిర్వాహకుల నుంచి ఢిల్లీ ప్రభుత్వం, ఆప్ నాయకులు ముడుపులు అందుకున్నారని అందులో పేర్కొన్నారు. ఈ ముడుపులను గోవా, పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలను ప్రభావితం చేయడానికి వినియోగించారని ఆయన ఆరోపించారు. ఆప్ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, రాజ్యసభ ఎంపీ సైతం శిక్ష అనుభవించడానికి మోదీ ప్రభుత్వం ఈ లేఖే పునాది.



అభియోగాలు మోపబడిన వ్యక్తుల నిందితులలో ఓన్లీ ఇద్దరు, కార్యాలయాలను ఈడీ తన ఆధీనంలోకి తీసుకున్నది. సోదాల పేరిట వారిని తీవ్రంగా వేధించింది. అయినప్పటికీ ఆప్ నేతలకు వ్యతిరేకంగా ఒక్క చిన్న ఆధారాన్ని కూడా సంపాదించలేకపోయింది. సంజయ్ సింగ్ బెయిల్ విచారణ సమయంలో సుప్రీంకోర్టు ఇదే విషయాన్ని ప్రస్తావించింది.

మామూలుగా అయితే ఏ దర్యాప్తు సంస్థ అయినా ఆప్ నేతలపై ఉన్న కేసును చాలా కాలం క్రితమే మూసివేసేది. కానీ, నేషనల్ హెరాల్డ్ కేసులో ఆధారాలను సమర్పించడంలో విఫలమైన నాటి ఈడీ డైరెక్టర్ లనే ఈ కేసులోనూ ఎదుర్కొన్నారు. కాంగ్రెస్ నేతలపై వ్యతిరేకంగా సాక్ష్యాధారాలు లేని కారణంగా సుప్రీం ఆగ్రహాన్ని చవిచూసిన కేసును అప్పటి ఈడీ డైరెక్టర్ రాజన్ కటోచ్ మూసివేశారు. ఆ తర్వాత మోదీ ఆతన్ని పదవి నుంచి తొలగించారు.

అప్పటి నుంచి మోదీకి అనుగుణంగా పని చేయడంలో విఫలమైతే ఏం జరుగుతుందో ప్రతి ఈడీ అధికారికీ తెలుసు. దీని నుంచి బయటపడేందుకు కూడా వారు నేర్చుకున్నారు. కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేస్తూ రౌస్ అవెన్యూ కోర్టు వెలువరించిన నిర్ణయాన్ని ఢిల్లీ హైకోర్టు తొందరపాటుగా కొట్టివేయడం దీనికి ఒక ఉదాహరణ. కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు కాగానే ఈడీ ఢిల్లీ హైకోర్టుకు పరుగెత్తింది. మీడియాలో ఎక్కడాలేనట్టు జూన్ 20న రౌస్ అవెన్యూ కోర్టు తీర్పును చదవకముందే, ఆ తీర్పు కాపీలను అందుకోకముందే, ఉత్తర్వులను తీవ్రమైన నిర్ణయంగా ఉత్తర్వులు, కింది న్యాయమూర్తి సుధీర్ కుమార్ జైన్ వారి వాదనలను పరిగణించకుండానే ఆ తీర్పును విరమించాలని పేర్కొన్నారు.

నను అంగీకరించారు. మద్యం వ్యాపారుల నుంచి ఆప్ నాయకులు ముడుపులు తీసుకున్నారని వారు చెప్తున్న నగదుకు సంబంధించి మోదీ రియల్ సాక్ష్యాలను సంపాదించడంలో విఫలమైన ఈడీ దర్యాప్తు మధ్యవర్తులుగా పేర్కొంటున్న వ్యక్తులను అభియోగించడంలో అర్థవంతమేమీ లేదు.

కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేస్తుందనే భయంతో అదే నేరం కింద అతన్ని అరెస్టు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు సీబీఐని తెరపైకి తీసుకొచ్చింది. దివాలా ఇద్దరు ప్రధాన అప్రూవర్లను మాగుంట రాఘవ రెడ్డి, ఢిల్లీ వ్యాపారి దినేష్ అరోరా. సిసోదియాను అరెస్టు చేసిన సమయంలో అరోరా పోలీసుల ఆధీనంలోనే ఉన్నాడు. తను చేసిన నేరాలు గానూ క్షమాభిక్ష పొందేలా హామీ తీసుకున్న తర్వాత ఆతను ఈడీ కోసం అప్రూవర్‌గా మారారు. మాగుంట శ్రీనివాసులు, మోదీ కుమారులు, ఆప్ నేతలతో ఈడీ కాంట్రాక్టుల విషయంలో రాఘవరెడ్డి, దినేష్ అరోరాల వాదనలు ఎంత విశ్వసనీయంగా ఉన్నాయో ఈ కథనాన్ని చూస్తేనే న్యాయాన్ని గ్రహించాలి. 2023 అక్టోబర్ 4న ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టులో క్షమాపణ పొంది, అప్రూవర్‌గా మారిన మాగుంట శ్రీనివాసులు రెడ్డి ఇప్పుడు ఏపీలో రెండవ టీడీపీ ఎంపీగా ఉన్నారు.

కేజ్రీవాల్‌తో పాటు ఇతర ఆప్ నాయకులపై ఈడీ నమోదు చేసిన కేసు వెనుక లక్షణం ఏమిటంటే.. ఇందులో భాగంగా జరిగిన ప్రతి విచారణలోనూ కోర్టు ఇచ్చిన బెయిల్ తర్వాత కొద్ది రోజుల్లోనే సాక్ష్యాలను సేకరిస్తున్నా ఈ నేపథ్యంలో ఆ దర్యాప్తు వ్యవహారాన్ని చాలా తీవ్రంగా వ్యతిరేకిస్తూ వస్తున్నది. వారిని విచారణ చేయడం ఆర్డరు కాదనుకొంటూ, ఈ పరిణామాన్ని చూసి కూడా కస్టడీ కొనసాగిస్తున్నారు. ఈ కేసులో ఇక ముందు ఏ జరిగినా ఎన్నికల సమయంలో అందుకున్న ముడుపుల అంశం ప్రస్తావించే పాటు స్పష్టమైన సాక్ష్యాలు ఈడీ వద్ద లేవు. కొత్త మద్యం పాలసీ వల్ల ప్రభుత్వ ఖజానాకు భారీ నష్టం వాటిల్లిందన్న ఆరోపణను, మద్యం వ్యాపారుల నుంచి ఆప్ పొందిన ముడుపుల గురించి కల్పితమైన

వివరాలతో లెఫ్టినెంట్ గవర్నర్ సక్సేనాకు ప్రధాన కార్యదర్శి నరేష్ కుమార్ ఎలా లేఖ రాయగలిగారు? 2022లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల కోసం గోవాకు తరలించిన డబ్బు ఎంత?

అవకాశవాదులకు తావే లేదు

దీనికి రెండు సమాధానాలు మాత్రమే ఉన్నాయి. నరేష్ కుమార్ లేఖలో ఉన్న విషయం మోదీ ప్రభుత్వం సృష్టించిన కల్పిత. లేదా అందులో ఉన్న సమాచారం సరిదిద్దని, అప్పటిదాకా ఉండని, ప్రత్యక్ష సాక్ష్యాధారాలతో దాన్ని బలపరచాల్సిన అవసరం ఉందని ఈడీ భావించి ఉండవచ్చు. వీటిలో మొదటిది చాలా ఆమోదయోగ్యమైన వివరణ.

కొత్త మద్యం పాలసీ వల్ల ఎక్సైజ్ డ్యూటీ ఆదాయానికి నష్టం వాటిల్లిందనే సరికాదు. ఆదాయం పెరిగిందని అప్పుడు, అది గత విధానం ప్రకారం.. మద్యం విక్రయానికి సంబంధించి ఢిల్లీ ప్రభుత్వం హోల్‌సేల్, రిటైలర్లకు ఉండేది. తయారీదారులు వాని ఎక్స్ షాప్ ధరకు 5 శాతం చెల్లించి, మద్యంపై ప్రభుత్వ నియంత్రణను తీసుకుని, రిటైల్ అవుట్‌లెట్లకు సరఫరా చేసే పనిని కూడా నిల్వ అవ్వకుండా ప్రభుత్వానికి భరించేది. రిటైల్ అవుట్‌లెట్లను ఏర్పాటు చేసే నియంత్రణలోనే ఉండేది. ఈ ఏళ్ళలో గుత్తాధిపత్యం అనేక లోపాలకు కలిగించింది.

కొత్త పాలసీ ద్వారా ఏడాదికి ప్రభుత్వానికి పన్నుల, లైసెన్స్ రూపంలో రూ.10 వేల కోట్ల కంటే ఎక్కువ ఆదాయం వస్తుందని.. తన పేరు చెప్పేందుకు ఇష్టపడని ఓ అధికారి హిందుస్థాన్ టైమ్స్‌తో చెప్పారు. ఇది గత మూడేండ్ల సగటు ఆదాయం రూ.5,500 కోట్ల కంటే దాదాపు రెట్టింపు.

చివరగా ఆప్ నేతలకు వ్యతిరేకంగా సాక్ష్యాలను సేకరించడానికి ఈడీ గడచిన కాలంలో.. మీడియాలో ఎవరూ అన్నింటికంటే ముఖ్యమైన ప్రశ్నను అడగలేదు. హోల్‌సేల్, రిటైలర్ల ఎంపిక ఎలా జరిగిందో, బహిరంగ వేలం ద్వారా జరిగినప్పుడు.. అసలు అక్కడ అవినీతి జరిగేందుకు ఆస్కారం ఎక్కడ ఉంది? ఆప్ నేతలను జైలులో పెట్టిన నాటి నుంచి ఈ ప్రశ్నను ఆ వార్తా ఛానెళ్లు గానీ, బీజేపీ వ్యాఖ్యాతలు గానీ అడగలేదు. భారతీయ మీడియాపై ఇదొక చెరగని మచ్చ.

('ది వైర్' సౌజన్యంతో)



పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టాలి

ఆర్ కృష్ణయ్య

హైదరాబాద్, జూలై 11 (నమస్తే తెలంగాణ): పార్లమెంటు సమావేశాల్లో బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు కృష్ణయ్య కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. మద్దతు కోరుతూ హైదరాబాద్ ఎంపీ ఒవైసీతో దారుసలాంలో గురువారం సమావేశమై చర్చించారు. బీసీ బిల్లు పెట్టేలా మజ్లిస్ పార్టీ చూడాలని కోరారు. మజ్లిస్ తరఫున బీసీ రిజర్వేషన్లకు సంబంధించి ప్రైవేటు బిల్లు పెడతామని ఒవైసీ హామీ ఇచ్చారు.

కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలి

ఎస్సీఆర్ ఎంప్లాయీస్ సంఘ్ అధ్యక్షుడు ప్రభాకర్

మారేడ్‌పల్లి, జూలై 11 కొత్త పెన్షన్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసేంత వరకు కేంద్రానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తామని దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ అధ్యక్షుడు ప్రభాకర్ అంద్రూస్ స్పష్టం చేశారు. గురువారం సికింద్రాబాద్ సంచాలన్ భవన్ ఎదురుగా ఎంప్లాయీస్ సంఘ్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ, రైల్వేలో పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని రైల్వే మంత్రులు, బోర్డు అధికారులకు విన్నవించినా సమస్య పరిష్కారం కాలేదని చెప్పారు. జోనల్ సెక్రటరీ భరత్ భాను ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వాన్ని నిద్ర లేపేందుకు ఈ ధర్నా చేస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంప్లాయీస్ సంఘ్ ఏజీఎస్ రుద్రారెడ్డి, షేక్ రఫూఫ్, నాయకులు ప్రసాద్, ప్రభురాజ్, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

జనగామ బీఆర్ఎస్ ఆఫీస్‌కు నోటీసులు

15 రోజుల్లో ఆధారాలివ్వాలన్న రెవెన్యూ అధికారులు

జనగామ, జూలై 11 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ జనగామ జిల్లా కార్యాలయ ఆవరణంలో అదనంగా 20 గుంటల ప్రభుత్వ భూమి ఆక్రమణలో ఉన్నదని కలెక్టర్ గురువారం సాయంత్రం లీగల్ నోటీసులు జారీ చేశారు. జనగామ మండలం యశ్వంతాపూర్ రెవెన్యూ గ్రామంలోని సర్వేనంబర్ 82లో ఎకరం భూమిని బీఆర్ఎస్ భవనం కోసం కేటాయించారు. రెవెన్యూ అధికారులు సర్వేలో 82/16, 82/17, 82/18, 82/19 సర్వే నంబర్లలో 20 గుంటల భూమి అదనంగా పార్టీ కార్యాలయ స్వాధీనంలో ఉన్నదని రెవెన్యూశాఖ గుర్తించినట్టు నోటీసులో పేర్కొన్నారు. ఈ భూమికి సంబంధించి ఆధారాలుంటే 15 రోజుల్లో సమర్పించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు నోటీసులు అందజేశారు.

గిరిజనుడిపై పోలీసుల దాష్టీకం

- ఎమ్మెల్యేను ప్రశ్నించాడని తొర్రూరు ఎస్సై జులుం
- ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా పోస్ట్ చేయడమే నేరమా?
- పోలీసుల తీరును తప్పుపట్టిన కేటీఆర్.. డీజీపీకి సూచనలు
- విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి: హరీశ్‌రావు
- ఎమ్మెల్యే పీఏ ప్రోద్బలంతోనే కొట్టారు: బాధితుడు సురేశ్‌బాబు
- 50 ఏండ్లు కాంగ్రెస్ జెండా మోసిన ఫలితమిది అని ఆవేదన
- ఎస్సై, ఎమ్మెల్యే పీఏపై అట్రాసిటీ కేసు పెట్టాలి: ఎల్‌హెచ్‌పీఎస్



తనపై దాడి ఘటన తీరును వివరిస్తున్న సురేశ్‌బాబు

తొర్రూరు/హైదరాబాద్, జూలై 11 (నమస్తే తెలంగాణ): పాలకుర్తి ఎమ్మెల్యేగా యశస్వినిరెడ్డి గెలుపుకోసం రాత్రింబగలు కష్టపడ్డాడా గిరిజన యువకుడు. ఆమె గెలవాలని ఎర్రబెల్లి దయాకర్‌రావుకు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులూ పెట్టాడు. అతడు కోరుకున్నట్టే యశస్వినిరెడ్డి ఎమ్మెల్యే అయ్యారు. కానీ, ఇప్పుడు ఆమెకు వ్యతిరేకంగా పోస్టులు పెట్టాడని ఆ యువకుడిని పోలీసులతో దారుణంగా కొట్టించారు. వివరాల్లోకెళితే.. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డి మూడు రోజుల క్రితం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంలో ఎమ్మెల్యే వెంట ఆమె పీఏలు విజయేందర్‌రెడ్డి, రాజేశ్ తదితరులు సీఎంతో ఫొటోలు దిగారు. ఆ ఫొటోలు సోషల్ మీడియాలో పోస్ట్ చేయటంతో మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం బొజ్జాతండా పరిధి ఈదులకుంట తండాకు చెందిన మాలోత్ సురేశ్‌బాబు (ఎల్‌హెచ్‌పీఎస్ అధ్యక్షుడు, ఆమ్‌ఆద్మీపార్టీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు) వాటిపై పలు కామెంట్లు పెట్టాడు. 'స్థానిక లీడర్లను పక్కన పెట్టి పీఏలతో రాజకీయాలు తగునా? విజయేందర్‌రెడ్డి పీఏనా? లేకుంటే రెడ్డిరాజ్యంలో దగాకోరు రెడ్డినా? సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి పాలకుర్తి అభివృద్ధి కోసం నిధులు కావాలని కోరినప్పుడు విజయేందర్‌రెడ్డి అనే వ్యక్తిని కాకుండా నియోజకవర్గంలో ఉన్న ఏ చిన్న ఓటరును పిలిచినా నిధులు దేనికి అవసరమో చెప్పేవాళ్లు. సీఎం ముందు ఎమ్మెల్యే నియోజకవర్గ ప్రజల పరువు తీస్తున్నారు. అసలు పాలకుర్తిలో ఎమ్మెల్యే ఎవరు? నాయకులు ఎవరు? కార్యకర్తలు ఎవరు? నియోజకవర్గ అభివృద్ధి కోసం పీఏలు సైతం సీఎం కలుస్తారా? అసలు నిధులు దేనికి కావాలని అడిగారో నియోజకవర్గ ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత ఎమ్మెల్యేపై ఉంది. అమ్మ అమెరికా నుంచి ఒక్కరిగా వచ్చి, ఇక్కడ గెలిచి మళ్లీ బ్యాగులు, మూటలు అమెరికాకు తీసుకెళ్లే ప్రయత్నం ఏమైనా చేస్తున్నారా?' అని ప్రశ్నించాడు. ఈ పోస్టుపై సురేశ్‌బాబును ఎమ్మెల్యే అనుచరులు, పీఏ విజయేందర్‌రెడ్డి పిలిచి ప్రశ్నించినట్టు తెలిసింది. అతడు ఇంకా బలంగా వాదన చేయటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారని పలువురు చెప్తున్నారు. దీంతో బుధవారం సాయంత్రం సురేశ్‌నాయక్‌ను స్థానిక ఎస్సై జగదీశ్ పోలీస్ స్టేషన్‌కు పిలిపించి తీవ్రంగా కొట్టారని ఎల్‌హెచ్‌పీఎస్ నేతలు మండిపడుతున్నారు. ఎమ్మెల్యే పీఏ విజయేందర్‌రెడ్డి ప్రోద్బలంతోనే ఎస్సై తీవ్రంగా కొట్టి భయభ్రాంతులకు గురి చేశారని బాధితుడు, అతడి తల్లిదండ్రులు పద్మ, శ్రీను ఆవేదన వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ కోసం పనిచేస్తే దక్కిన ఫలితమిది

పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి పీఏ విజయేందర్‌రెడ్డి నియంతలా ఒంటెద్దు పోకడలు పోతున్నారు. తనే రూల్ చేస్తున్నారు. ఇక్కడ రెడ్డి పాలన కొనసాగుతున్నదన్న అనుమానం కలుగుతున్నది. ఆయనపై చర్యలు తీసుకోవాలి. మీ(ఎమ్మెల్యే) గెలుపు కోసం పనిచేసిన ఎంతోమంది ఇబ్బంది పడుతున్నారని మీకు తెలిసేలా సోషల్ మీడియాలో పోస్టు చేశాను. దీనిపై వారి మనోభావాలు దెబ్బతిన్నాయని విజయేందర్‌తోపాటు కొంతమంది కాంగ్రెస్ నాయకులు ఎస్సైకి ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్సై జగదీశ్ నానాబూతులు తిట్టి తీవ్రంగా కొట్టారు. కేసు పెడితే జైలుకైనా పోయేవాన్ని. కానీ ఇలా కొట్టేస్తే మీ పార్టీకే నష్టం. మా కుటుంబం గత 40-50 ఏండ్లుగా కాంగ్రెస్ పార్టీ జెండా మోస్తూ, సేవ చేస్తున్నం. నేను పెట్టిన పోస్టుపై ఇబ్బంది అనిపిస్తే క్షమాపణ చెప్పడానికి సిద్ధపడిన. పోలీసులకు చెప్పి నా ఫోన్లు లాక్కుని నా పర్సనల్ డాటాను చెక్ చేశారు. స్టేషన్‌లో విజయేందర్‌రెడ్డి నన్ను, నా తండ్రిని నానాబూతులు తిట్టారు. తెలంగాణ కోసం ఉద్యమించా. యశస్వినిరెడ్డి గెలుపు కోసం పనిచేశా. దయాకర్‌రావును ఓడగొట్టి, యశస్వినిరెడ్డిని గెలిపించేందుకు దయాకర్‌రావుపై సోషల్‌మీడియాలో ఇష్టం వచ్చినట్టు దుష్ప్రచారాలతో పోస్టులు పెట్టా. నేను తప్పు చేశానని ఇలా కొట్టించారు. 8 నెలల్లోనే ఇన్ని హింసలు చూస్తానని అనుకోలేదు. వెంటనే నన్ను కొట్టిన ఎస్సై, కొట్టించిన విజయేందర్‌రెడ్డిపై కేసులు పెట్టాలని డిమాండ్ చేస్తున్నా.

- బాధితుడు సురేశ్‌బాబు

పోలీసులు ప్రొఫెషనలిజాన్ని కాపాడుకోవాలి: కేటీఆర్

సామాజిక మాధ్యమాల్లో ప్రభుత్వాన్ని విమర్శిస్తే పోలీసులు అదుపులోకి తీసుకుంటున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సురేశ్‌బాబును పోలీసులు అదుపులోకి తీసుకొని క్రూరంగా హింసించారని తెలిపారు. ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా వాట్సాప్‌లో పోస్ట్ చేయడమే ఆయన చేసిన నేరమా? అని డీజీపీని ప్రశ్నించారు. తెలంగాణ పోలీసుల ప్రొఫెషనలిజానికి మంచి పేరు ఉండేదని, అదిపోకుండా కాపాడుకోవాలని సూచించారు. అత్యుత్సాహం ప్రదర్శిస్తూ చట్టవ్యతిరేకంగా వ్యవహరిస్తున్న కొంతమంది పోలీసులను అదుపు చేయాలని స్పష్టం చేశారు.

పోలీసుల తీరును ఖండిస్తున్నాం: హరీశ్

సోషల్ మీడియా వేదికగా ప్రశ్నించినందుకు మాలోత్ సురేశ్‌ను హింసించటం బాధాకరమని మాజీమంత్రి హరీశ్‌రావు అన్నారు. తొర్రూరు పోలీసుల తీరును తీవ్రంగా ఖండిస్తున్నామని, బాధితుడి తల్లి ఆవేదనను అర్థం చేసుకోవాలని, తెలంగాణ డీజీపీ విచారణ జరిపి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సోకాల్డ్ కాంగ్రెస్ ప్రజాపాలనలో ప్రశ్నించే గొంతులను నొక్కేస్తున్నారని, ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేస్తున్నారని విమర్శించారు.

సురేశ్‌బాబుకు అండగా ఉంటాం: ఎర్రబెల్లి

తొర్రూరు, జూలై 11: మాలోత్ సురేశ్ కుటుంబానికి అండగా ఉంటామని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు భరోసా ఇచ్చారు. గురువారం సాయంత్రం బాధితుడిని పరామర్శించిన ఆయన.. సురేశ్ కుటుంబసభ్యులను కలిసి అన్నివిధాలా అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకునేలా ఒత్తిడి తెస్తానని హామీ ఇచ్చారు. అక్కడి నుంచే మహబూబాబాద్ ఎస్పీకి ఫోన్ చేసి ఘటనపై సమగ్ర విచారణ జరపాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని, అవసరమైతే ఆందోళనలు చేస్తామని వెల్లడించారు.

రేపు మల్లావఝుల సదాశివుడు స్మారక పురస్కార సభ

- రవీంద్రభారతిలో అవార్డు ప్రదానం
- ప్రముఖ కవి మోహన్ రుషి, రచయిత పసునూరు శ్రీధర్‌బాబు ఎంపిక
- ముఖ్య అతిథిగా మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, జూలై11 (నమస్తే తెలంగాణ): సింగరేణి ఉద్యమ చైతన్యశీలుడు, తెలంగాణ వాగ్గేయకారుడు మల్లావఝుల సదాశివుడు స్మారక పురస్కార ప్రదాన సభను శనివారం రవీంద్రభారతిలో తెలంగాణ వికాస సమితి, చేతన సాహితీ సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈ వేడుకకు ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు హాజరుకానున్నారు. 'ఏమున్న దక్కో..', తలాపునా పారుతుంది గోదారి, పారాని అరిశేలు చెల్లెలా వంటి అనేక ప్రజాదరణ పొందిన పాటలతో సింగరేణి ప్రాంతంలో ఉద్యమచైతన్యాన్ని రగిలించిన వాగ్గేయకారుడు సదాశివుడు. తెలంగాణ ఉద్యమ నేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు వాగ్గేయకారుడు మల్లావఝుల సదాశివుడు రాసిన పాటలంటే ఎంతో అభిమానం. వాగ్గేయకారుడు సదాశివుడు స్మారకార్థం తెలంగాణ వికాస సమితి, చేతన సాహితీ సమాఖ్యలు సంయుక్తంగా ప్రతి సంవత్సరం స్మారకపురస్కారాన్ని అందిస్తున్నాయి. 2022 సంవత్సరానికి గాను సదాశివుడి స్మారక పురస్కారానికి ప్రముఖ కవి మోహన్‌రుషి, 2023 సంవత్సరానికిగాను రచయిత పసునూరు శ్రీధర్‌బాబును ఎంపిక చేశారు. ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అధ్యక్షతన రవీంద్రభారతి వేదికగా శనివారం సాయంత్రం 5 గంటలకు పురస్కార ప్రదాన సభ జరుగుతున్నది. ఈ కార్యక్రమానికి వక్తగా హైదరాబాద్ సిటీ కాలేజీ తెలుగు శాఖ అధ్యక్షుడు కోయి కోటేశ్వరరావు హాజరుకానున్నారని తెలంగాణ వికాస సమితి ప్రధాన కార్యదర్శి ఎర్రోజు శ్రీనివాస్, చేతన సాహితీ సమాఖ్య వ్యవస్థాపకులు మల్లావఝుల విజయ్ వెల్లడించారు.



ఓయూలో లా కాలేజీ వద్ద బీఆర్ఎస్వీ నాయకుల నిరసన

మానవతారాయ్ అటెండర్ కాలేడు!

- బీఆర్ఎస్ నేతల గురించి మాట్లాడితే నాలుక కోస్తాం..
- బీఆర్ఎస్వీ నాయకులు స్వామి, సతీశ్ ఆగ్రహం

హైదరాబాద్, జూలై 11 (నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుల గురించి ఇష్టారీతిన మాట్లాడితే నాలుక కోస్తామంటూ బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు తుంగ స్వామి యాదవ్, పడాల సతీశ్ హెచ్చరించారు. ఉస్మానియా విద్యార్థులను అవమానించిన రేవంత్‌రెడ్డి గురించి నీతులు చెప్పడం ఆశ్చర్యంగా ఉందని కాంగ్రెస్ నేత మానవతారాయ్‌ని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. గురువారం ఓయూలో వారు మాట్లాడుతూ 'మరోసారి బీఆర్ఎస్ నాయకుల గురించి నోటికొచ్చినట్టు మాట్లాడితే బట్టలిప్పి ఆర్ట్స్ కాలేజీ ముందు నిలబెడుతం బిడ్డా ఖబడ్దార్' అని హెచ్చరించారు. మానవతారాయ్‌కి కాంగ్రెస్‌లో కార్పొరేషన్ పదవి కాదు గదా.. ఓయూలో అటెండర్ పోస్టు కూడా దొరకదని ఎద్దేవాచేశారు. బీఆర్ఎస్ ముఖ్యనేతలపై మానవతారాయ్, కైలాస్ నేత, దారకొండ వెంకటేశ్ మరోసారి అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని చెప్పారు. ఓయూ విద్యార్థులు లీడర్లు, లీడర్లను లా పడుతారని రేవంత్‌రెడ్డి అన్నప్పుడు మానవతారాయ్ ఎక్కడ పడుకున్నాడని నిలదీశారు. 'ఎన్నికల ముందు మూట కోసం బీఆర్ఎస్‌లో చేరి రేవంత్‌రెడ్డిని నోటికొచ్చినట్టు మాట్లాడిన నువ్వు ఇప్పుడు నీతులు చెబితే ఎవరూ నమ్మరు' అని దుయ్యబట్టారు. సమావేశంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు జహీర్‌ఖాన్, జంగం అవినాష్, మాదం యుగంధర్‌రెడ్డి, శ్రీకాంత్‌గౌడ్, ఎస్ రాజు, జిల్లా నాగయ్య, మిథున్ ప్రసాద్, బాలు పాల్గొన్నారు.

మంథనిలో మంత్రి అరాచకాలు

- నియోజకవర్గంలో పోలీసులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నరు
- ప్రతిపక్ష నేతలపై తప్పుడు కేసులు నమోదు చేస్తున్నరు
- మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ధ్వజం



మహిళ నిరసన తెలుపుతున్న వీడియోను చూపిస్తున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

హైదరాబాద్, జూలై 11 (నమస్తే తెలంగాణ): మంథని నియోజకవర్గ ఎమ్మెల్యే, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు అక్రమాలు, అరాచకాలు పెరిగిపోతున్నాయని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆరోపించారు. ప్రజలను, ప్రతిపక్ష పార్టీల నేతలను వేధించడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. గురువారం తెలంగాణభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మంత్రి శ్రీధర్‌బాబు పోలీసులను అడ్డం పెట్టుకుని ప్రత్యర్థులను వేధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ ప్రత్యర్థులపై రౌడీషీట్లు తెరవటానికి సమయాన్ని వెచ్చిస్తున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడిపై ఓ మహిళ ఫిర్యాదు చేస్తూ 45 రోజులైనా పోలీసులు చర్యలు తీసుకోవటం లేదని ఆరోపించారు. మంత్రి తమ్ముడికి ఏ హోదా ఉన్నదని భారీ పోలీస్ రక్షణ కల్పిస్తున్నారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ కార్యకర్త సత్యనారాయణ ఇల్లును మంత్రి ఇటీవలే కూలగొట్టించారని, బీఆర్ఎస్ కార్యకర్తలు ఫిర్యాదు చేసినా పోలీసులు తీసుకోవటం లేదని వాపోయారు. ప్రతిపక్షంలో ఉండగా మధిర ఎమ్మెల్యే (డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క) దీక్షకుమాటికి వచ్చేవారని, ఇప్పుడు మహిళల రోదనలు వినిపించటం లేదా? అని నిలదీశారు. అసలు రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉన్నదా? అని ప్రశ్నించారు. ఈ అంశంలో ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలని, లేదంటే కోర్టును ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు.

బాలికపై టీచర్ లైంగిక వేధింపులు

- బయటకు రాకుండా మధ్యవర్తులతో రాజీ
- ఆలస్యంగా వెలుగులోకి
- ఉపాధ్యాయుడు సహా పది మందిపై కేసు

బాన్సువాడ, జూలై 11: ఓ ఉపాధ్యాయుడు విద్యార్థినిని లైంగికంగా వేధించిన ఘటన బయటకు పొక్కకుండా గ్రామ పెద్దలు రాజీ కుదిర్చారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలంలో చోటుచేసుకున్న ఈ ఉదంతం ఆలస్యంగా వెలుగు చూసింది. దీంతో ఉపాధ్యాయుడు సహా పది మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం బాన్సువాడ డీఎస్పీ సత్యనారాయణ వెల్లడించిన వివరాల ప్రకారం.. బాన్సువాడ మండలంలోని ఓ గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు.. అదే పాఠశాలలో చదువుతున్న ఓ విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ ఘటన బయటకు పొక్కకుండా స్థానికులు కొందరు మధ్యవర్తులుగా వ్యవహరించి.. ఉపాధ్యాయుడికి, బాలిక తల్లిదండ్రులకు మధ్య రాజీ కుదిర్చారు. తాజాగా ఈ విషయం పోలీసుల దృష్టికి వచ్చింది. దీంతో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సహకారంతో బాధితురాలితో పాటు ఆమె తల్లిదండ్రులతో మాట్లాడగా, లైంగిక వేధింపులు నిజమేనని తేలింది. విద్యార్థిని తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఉపాధ్యాయుడితో పాటు రాజీ కుదిర్చిన తొమ్మిది మంది మధ్యవర్తులపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.



మద్దూర్‌చిట్టంపల్లిలో మరుగుదొడ్డి గదిలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం

మరుగుదొడ్డి కాదు.. అంగన్‌వాడీ

- ఇబ్బందుల్లో 10 మంది విద్యార్థులు, టీచర్
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

వికారాబాద్, జూలై 11: అది ఓ మరుగుదొడ్డి. కాదు.. కాదు.. అంగన్‌వాడీ కేంద్రం. ఇందులో ఏది కరెక్టో అనుకుంటున్నారా? రెండూ నిజమే! అంగన్‌వాడీ కేంద్రానికి భవనం లేకపోవడంతో ఆ పక్కనే ఉన్న మరుగుదొడ్డిలోనే కేంద్రాన్ని నడుపుతున్నారు. ఈ దయనీయ పరిస్థితి ఎక్కడో ఉన్నది కాదు.. రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న వికారాబాద్ జిల్లాలోనిది. వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని మద్దూర్ చిట్టంపల్లికి 4 కి.మీ. దూరంలో ఉన్న అనుబంధ తండా టేకులబీడులో ఒకేఒక్క పాఠశాల ఉంది. ఆ పాఠశాలలో ఒకే తరగతి గది ఉంది. అందులో 5వ తరగతి వరకు విద్యార్థులు చదువుతున్నారు. ఆ స్కూల్ ప్రాంగణంలోనే కొన్నేండ్లుగా అంగన్‌వాడీ కేంద్రం కొనసాగింది. దీంతో అటు పాఠశాలకు, ఇటు అంగన్‌వాడీకి తరచూ ఇబ్బందులు తలెత్తడంతో.. అంగన్‌వాడీ భవనం ఏర్పాటు చేయాలని పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా అధికారులు స్పందించడం లేదు. చేసేదిలేక కొన్ని నెలల కింద అంగన్‌వాడీ కేంద్రాన్ని పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన మరుగుదొడ్డిలోకి మార్చారు. ఇంత చిన్న గదిలో దాదాపు 10 మంది చిన్నారులు, అంగన్‌వాడీ టీచర్ కూర్చునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాదు.. చిన్నారులకు అవసరమైన పౌష్టికాహారాన్ని అక్కడే తయారు చేయాల్సి వస్తున్నది. కొత్త భవనం మంజూరు చేయాలని అంగన్‌వాడీ టీచర్ సోనీబాయి వేడుకుంటున్నది.

- వరినారుకు ట్యాంకర్ నీరే దిక్కు



సంగారెడ్డి జిల్లా పొట్లచెరువుకు చెందిన కౌలు రైతు మన్నె లింగయ్య గ్రామంలోని నాయిని చెరువు కింద ఎకరాకు రూ.10వేలు చెల్లించి మూడెకరాలు కౌలు తీసుకున్నాడు. రూ.6 వేలతో మక్కలు మన్ని, విత్తనాలకు రూ.3,300, తుకం పోసేందుకు మరో రూ.1000 ఖర్చు చేశాడు. వర్షం లేకపోవడంతో నారు ఎండిపోతున్నది. దీంతో రూ.2వేలతో ట్యాంకర్ నీరు కొనుగోలుచేసి బతికించుకుంటున్నాడు. ఇప్పటి వరకు నాలుగు ట్యాంకర్లతో నీరు పోయించానని, వర్షాలు పడకుంటే వరి దక్కదని చెమ్మగిల్లిన కండ్లతో చెప్పాడు. సింగూరు జలాలతో చెరువు నింపి ఆదుకోవాలని వేడుకున్నాడు.

- సంగారెడ్డి

నిరుద్యోగులకు 5వేల భృతి ప్రకటించాలి

- పది పాలనలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఫెయిల్
- మాజీ మంత్రి మోత్కుపల్లి



యాదగిరిగుట్ట, జూలై 11: నిరుద్యోగులకు నెలకు రూ.5 వేల చొప్పున భృతిని ప్రకటించాలని కాంగ్రెస్ నాయకుడు మోత్కుపల్లి నర్సింహులు డిమాండ్ చేశారు. డీఎస్సీని వాయిదా వేయాలన్న నిరుద్యోగుల దీక్షపై పోలీసుల దాడి చేయడం బాధాకరమని అన్నారు. తన పుట్టిన రోజు సందర్భంగా గురువారం ఆయన యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం పట్టణంలో మీడియాతో మాట్లాడారు. పదిపాలనలో రేవంత్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఉచిత బస్సు తప్ప ఏ ఒక్క హామీని అమలు చేయడం లేదని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 8 సీట్లకే పరిమితం కావడం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో ప్రజల్లో నమ్మకాన్ని కోల్పోవడమేనని పేర్కొన్నారు. రాష్ట్రంలో 80 లక్షల మంది దళితులు ఉంటే ఒక్కరికి కూడా సీటు ఇవ్వకపోవడం సరికాదని అన్నారు. సీనియరైన తనకు ఎమ్మెల్యే లేదా ఎంపీ టికెట్ ఇవ్వకపోవడంపై ఆవేదన వ్యక్తంచేశారు. ఆంధ్రప్రదేశ్‌లో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఫొటోను తనతో సమానంగా అధికార కార్యాలయాల్లో పెట్టించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారని గుర్తు చేస్తూ.. తెలంగాణలోనూ సీఎం రేవంత్‌రెడ్డి.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు అంతే గౌరవం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

- ఎల్కల్‌లో ట్రిపుల్ ఆర్ భూనిర్వాసితుల ఆందోళన



రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని, బలవంతంగా తమ భూములు గుంజుకుంటే భూమికి బదులుగా మరోచోట భూమిని ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం ఎల్కల్ గ్రామానికి చెందిన రైతులు గురువారం ఆందోళనకు దిగారు. సర్వే చేయడానికి వచ్చిన అధికారులను అడ్డుకున్నారు. భూములను కోల్పోతే రోడ్డున పడతామని ఆవేదన వ్యక్తంచేశారు. - రాయపోల్

- స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని కలెక్టరేట్ల ముట్టడి



పెండింగ్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు గురువారం నల్లగొండ, పెద్దపల్లి కలెక్టరేట్లను ముట్టడించారు. రాష్ట్రవ్యాప్తంగా స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.8 వేల కోట్లు బకాయి ఉండటంతో ప్రైవేట్ కళాశాలల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు కళాశాల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. - రామగిరి/పెద్దపల్లి టౌన్

- కలెక్టరేట్ ఎదుట జీపీ కార్మికుల ధర్నా



పెండింగ్ వేతనాలు చెల్లించాలని, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామ పంచాయతీ కార్మికులు గురువారం కామారెడ్డి కలెక్టరేట్ ఎదుట గురువారం ధర్నా చేశారు. నెలనెలా జీతాలు రాకపోతే ఎట్లా బతికేది? అని ఆవేదన వ్యక్తంచేశారు. తాము ఆకలితో అలమటిస్తున్నా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. - కామారెడ్డి

ఫొటోలు, వీడియోల కింద లింక్‌లు క్లిక్ చేస్తే హ్యాకే!

- సైబర్‌క్రైమ్ పోలీసులు

హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై 11 (నమస్తే తెలంగాణ): సైబర్ నేరగాళ్లు ఫొటోలు, వీడియోల కింద లింకులు జోడించి వాట్సాప్, ఫేస్‌బుక్‌లను హ్యాక్ చేస్తున్నారు. ఈ తరహా మోసాలపై ప్రతి రోజు మూడు, నాలుగు ఫిర్యాదులు సైబర్ ఠాణాల్లో నమోదవుతున్నాయి. ఇటీవల బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఫేస్‌బుక్ కూడా ఇలాగే సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేసినట్లు సీసీఎస్ సైబర్‌క్రైమ్ పోలీసులు అను మానిస్తున్నారు. ఫొటోలు, వీడియోల కింద వచ్చే లింక్‌లపై క్లిక్ చేస్తే వాట్సాప్, ఫేస్‌బుక్ వాళ్ల ఆధీనంలోకి వెళ్లిపోతాయి. బాధితుల నంబర్‌తోనే అందులో ఉన్న ఫోన్ నంబర్లకు డబ్బులు అర్జంట్ అని సందేశాలు పంపి మోసగిస్తున్నారు. ఇలాంటి కేసులు సైబర్ క్రైమ్ ఠాణాకు ఎక్కువగా వస్తున్నాయని ఏసీపీ రాంప్రసాద్ వెల్లడించారు. గుర్తుతెలియని వ్యక్తులు పంపించే ఫొటోలు, వీడియోలను క్లిక్ చేయవద్దని సూచించారు.

తిరుమలలో ప్రాంక్ వీడియోలు

- భక్తులపై ఆకతాయిల వెర్రిచేష్టలు
- విచారణకు ఆదేశించిన టీటీడీ

హైదరాబాద్, జూలై 11 (నమస్తే తెలంగాణ): తిరుమలలో భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా ఆకతాయిలు ప్రాంక్ వీడియోలు తీయడం తీవ్ర కలకలం సృష్టించింది. వైరల్ అవుతున్న వీడియో ప్రకారం.. తమిళనాడుకు చెందిన ముగ్గురు యువకులు తిరుమల లోపల ప్రాంక్ వీడియో కోసం.. నారాయణగిరి షెడ్స్‌లోని క్యూలో వెళ్లి మరో కంపార్ట్‌మెంట్ తాళాలు తీసే ఉద్యోగిలా నటించి ఇచ్చారు. భక్తులు ఆ వ్యక్తిని టీటీడీ ఉద్యోగిగా భావించి ఒక్కసారిగా పైకి లేచారు. వెంటనే సదరు యూట్యూబర్ కంపార్ట్‌మెంట్ నుంచి నవ్వుతూ పరుగులు తీశాడు. ఇదంతా మరో యువకుడు వీడియో తీశాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో పలువురు నెటిజన్లు టీటీడీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ వీడియోలపై టీటీడీ తీవ్రంగా స్పందించింది. భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా ప్రాంక్ వీడియోలు తీసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ప్రకటించింది. తిరుమల ఆలయంలోకి ఫోన్ ఎలా తీసుకెళ్లారు? అనేది తెలియాల్సి ఉంది.

ఫోన్‌ట్యాపింగ్ కేసులో మూడోసారి బెయిల్ పిటిషన్లు

నాంపల్లి కోర్టులు, జూలై 11 (నమస్తే తెలంగాణ): ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుల తరఫున గురువారం మూడోసారి డిఫాల్ట్ బెయిల్ పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ సందర్భంగా నిందితుల తరఫున న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. బెయిల్ పిటిషన్లను దాఖలు చేసినప్పుడు కోర్టు ఎందుకు చార్జిషీట్ లేదని, అనివార్య కారణాల వల్ల దానిని కోర్టు వెనక్కి పంపిందని గుర్తుచేశారు. ఇప్పటివరకు కోర్టు చార్జిషీట్‌ను అంగీకరించలేదని తెలిపారు. చార్జిషీట్‌తో పాటు అందులో పేర్కొన్న వస్తువులను పోలీసులు కోర్టుకు సమర్పించడంలో ఎందుకు విఫలమయ్యారని ప్రశ్నించారు. విచారణ అధికారి తప్పుల వల్ల రిమాండ్ ఖైదీలుగా నిందితులకు 120 రోజులు పూర్తయ్యాయని గుర్తుచేశారు. బెయిల్ పిటిషన్లపై పబ్లిక్ ప్రాసిక్యూటర్ అభ్యంతరం తెలిపారు. చార్జిషీట్ దాఖలు చేసిన తర్వాత డిఫాల్ట్ బెయిల్‌కు అవకాశం లేదని అన్నారు. రెండుసార్లు డిఫాల్ట్ బెయిల్ పిటిషన్లు తిరస్కరించిన నేపథ్యంలో మరోసారి దాఖలు చేయడానికి వీలులేదని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పులు తెలుపుతున్నాయని చెప్పారు. ఇరువైపులా వాదనలు విన్న కోర్టు తీర్పును శుక్రవారానికి రిజర్వు చేస్తున్నట్టు ప్రకటించింది. అంతకుముందు వెస్ట్ జోన్ డీసీపీ విజయకుమార్, విచారణాధికారి, ఏసీపీ వెంకటగిరి, డీఎస్పీ రాంబాబు రెడ్డి మెజిస్ట్రేట్ చాంబర్‌లోకి వెళ్లడంపై డిఫెన్స్ న్యాయవాది సురేందర్‌రావు అభ్యంతరం చెప్పారు. దీనిపై మెజిస్ట్రేట్ స్పందిస్తూ.. కోర్టు నిందితుల పక్షానే నిలబడుతుందని చెప్పారు.



న్యాయం కోసం డీజీపీ ఆఫీస్‌కు!

- భారీగా వస్తున్న బాధితులు
- పోలీస్‌స్టేషన్లపై అవినీతి ఆరోపణలు
- న్యాయం చేస్తలేరని ఆక్రోశాలు
- భూ వివాదాల్లోనూ తలదూరుస్తున్న వైనం

హైదరాబాద్, జూలై 11 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని పలు పోలీస్‌స్టేషన్లలో న్యాయం జరగడం లేదని బాధితులు ఏకంగా పోలీసు కేంద్ర కార్యాలయానికి క్యూ కడుతున్నారు. పోలీసులు బాధితుల వైపున కాకుండా.. నిందితుల వైపున నిలబడుతున్నారని, తమకు డీజీపీ న్యాయం చేయాలని గోడు వెళ్లబోసుకుంటున్నారు. పోలీస్‌స్టేషన్లలో కానిస్టేబుల్ నుంచి స్టేషన్ హౌజ్ ఆఫీసర్ వరకు లంచాలు తీసుకుంటున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. డబ్బులు తీసుకుని నిందితులకు వత్తాసు పలుకుతూ బాధితులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. మండల పోలీస్‌స్టేషన్ నుంచి, సీపీ కార్యాలయం, డీసీపీ ఆఫీసు, అడిషనల్ ఎస్పీ ఆఫీసుల్లో కూడా పట్టించుకోవడం లేదని, ఏకంగా డీజీపీ ద్వారానే న్యాయం జరుగుతుందని.. హైదరాబాద్ వరకూ వస్తున్నారు. డీజీపీ ఆఫీసు వరకూ వచ్చిన బాధితులకు తాత్కాలిక ఉపశమనం దొరికినా.. కొన్ని కేసుల్లో అక్కడ కూడా న్యాయం జరగకపోవడంతో ఎక్కడికి వెళ్లాలో తెలియని అయోమయంలో కొందరు బాధితులు కొట్టుమిట్టాడుతున్నారు. ఇటీవల ఓ బాధితురాలు ఓ రియల్ ఎస్టేట్ కుంభకోణంలో డబ్బులు కోల్పోయి.. వాటిని ఇప్పించాలని డీజీపీ కార్యాలయంలోకి ఏకంగా పెట్రోల్ బాటిల్, అగ్గిపెట్టె తీసుకొని రావడం కలకలం సృష్టించింది. డీజీపీతో ఆమె గోడు వెలిబుచ్చినా.. నేటికీ న్యాయం జరగలేదని తెలిసింది.



హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయానికి వచ్చిన బాధిత కుటుంబీకులు (ఫైల్)

కాంగ్రెస్ నేతలతో కుమ్మక్కయ్యారయ్యా..!

కరీంనగర్ జిల్లా బొప్పారంకి చెందిన మందా వినయ్ అనే యువకుడు జనవరి 22న అనుమానాస్పదంగా చనిపోయాడు. పాతకక్షలతో అతని స్నేహితులే మేడారం జాతరకు తీసుకుపోయి చంపేశారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పోలీసులు డబ్బులు తీసుకొని నిందితుల వైపే మాట్లాడుతున్నారని వినయ్ తల్లిదండ్రులు డీజీపీ ఆఫీసులో కన్నీటి పర్యంతమయ్యారు. నిందితుల్లో కొందరికి కాంగ్రెస్ నాయకుల అండ ఉంది తమకు అన్యాయం చేస్తున్నారని బోరున విలపించారు. ఫోన్ మెమోరీ కార్డులు, డేటా డిలీట్ చేసి, రోడ్డు ప్రమాదంలో చనిపోయినట్టు చిత్రీకరిస్తున్నారని, ఈ కేసును క్లోజ్ చేసే ప్రయత్నం చేస్తున్నారని, డీజీపీ తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు. అనివార్య కారణాల వల్ల అప్పటి డీజీపీ రవిగుప్తాను బొప్పారం నుంచి వచ్చిన బాధితులు కలువలేకపోయారు. డీజీపీ పేషీలో బాధితుల లెటర్‌ను తీసుకొని.. మల్టీజోన్-1 ఐజీకి పంపుతున్నట్టు రిసిప్ట్ ఇచ్చారు. ఈ కేసులో ఎలా స్పందిస్తారో చూడాలి.

భూ సమస్యల్లోకి పోలీసులు..

భూ సమస్యల్లో పోలీసులు తలదూర్చి నిందితుల పక్షాన మాట్లాడుతున్నారనే వాదనలు బాగా వినిపిస్తున్నాయి. నారాయణపేట జిల్లా ఉట్కూరులో ఇటీవల జరిగిన ఓ హత్య దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. గొడవ మొదలైనప్పుడే బాధితులు డయల్ 100కు కాల్ చేయగా.. ఎస్సై, సీఐ పట్టించుకోలేదు. హత్య జరిగిన తర్వాత కానిస్టేబుళ్లను పంపించారు. మహబూబ్‌నగర్‌లో చెందు మహిళ ఉదంతం అందరికీ తెలిసిందే. చెందుల భూమి కబ్జాచేసేందుకు కొలు చేస్తున్నవారే దాడి చేయడం, బాధితురాలి మామను హత్య చేయడం కలవరపెట్టే విషయం. భూమి పంచాయితీల్లో పోలీసులు సరైన సమయంలో స్పందించకపోవడంతో బాధితులు డీజీపీ ఆఫీసు వరకు వస్తున్నారు. భూ సమస్యల్లో పోలీసులు తలదూర్చి న్యాయం చేయడం లేదని మంగళవారం డీజీపీకి కొందరు బాధితులు ఫిర్యాదు చేశారు. ఓ హత్య కేసులో ఇంతవరకూ తమకు న్యాయం జరగలేదని మరో బాధిత కుటుంబం 'నమస్తే తెలంగాణ'తో వాపోయింది.

డాటాసైన్స్‌తో ప్రజా రవాణా పటిష్టం

- డాటాసైన్స్, మెషిన్ లెర్నింగ్ నిపుణుడు శరత్

హైదరాబాద్, జూలై 11 (నమస్తే తెలంగాణ) : డాటాసైన్స్‌తో ప్రజా రవాణాను పటిష్టం చేయవచ్చని డాటాసైన్స్, మెషిన్ లెర్నింగ్ నిపుణుడు శరత్ కాటిపల్లి అన్నారు. లీడర్‌షిప్ టాక్స్‌లో భాగంగా గురువారం హైదరాబాద్ బస్‌భవన్‌లో నిర్వహించిన 'ప్రజారవాణా వ్యవస్థలో డాటాసైన్స్, మెషిన్ లెర్నింగ్ వినియోగం' అంశంపై శరత్ ప్రసంగించారు. డాటాకు అనుగుణంగా రియల్ టైమ్‌లో మెరుగైన రవాణా సేవలను అందించవచ్చని తెలిపారు. మెసేజ్, మెసెంజర్, మెకానిక్స్, మెషినరీ కాన్సెప్ట్‌తో సంస్థను ఉన్నతస్థాయికి ఎలా తీసుకెళ్లవచ్చో వివరించారు. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ మాట్లాడుతూ.. డాటాసైన్స్‌తో ప్రజలకు మరింత చేరువయ్యేందుకు టీజీఎస్‌ఆర్టీసీ కసరత్తు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సీవోవో రవీందర్, జేడీ అపూర్వరావు, ఈడీ మునిశేఖర్, కృష్ణకాంత్, ఫైనాన్స్ అడ్వైజర్ విజయపుష్ప, ఉషారాణి, వెంకన్న, ఆర్‌ఎంలు, డీఆర్‌ఎంలు, డీఎంలు పాల్గొన్నారు.



పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

పంచాయతీ కార్మికుల వేతన బకాయిలు చెల్లించాలి

హిమాయత్‌నగర్, జూలై 11: గ్రామ పంచాయతీ కార్మికుల వేతన బకాయిలను తక్షణమే మంజూరు చేయాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లి రవి, ప్రధాన కార్యదర్శి పీ అరుణ్ కుమార్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే సూర్యం డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని గురువారం హిమాయత్‌నగర్‌లోని పంచాయతీ రాజ్, గ్రామీణ ఉపాధి కల్పన కమిషనర్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని 12,769 గ్రామ పంచాయతీల్లో వేలాది మల్టీపర్పస్ వర్కర్లు వెట్టిచాకిరి చేస్తున్నారని, జీవో నం 60 ప్రకారం వీరికి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు వెంకట్, నర్సింలు, వెంకట్రాములు, రాఘవేందర్, రాందాస్, సాంబశివుడు, రాజు, గట్టమ్మ, సుబ్బయ్య, రాములు, ఎల్లమ్మ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఎమరాల్డ్ మస్తు కల్తీ!

- ఆర్గానిక్ ఉత్పత్తుల మాటున ప్రమాదకర మిఠాయిలు
- జీహెచ్‌ఎంసీ ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీలు

సిటీబ్యూరో, జూలై 11 (నమస్తే తెలంగాణ): ఎమరాల్డ్ స్వీట్స్.. సూపర్ హెల్తీ గురూ..ఇది పాతమాట. ఎమరాల్డ్ స్వీట్స్.. మస్తు కల్తీ గురూ నేటిమాట. ఆర్గానిక్ ఉత్పత్తుల మాటున కల్తీ పదార్థాలతో మిఠాయిలను అందిస్తున్నట్టు జీహెచ్‌ఎంసీ ఫుడ్‌సేఫ్టీ విభాగం అధికారుల తనిఖీలో తేలింది. హైదరాబాద్ నగరంలోని ఇందిరాపార్కు దగ్గర ఉన్న ఎమరాల్డ్స్ స్వీట్‌హౌస్‌పై గురువారం జీహెచ్‌ఎంసీ ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులు తనిఖీలు నిర్వహించారు. ప్రమాదకరమైన కలర్స్ మిక్స్ అయిన 60 కేజీల బెల్లం, సరిగాలేని మూడు కిలోల జీడి పప్పును సీజ్ చేశారు. గడువు ముగిసిన పాలు, పెరుగు చూసి అధికారులు ఆశ్చర్యపోయారు. ఫుడ్ లైసెన్స్ డిస్‌ప్లే పెట్టలేదని, మెడికల్ సర్టిఫికెట్లు లేని ఫుడ్ హ్యాండ్లర్లను గుర్తించారు. శాంపిల్స్‌ను తీసుకున్న అధికారులు ల్యాబ్‌కు తరలించి, ఎమరాల్డ్స్ స్వీట్ షాపు నిర్వాహకుడికి నోటీసులు జారీ చేశారు.



పెద్దపల్లి జిల్లా గర్రెపల్లి దేవాలయంలో ఉన్న వేణుగోపాలుడి విగ్రహం

అరుదైన వేణుగోపాల స్వామి శిల్పం గుర్తింపు

హైదరాబాద్, జూలై 11(నమస్తే తెలంగాణ): పెద్దపల్లి జిల్లా, సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లి గ్రామంలోని దేవాలయంలో అరుదైన వేణుగోపాలస్వామి శిల్పాన్ని కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యులు శ్రీరామోజు హరగోపాల్, కుందారపు సతీశ్ తదితరులు గుర్తించారు.

ఉస్మానియా మెడికల్ కాలేజీలో లైంగిక వేధింపుల కేసులో స్టే

హైదరాబాద్, జూలై 11 (నమస్తే తెలంగాణ): ఉస్మానియా మెడికల్ కాలేజీలో విద్యార్థిని మీద జరిగిన లైంగిక వేధింపుల ఘటనపై అంతర్గత ఫిర్యాదుల కమిటీ (ఐసీసీ) సమర్పించిన రెండు వేర్వేరు రిపోర్టుల అమలును నిలిపివేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. ఫిర్యాదు ప్రతులు, నివేదిక కాపీలను ఆరోపణలు ఎదుర్కొంటున్నవారికి ఎందుకు ఇవ్వలేదో చెప్పాలని అంతర్గత కమిటీ చైర్మన్, సభ్యులు, డీఎంఈ, ఉస్మానియా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్లను కోర్టు ఆదేశించింది. వారంతా కౌంటర్ దాఖలు చేయాలని పేర్కొంటూ నోటీసులు జారీ చేసింది. లైంగిక వేధింపులకు గురైనట్టు ఫిర్యాదు చేసిన విద్యార్థినిని కూడా ప్రతివాదిగా చేర్చాలని ఉత్తర్వులు జారీచేసింది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న మహిళ, పురుష విద్యార్థులు, నర్సు, శాఖాధిపతి అయిన మహిళా ప్రొఫెసర్లు హైకోర్టును ఆశ్రయించారు. తదుపరి ఉత్తర్వులు జారీచేసే వరకు స్టే అమల్లో ఉంటుందని పేర్కొంటూ.. తదుపరి విచారణను ఈనెల 30వ తేదీకి కోర్టు వాయిదా వేసింది.



రాజ్‌నాథ్‌కు అస్వస్థత

న్యూఢిల్లీ: రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అస్వస్థతకు గురయ్యారు. ఆకస్మాత్తుగా ఆరోగ్యం క్షీణించడంతో ఆయనను గురువారం ఉదయం ఎయిమ్స్‌లోని న్యూరో సర్జరీ డిపార్ట్‌మెంట్‌లో చేర్పించారు. ఎయిమ్స్ మీడియా సెల్ ఇన్‌చార్జ్ డాక్టర్ రీమా దాదా తెలిపిన వివరాల ప్రకారం, రాజ్‌నాథ్ ఆరోగ్యం నిలకడగా ఉంది. ఆయనను వైద్యులు పర్యవేక్షిస్తున్నారు. నడుము నొప్పి రావడంతో ఆయనను ఎయిమ్స్‌లో చేర్పించారు.

కేజ్రీవాల్ పిటిషన్‌పై నేడు సుప్రీం తీర్పు

న్యూఢిల్లీ: ఢిల్లీ సీఎం, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు శుక్రవారం తీర్పు చెప్పబోతున్నది. ఢిల్లీ మద్యం విధానం కేసులో తనను ఈడీ అరెస్ట్ చేయడాన్ని ఆయన సవాల్ చేశారు. ఆయన మనీలాండరింగ్‌కు పాల్పడినట్టు ఈడీ ఆరోపించింది. ఈ పిటిషన్‌పై వాదనలు ముగిసిన తర్వాత తీర్పును సుప్రీంకోర్టు మే 17న రిజర్వు చేసింది.

చైనా నుంచి పాక్‌కు నిషేధిత రసాయనాలు!

- తమిళనాడులో సీజ్ చేసిన కస్టమ్స్ అధికారులు

చెన్నై, జూలై 11: నిషేధిత రసాయనాలు ఉన్న చైనా కార్గో కంటైనర్‌ను తమిళనాడులోని కట్టుపల్లి ఓడరేవు వద్ద కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పాకిస్థాన్ జీవ, రసాయన యుద్ధం కోసం ఈ రసాయనాలను చైనా పంపుతున్నట్టు కస్టమ్స్ అధికారులు అనుమానం వ్యక్తం చేశారు. టియర్‌గ్యాస్‌గా వాడే (ఆర్థో క్లోరో బెంజిలిడీన్ మాలోనోనిట్రైల్) కెమికల్ చైనా కంటైనర్‌లో పెద్ద మొత్తంలో ఉన్నట్టు అధికారులు గుర్తించారు. అల్లర్లు, నిరసనల్ని నియంత్రించటానికి, సైనికపరంగానూ వాడొచ్చునని వారు తెలిపారు. రావల్పిండిలోని రక్షణ ఉత్పత్తులను సరఫరా చేసే సంస్థకు రసాయనాలను పంపుతున్నట్టు అధికారులు గుర్తించారు.

మళ్లీ రైతుల పోరుబాట

- దేశవ్యాప్త నిరసనలకు సమాయత్తం
- ఎంఎస్పీకి చట్టబద్ధత, రుణమాఫీ తదితర డిమాండ్ల సాధనకు ఉద్యమం
- సంయుక్త కిసాన్ మోర్చా ప్రకటన

న్యూఢిల్లీ, జూలై 11: రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మళ్లీ ఉద్యమాన్ని ప్రారంభించనున్నట్టు సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్కేఎం) గురువారం ప్రకటించింది. 2020-21లో కేంద్రం తెచ్చిన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని చేపట్టిన రైతు సంఘాల ఐక్య వేదిక సంయుక్త కిసాన్ మోర్చా సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. ఇందులో తీసుకున్న నిర్ణయాలను ఎస్కేఎం గురువారం ప్రకటించింది. మళ్లీ ఉద్యమాన్ని పునఃప్రారంభించాలని నిర్ణయించినట్టు పేర్కొన్నది. ముఖ్యంగా పంటలకు కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించాలని, రైతుల రుణాలు మాఫీ చేయాలనే డిమాండ్‌తో ఉద్యమ కార్యాచరణను సిద్ధం చేసినట్టు తెలిపింది. 2021 డిసెంబర్ 9న రైతు సంఘాలతో జరిగిన చర్చల్లో కేంద్రం చేసుకున్న ఒప్పందంలోని అంశాలను నెరవేర్చాలని డిమాండ్ చేసింది. జూలై 16 నుంచి 18 వరకు ప్రధానమంత్రి, ప్రతిపక్ష నేత సహా ఎంపీలందరినీ కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించనున్నట్టు తెలిపింది. ఉద్యమం సమయంలో మరణించిన అన్నదాతల గౌరవార్థం ఢిల్లీ సరిహద్దుల్లోని టిక్రీ, సింఘు వద్ద స్మారకాలను నిర్మించనున్నట్టు వెల్లడించింది. అలాగే 2021లో ఉత్తరప్రదేశ్‌లోని లఖింపూర్ ఖేరీలో కేంద్ర మంత్రి అజయ్ మిశ్రా కుమారుడు ఆశిష్ మిశ్రా కాన్వాయ్ దూసుకెళ్లడంతో ప్రాణాలు కోల్పోయిన అన్నదాతలకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేసింది.



ఈసారి దేశవ్యాప్త ఉద్యమం

ప్రపంచ వాణిజ్య సంస్థ(డబ్ల్యూటీఓ) నుంచి భారత్ బయటకు రావాలని, వ్యవసాయ రంగంలోకి బహుళ జాతి సంస్థలను అనుమతించవద్దని ఎస్కేఎం నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆగస్టు 9న 'క్విట్ ఇండియా దినం' 'కార్పొరేట్స్ క్విట్ ఇండియా దినం'గా నిర్వహిస్తామని, దేశవ్యాప్తంగా తమ డిమాండ్ల సాధనకు ప్రదర్శనలు నిర్వహిస్తామని ప్రకటించారు. తమ డిమాండ్ల సాధనకు ఇక కొత్త పద్ధతుల్లో ఉద్యమాన్ని నడిపించాలని రైతు సంఘాలు నిర్ణయించాయి. ఈసారి ఢిల్లీకి ర్యాలీ చేపట్టడం కాకుండా దేశవ్యాప్త నిరసనలు తెలుపుతామని, ముఖ్యంగా అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న మహారాష్ట్ర, జార్ఖండ్, జమ్ము కశ్మీర్, హర్యానా రాష్ట్రాలపై ప్రధాన దృష్టి సారిస్తామని ఎస్కేఎం నేతలు ప్రకటించారు.



తెరుచుకోనున్న రత్న భాండాగారం

అధికారులకు పాముల భయం

పూరీ: ఒడిశాలోని పూరీలో ఉన్న శ్రీ జగన్నాథ దేవాలయంలోని రత్న భాండాగారాన్ని ఈ నెల 14న తెరవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ రహస్య గదిలోని ఐదు పెట్టెల్లో ఉన్న అమూల్యమైన ఆభరణాలను లెక్కించబోతున్నారు. ఆ సమయంలో అనుసరించవలసిన మార్గదర్శకాలను అధికారులు ప్రభుత్వానికి పంపించారు. అయితే పురాతన దేవాలయాల్లోని ఖజానాలకు పాములు కాపలా ఉంటాయనే విశ్వాసం ఉండటంతో అధికారులు భయాందోళనంతో గడుపుతున్నారు. పాములు పట్టడంలో నిపుణులను, వైద్య బృందాలను అందుబాటులో ఉంచాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. 1978 తర్వాత రత్న భాండాగారాన్ని తెరవబోతుండటం ఇదే మొదటిసారి.

నీట్‌పై విచారణ జూలై 18కి వాయిదా

న్యూఢిల్లీ, జూలై 11: నీట్-యూజీ పరీక్షలో అక్రమాలపై విచారణను జూలై 18కి సుప్రీంకోర్టు వాయిదా వేసింది. నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలని, అక్రమాలపై విచారణ జరిపించాలని, పరీక్షను రద్దు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను కలిపి సుప్రీంకోర్టు విచారిస్తున్నది. ఈ పిటిషన్లపై స్పందన తెలియజేయాల్సిందిగా కేంద్ర ప్రభుత్వం, పరీక్ష నిర్వహించిన జాతీయ పరీక్ష సంస్థ(ఎన్టీఏ)ను ఇంతకుముందు కోర్టు ఆదేశించింది. బుధవారం కేంద్రం, ఎన్టీఏ వేర్వేరుగా స్పందనను తెలియజేస్తూ అఫిడవిట్లు దాఖలు చేశాయి. గురువారం ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ అంశంపై విచారణ ప్రారంభించింది. పరీక్షలో అక్రమాలపై సీబీఐ జరుపుతున్న విచారణ పురోగతిపై తమకు నివేదిక అందినట్టు కోర్టు పేర్కొన్నది. అయితే, తమకు కేంద్రం, ఎన్టీఏ దాఖలు చేసిన అఫిడవిట్లు అందలేదని పలువురు పిటిషనర్లు ధర్మాసనానికి తెలిపారు. దీంతో జూలై 15కు విచారణ వాయిదా వేస్తామని ధర్మాసనం చెప్పింది. అయితే, ఆ రోజు తాను అందుబాటులో ఉండనని కేంద్ర ప్రభుత్వ సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తెలిపారు. దీంతో విచారణను జూలై 18కి కోర్టు వాయిదా వేసింది.



పేపర్ లీక్ సూత్రధారి రాకీ అరెస్టు

నీట్-యూజీ పేపర్ లీక్ కుంభకోణంలో ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న వ్యక్తిని సీబీఐ అరెస్టు చేసింది. పేపర్ లీక్ వెనుక మాస్టర్‌మైండ్‌గా అనుమానిస్తున్న రాకేశ్ రంజన్ అలియాస్ రాకీని అరెస్టు చేశామని సీబీఐ అధికారులు గురువారం వెల్లడించారు. కోర్టు అతడికి 10 రోజుల పాటు సీబీఐ కస్టడీకి అప్పగించినట్టు అధికారులు తెలిపారు. సీబీఐ అధికారులు పట్నా, కోల్‌కతా సమీపంలో పలు చోట్ల దాడులు నిర్వహించగా, రాకేశ్ రంజన్ పట్టుబడ్డారని తెలిసింది. కాగా, నీట్‌లో సామూహిక మాల్‌ప్రాక్టీస్ జరగలేదని, కాబట్టి మళ్లీ పరీక్ష నిర్వహించాల్సిన అవసరం లేదని కేంద్ర ప్రభుత్వం బుధవారం కోర్టులో అఫిడవిట్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే.


సూసైడ్ క్యాప్సూల్‌పై స్విట్జర్లాండ్ నిషేధం

బెర్న్, జూలై 11: క్షణాల్లో ప్రాణాలు తీసే సూసైడ్ క్యాప్సూల్‌ను స్విట్జర్లాండ్ నిషేధించింది. ఎగ్జిట్ స్విట్జర్లాండ్ అనే కంపెనీ సార్కో పాడ్ పేరుతో ఈ మెషిన్‌ను తయారుచేసింది. కారుణ్య మరణం పొందాలనుకునే వారి కోసం దీనిని తయారుచేశారు. ఈ మెషీన్‌ను త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామని దీనిని తయారుచేసిన డాక్టర్ ఫిలిప్ నిట్చ్‌కీ జూన్ 10న ప్రకటించారు. అయితే, ఈ సూసైడ్ క్యాప్సూల్ వల్ల దుష్పరిణామాలు ఉంటాయని భావించిన స్విట్జర్లాండ్ ప్రభుత్వం దీనిపై నిషేధం విధించింది. ఏదైనా భరించలేనంత అనారోగ్య సమస్యను అనుభవిస్తున్న వారు సులువుగా కారుణ్య మరణం పొందేందుకు ఈ క్యాప్సూల్ ఉపయోగపడుతుందని దీనిని తయారుచేసిన కంపెనీ చెప్తున్నది. ఆత్మహత్య చేసుకోవాలని అనుకునే వారు ఈ క్యాప్సూల్‌లో కూర్చోగానే మెషీన్.. ఎవరు నువ్వు?, ఎక్కడ ఉన్నావు?, ఈ బటన్ నొక్కితే ఏమవుతుందో తెలుసా? అనే మూడు ప్రశ్నలు అడుగుతుందని డాక్టర్ ఫిలిప్ చెప్తున్నారు. ఈ ప్రశ్నలకు వారు సమాధానాలు చెబితే మెషీన్ ప్రారంభమవుతుందని, అప్పుడు బటన్ నొక్కవచ్చని తెలిపారు. బటన్ నొక్కిన 30 సెకన్లలో ఇందులో ఆక్సిజన్ శాతం 21 నుంచి 1 శాతానికి పడిపోయి క్షణాల్లో మనిషి మరణిస్తారని చెప్పారు. అయితే, ఈ క్యాప్సూల్‌పై తీవ్ర విమర్శలు వ్యక్తమవడంతో నిషేధిస్తూ స్విట్జర్లాండ్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.



చైనాలో కలుషిత వంట నూనెల కుంభకోణం

బీజింగ్, జూలై 11: చైనాలో కలుషిత వంట నూనెల కుంభకోణం..సంచలనం రేపుతున్నది. ఇంధనాన్ని (బొగ్గు ఆయిల్) స్టోరేజ్ చేసే ట్యాంకర్లలో వంట నూనెను నింపి..సరఫరా చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో దేశంలో ఆహార భద్రతపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతున్నది. దీంతో చైనా ప్రభుత్వ రంగ కంపెనీలు తయారుచేసిన వంట నూనెల అమ్మకాలను ఆన్‌లైన్ స్టోర్లు నిలిపివేస్తున్నాయి. ఆ కంపెనీల ఉత్పత్తులను తొలగిస్తున్నాయి. ట్యాంకర్లలో కోల్ ఆయిల్‌ను అన్‌లోడింగ్ చేసిన వెంటనే, స్టోరేజ్ ట్యాంకర్లను శుభ్రం చేయకుండా.. సోయాబీన్ ఆయిల్‌ను నింపారని 'బీజింగ్ న్యూస్' గతవారం వెలువరించిన వార్తా కథనం దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. దీంతో వంట నూనెల సరఫరాపై చైనా అత్యున్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించింది.



ఆడతోడు కోసం 1.3 కిలోమీటర్లు ఈదిన మగసింహాలు

న్యూఢిల్లీ: ఆడతోడు కోసం అలుపెరిగిపోయిన రెండు సోదర సింహాలు ఓ నదిని 1.3 కిలోమీటర్లు ఈది అవతలి ఒడ్డుకు చేరుకున్నాయి. ఉగాండాలోని క్వీన్ ఎలిజబెత్ నేషనల్ పార్క్‌లో జరిగింది ఘటన. ఆ నది మొత్తం మొసళ్లు, నీటి ఏనుగులతో నిండి ప్రమాదకరంగా ఉన్నప్పటికీ లెక్కచేయకుండా ఈదాయి. రెండు సింహాల్లో ఒకటైన జాకబ్ క్వీన్ ఎలిజబెత్ పార్కులో పదేండ్లుగా నివసిస్తున్నది. ఇది వేటగాళ్ల ఉచ్చులో చిక్కుకుని కాలు కోల్పోయింది. అయినప్పటికీ సోదర సింహంతో కలిసి రెండు సరస్సులను కలిపే జలమార్గాన్ని విజయవంతంగా దాటింది. పార్కులో ఆడసింహాల కోసం విపరీతమైన పోటీ ఉంది. ఈక్రమంలో ఓ ఆడతోడు కోసం మరో మగ సింహాల గుంపుతో పోరాడి ఓడిపోయాయి. ఆ తర్వాత ఇవి రెండూ నదికి అవలివైపున ఉన్న ఆడ సింహాల కోసం ప్రమాదకరమైన ప్రయాణం చేసి ఉండొచ్చని ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన అధ్యయనకర్త అలెక్స్ బ్రాకోవ్‌స్కీ తెలిపారు.

సౌదీ విమానం ల్యాండింగ్ గేర్‌లో మంటలు

విమానం దిగుతుండగా ఘటన • పాక్‌లో తప్పిన పెను ప్రమాదం

ఇస్లామాబాద్, జూలై 11: పాకిస్థాన్‌లోని పెషావర్ విమానాశ్రయంలో సౌదీ ఎయిర్‌లైన్స్ విమానానికి భారీ ప్రమాదం తప్పింది. 276 మంది ప్రయాణికులు, 21 మంది సిబ్బందితో రియాద్ నుంచి వస్తున్న ఈ విమానం దిగే సమయంలో ల్యాండింగ్ గేర్‌లో మంటలు చెలరేగాయి. విపత్తు నివారణ సిబ్బంది అప్రమత్తతతో ప్రయాణికులంతా సురక్షితంగా బయటపడ్డారు. గురువారం ఈ విమానం పెషావర్ బచ్చా ఖాన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో దిగే సమయంలో ఎడమ వైపు ల్యాండింగ్ గేర్ నుంచి పొగ, నిప్పురవ్వలు రావడాన్ని గమనించిన ట్రాఫిక్ కంట్రోలర్లు పైలట్‌ను హెచ్చరించారు. తర్వాత ఎయిర్‌పోర్టులోని అగ్నిమాపక, ఇతర విపత్తు నివారణ విభాగాలను కూడా అప్రమత్తం చేశారు. పౌర విమానయాన విభాగం (సీఏఏ) సిబ్బంది వెంటనే విమానం వద్దకు చేరుకుని మంటలు వ్యాపించకుండా అగ్నిమాపక నిరోధకాలను ప్రయోగించారు. దీంతో మంటలు ఆగిపోయి పెద్ద ప్రమాదం తప్పింది. తర్వాత ప్రయాణికులు, సిబ్బందిని జారుడు స్లైడ్ ద్వారా విమానంలోంచి దింపారు.



ఢీకొనబోయిన రెండు విమానాలు

న్యూయార్క్, జూలై 11: అమెరికాలోని న్యూయార్క్‌లో ఆకాశంలో రెండు విమానాలు ఢీకొనబోయాయి. న్యూయార్క్‌లోని సిరక్యూస్‌లో పోలీస్ శాఖకు చెందిన పెట్రోలింగ్ వాహనంలోని డాష్ కెమెరా ఈ దృశ్యాన్ని బంధించింది. ఈ నెల 8న ఈ రెండు ప్రయాణికుల విమానాలు ఇంచుమించు ఒకదానికొకటి ఢీకొనేంత దగ్గరగా వచ్చినా వెంట్రుకవాసిలో ప్రమాదం నుంచి బయటపడ్డాయి. సిరక్యూస్ హన్‌కాక్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టులో ఒకే రన్‌వేపైకి ఏకకాలంలో ల్యాండింగ్, టేకాఫ్‌కు అనుమతి ఇస్తూ ట్రాఫిక్ కంట్రోల్ సిబ్బంది చేసిన తప్పిదం కారణంగానే ఇది సంభవించి ఉంటుందని భావిస్తున్నారు.

బిడ్డను కంటే 92 వేలు

- రష్యాలోని కరేలియా అధికారుల ఆఫర్

మాస్కో, జూలై 11: తమ దేశంలో సంతానోత్పత్తిని పెంచడానికి రష్యా పలు చర్యలు చేపడుతున్నది. అందులో భాగంగా దేశ వాయువ్య ప్రాంతంలోని రిపబ్లిక్ ఆఫ్ కరేలియా అధికారులు ఒక వినూత్న ఆఫర్‌ను ప్రకటించారు. స్థానిక యూనివర్సిటీ, కాలేజీలలో చదివే 25 ఏండ్ల లోపు యువతులు ఆరోగ్యవంతమైన బిడ్డను కనుక ప్రసవిస్తే వారికి రూ.92 వేలు బహుమతిగా ఇస్తామని ప్రకటించారు. దేశంలో సంతానోత్పత్తి రేటును పెంచడానికి ప్రవేశపెట్టిన ఈ పథకం వచ్చే ఏడాది జనవరి 1 నుంచి అమలులోకి వస్తుందని తెలిపారు. ఇప్పటికే రష్యా, దాని రీజియన్ ప్రాంతాలు జననాల రేటును పెంచడానికి పలు చర్యలు చేపట్టాయి. ఇటీవల ఉక్రెయిన్‌తో యుద్ధంతో రష్యాలోని పలువురు యువకులు మరణించగా, ఐరోపా తరహా సైన్యంలోకి తీసుకుంటారన్న భయంతో చాలామంది దేశాన్ని వదిలి పారిపోయారు. మాస్కో టైమ్స్ కథనం ప్రకారం ఇప్పటికే దేశంలో గర్భనిరోధక సాధనాలైన కండోమ్‌లు, మాత్రలు తదితర వాటిపై ప్రభుత్వం నిషేధం విధించింది. కాగా, ప్రతి రష్యా మహిళ 8 మందికి జన్మనివ్వాలని గత ఏడాది డిసెంబర్‌లో పుతిన్ పిలుపు ఇచ్చారు.

నెల ముందే 'గుండెపోటు' సంకేతాలు



శరీరం 6 విధాలుగా హెచ్చరిస్తుంది
స్పందించి చికిత్స తీసుకొంటే మేలు
అమెరికన్ హార్ట్ అసోసియేషన్ వెల్లడి



ఆధునిక జీవనశైలితో ప్రస్తుతం గుండెజబ్బులు తీవ్రమయ్యాయి. యువకులు, చిన్నపిల్లలు కూడా గుండెపోటుతో కుప్పకూలుతున్న ఘటనలు నిత్యం చూస్తున్నాం. దేశంలో ఏటా 30 వేల మంది గుండెపోటుకు బలవుతున్నట్టు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. గుండెపోటును ముందస్తుగా గుర్తించకపోవడంతోనే మరణాలరేటు ఎక్కువవుతున్నట్టు నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో గుండెపోటు వచ్చే ప్రమాదాన్ని, శరీరంలో వచ్చే ఆరు మార్పులతో నెల ముందుగానే పసిగట్టవచ్చని 'అమెరికన్ హార్ట్ అసోసియేషన్' తాజాగా వెల్లడించింది. (స్పెషల్ టాస్క్ బ్యూరో)

భారత్‌లో ఏటా గుండెపోటుతో 30,000 మరణాలు

6 సూచికలు ఇవి..

ఛాతీ మధ్యలో ఒత్తిడి
ఉన్నట్టుండి ఛాతీ మధ్య భాగంపై ఒత్తిడి పెరుగుతుంది. అది క్రమంగా భరించలేని నొప్పిగా మారుతుంది. ఇది కొన్ని నిమిషాలపాటు కొనసాగుతుంది.

తల తిరగడం
శరీరానికి అవసరమైన నీరు, ఆహారం క్రమంగా తీసుకొన్నప్పటికీ తరుచూ తల గిర్రున తిరుగడం జరుగుతుంది. గుండెకు సరఫరా అయ్యే రక్తం మోతాదు తగ్గడంతోనే ఇది జరుగుతుంది.


ఊపిరి ఆడకపోవడం
ఉన్నట్టుండి ఊపిరి తీసుకోవడం కష్టమవుతుంది. అదే సమయంలో ఛాతీనొప్పి కూడా రావొచ్చు.

మిగతా శరీర భాగాల్లో నొప్పి
గుండెనొప్పి వచ్చే ప్రమాదమున్నప్పుడు ఛాతీతో పాటు నడుము, భుజాలు, చేతులు, మెడ, దవడల్లో కూడా నొప్పి కలుగుతుంది.

వికారం, అజీర్ణం
కడుపులో వికారం, తిన్న ఆహారం జీర్ణం కాకపోవడం, తరుచూ వాంతులు కావడం, పొట్ట ఉబ్బరంగా మారడం, గుండెలో మంట వంటివి కొనసాగుతాయి.

విపరీతంగా చెమటపోయడం
వ్యాయామం చేసిన తర్వాత చెమటపోయడం సహజం. అయితే, ఆమేమీ చేయనప్పటికీ విపరీతంగా చెమట పోయడం, శరీరం చల్లబడటం జరుగుతుంది. గుండెపోటు వచ్చే సూచన ఉన్నప్పుడు దాన్ని అడ్డుకోవడానికి నాడీవ్యవస్థ యాక్టీవ్‌గా పనిచేయడంతోనే విపరీతంగా చెమట వస్తుందని వైద్యులు చెప్తున్నారు.

హార్ట్‌ఎటాక్ టెస్టు ఇంట్లోనే..
గుండెపోటు వచ్చే ముప్పును ఇంట్లోనే ఉంటూ సులభంగా పసిగట్టే టెస్టును స్వీడిష్ పరిశోధకులు ఇటీవల అభివృద్ధి చేశారు. ప్రత్యేక అల్గారిథమ్‌తో పనిచేసే ఈ టెస్టులో భాగంగా పరిశోధకులు 14 సులభమైన ప్రశ్నలను సిద్ధం చేశారు. వ్యక్తి వయసు, లింగం, బరువు, నడుము చుట్టు కొలత, ధూమపానం అలవాటు, రక్తపోటు, రక్తంలో కొవ్వుల స్థాయి, మధుమేహం, గతంలో కుటుంబసభ్యులకు గుండెజబ్బులు ఉన్నాయా? లేదా? వంటి ప్రశ్నలతో ఈ టెస్ట్ ఉంటుంది. దీని ఫలితాలు 85 శాతం కచ్చితత్వమైనవని పరిశోధకులు పేర్కొన్నారు.



మాజీ అగ్నివీర్లకు 10% రిజర్వేషన్లు
సీఐఎస్ఎఫ్, బీఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్ చీఫ్‌ల ప్రకటన

న్యూఢిల్లీ, జూలై 11: అగ్నిపథ్ పథకంపై విమర్శలు వెల్లువెత్తుతున్న క్రమంలో సీఐఎస్ఎఫ్, బీఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్ అధిపతులు కీలక ప్రకటన చేశారు. కేంద్ర హోం శాఖ నిర్ణయాన్ని అనుసరించి, కానిస్టేబుల్ నియామకాల్లో మాజీ అగ్నివీర్లకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించనున్నట్టు వెల్లడించారు. భవిష్యత్తులో చేపట్టే రిక్రూట్‌మెంట్లలో ఈ రిజర్వేషన్ అమలు చేస్తామన్నారు. అలాగే వయస్సు, శరీర దారుఢ్య పరీక్షల్లో సైతం వారికి మినహాయింపు ఉంటుందని చెప్పారు. అయితే వారిని నియమించిన తర్వాత కన్వర్షన్ ట్రైనింగ్ ఉంటుందన్నారు. తొలి ఏడాది బ్యాచ్‌లకు వయసు మినహాయింపు ఐదేండ్లు, తర్వాతి ఏడాది బ్యాచ్‌లకు మూడేండ్లు ఉంటుందని చెప్పారు.

తల్లిదండ్రులతో గడిపేందుకు ప్రత్యేక సెలవులు
ప్రకటించిన అస్సాం ప్రభుత్వం

గువాహటి: తల్లిదండ్రులు, అత్తామామలతో గడిపేందుకు ప్రభుత్వ ఉద్యోగులకు అస్సాం ప్రభుత్వం రెండు రోజులు ప్రత్యేక సెలవులు ప్రకటించింది. నవంబర్ 6,8 తేదీల్లో రెండు ప్రత్యేక క్యాజువల్ లీవ్‌లు ఇస్తున్నట్టు తెలిపింది. ఈ సెలవులు కేవలం తల్లిదండ్రులు, అత్తమామలతో గడిపేందుకు మాత్రమేనని, ఇతర మార్గాల్లో ఎంజాయ్ చేసేందుకు కాదని స్పష్టం చేసింది. తల్లిదండ్రులు, అత్తమామలు ఉన్న ఉద్యోగులు మాత్రమే ఈ సెలవులు వినియోగానికి అర్హులని ఉత్తర్వుల్లో పేర్కొంది.

కర్ణాటక గ్రామంలో అంతుచిక్కని వ్యాధి

బెంగళూరు: కర్ణాటకలోని దేవగొండనహళ్లి గ్రామస్థులను ఓ అంతుబట్టని వ్యాధి దాదాపు 45 రోజుల నుంచి పీడిస్తున్నది. కాళ్లు వాచిపోవడం, విపరీతమైన ఒళ్లు నొప్పులతో అనేక మంది బాధపడుతున్నారు. ఈ వ్యాధి సోకినవారు తమ రోజువారీ పనులను చేసుకోలేకపోతున్నారు. కొందరైతే మంచానికి పరిమితమయ్యారు. ఈ గ్రామంలో జ్వరం, కీళ్ల నొప్పులు, డెంగ్యూ వ్యాధి కూడా ప్రబలింది. బాధితులు ప్రభుత్వ, ప్రైవేటు దవాఖానాల్లో చికిత్స చేయించుకున్నప్పటికీ ఉపశమనం దొరకడం లేదు. దీనిపై తాలూకా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సీమ మాట్లాడుతూ, గ్రామం తప్పకుండా లార్వా సర్వే చేస్తున్నామన్నారు.



ఐఏఎస్ పూజా ఖేద్కర్‌పై దర్యాప్తునకు ప్యానల్

న్యూఢిల్లీ: వివాదాస్పద చర్యలతో వార్తల్లో నిలిచిన ట్రైనీ ఐఏఎస్ అధికారి పూజా ఖేద్కర్‌పై విచారణకు కేంద్రం ఒక ప్యానల్‌ను ఏర్పాటు చేసింది. తన శారీరక అంగ వైకల్య క్యాటగిరీ, ఓబీసీ కోటాను దుర్వినియోగం చేసి ఐఏఎస్ సర్వీస్ సాధించినట్టు పూజాపై వచ్చిన ఆరోపణలపై కమిటీ విచారణ చేస్తుంది. వివాదాస్పద ప్రవర్తన కారణంగా బదిలీ అయిన ఖేద్కర్ గురువారం వాసిం జిల్లా కలెక్టరేట్‌లో అసిస్టెంట్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. కాగా, ట్రైనీ కలెక్టర్‌గా ఉండగానే తనకు ప్రత్యేక ఛాంబర్ కావాలనడం, తన ప్రైవేట్ ఆడీ కారుకు సైరన్, ప్రభుత్వ స్టిక్కర్, వీఐపీ నెంబర్ ప్లేట్లను అనుమతి లేకుండా వాడినట్టు ఆరోపణలు రావడంతో పుణె నుంచి ఆమెను బదిలీ చేశారు.

ఆత్మహత్యల భారతం

ప్రపంచంలో ఎక్కువ బలవన్మరణాలు మనదేశంలోనే

- 2022లో 1.71 లక్షల మంది ఆత్మహత్య
- ఒత్తిడి, నిరాశ నిస్పృహలతో కఠిన నిర్ణయం
- బలయ్యేది ఎక్కువగా పేదలు, రోజు కూలీలే
- ఆందోళన వ్యక్తం చేస్తున్న ఆరోగ్య నిపుణులు

న్యూఢిల్లీ, జూలై 11: దేశంలో ఆత్మహత్యలు చేసుకుంటున్న వారి సంఖ్య పెరిగిపోతున్నది. ప్రపంచంలో ఎక్కువ బలవన్మరణాలు నమోదవుతున్నది భారత్‌లోనే అని గణాంకాలు చెప్తున్నాయి. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో(ఎన్‌సీఆర్‌బీ) ఇటీవల విడుదల చేసిన నివేదిక ప్రకారం 2022 సంవత్సరంలో దేశంలో 1.71 లక్షల మంది ఆత్మహత్య చేసుకున్నారు. 2021 కంటే ఇది 4.2 శాతం, 2018 కంటే 27 శాతం ఎక్కువ. గతంలో ఎన్నడూ లేని విధంగా లక్ష జనాభాకు ఆత్మహత్యల రేటు 12.4గా నమోదయ్యింది. ఈ నేపథ్యంలో దేశంలో పెరుగుతున్న ఆత్మహత్యల పట్ల నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే ఇప్పుడు దేశం ఎదుర్కొంటున్న అతిపెద్ద ప్రజారోగ్య సంక్షోభంగా పేర్కొంటున్నారు. సుప్రీంకోర్టు సైతం ఈ విషయంపై ఆందోళన వ్యక్తం చేసింది. దేశంలో ఆత్మహత్యల నివారణకు తీసుకునే చర్యలపై 4 వారాల్లోగా నివేదిక ఇవ్వాలని కేంద్రాన్ని ఆదేశించింది.

బలవన్మరణాలకు పాల్పడ్డ వారు (2022లో)

రోజు కూలీలు	26.4 శాతం
గృహిణులు	14.8 శాతం
స్వయం ఉపాధి పొందుతున్న వారు	11.4 శాతం
ఉద్యోగులు	9.6 శాతం
నిరుద్యోగులు	9.2 శాతం
విద్యార్థులు	7.6 శాతం
రైతులు	6.6 శాతం
వృద్ధులు	0.8 శాతం
ఇతరులు	13.5 శాతం



ఆధారం: ఎన్‌సీఆర్‌బీ

మానసిక సమస్యలే ప్రధాన కారణం
దేశంలో పెరుగుతున్న ఆత్మహత్యలకు మానసిక సమస్యలే ప్రధాన కారణాలని వైద్య నిపుణులు చెప్తున్నారు. పని, ఆర్థిక అంశాలు, ఆరోగ్యం, కుటుంబ సంబంధాలు వంటి సమస్యల కారణంగా మొదలయ్యే ఒత్తిడి క్రమంగా మనిషిని బలహీనం చేస్తున్నదని అభిప్రాయపడుతున్నారు. ముందుగా ఒత్తిడి మొదలై ఆందోళన, నిరాశగా మారుతుందని, ఇవి ఆత్మహత్యలకు కారణమవుతాయని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైకియాట్రీ అండ్ బిహేవియరల్ సైన్సెస్ వైస్ చైర్‌పర్సన్ రాజీవ్ మెహతా తెలిపారు.

> ఇప్పుడు దేశ ప్రజారోగ్య వ్యవస్థ ఎదుర్కొంటున్న అతిపెద్ద సంక్షోభం ఆత్మహత్యలే. యువత మరణాలకు ప్రధాన కారణం ఇదే. తీవ్రమైన ఒత్తిడి కారణంగానే ఆత్మహత్య చేసుకుంటున్నారు. ఆర్థిక ఇబ్బందులు, ఆరోగ్య, వ్యక్తిగత సమస్యలు ఎదుర్కొనే పేదలే ఎక్కువగా బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ఒంటరితనం కూడా ప్రధాన కారణమే.
>
> – శ్యామ్ భట్, చైర్‌పర్సన్, టీఎంహెచ్‌

దేశంలో ఆత్మహత్యలు (ఎన్‌సీఆర్‌బీ గణాంకాలు)

2018	1,34,516
2019	1,39,123
2020	1,53,052
2021	1,64,033
2022	1,70,921

బిగ్గరగా నవ్వాల్సిందే!

- రోజులో ఒక్కసారైనా ఇలా చేయాలి
- జపాన్‌లో కొత్త నిబంధన
- గట్టిగా నవ్వితే గుండె సమస్యలు దూరం అవుతాయన్న 'లాఫర్ స్టడీ'



(స్పెషల్ టాస్క్ బ్యూరో)
హైదరాబాద్, జూలై 11 (నమస్తే తెలంగాణ): 'నవ్వు నాలుగు విధాల చేటు' అని మన పెద్దవాళ్లు అంటే, నవ్వడం నలభై విధాల మేలు అని జపాన్ ప్రభుత్వం అంటున్నది. అనడమే కాదు.. ప్రతీ పౌరుడు రోజులో కనీసం ఒక్కసారైనా బిగ్గరగా నవ్వడం తప్పనిసరని చేస్తూ ఉత్తర జపాన్‌లోని యమగటా స్థానిక యంత్రాంగం కొత్త నిబంధనను కూడా తీసుకొచ్చింది. బిగ్గరగా నవ్వితే, గుండె సమస్యలు తగ్గుముఖం పడుతాయని వారు చెప్తున్నారు. ఈ మేరకు యమగటా యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసిన్ పరిశోధకుల 'లాఫర్ స్టడీ'ని ఉదహరిస్తున్నారు.

మానసిక-శారీరక ప్రశాంతత
40 ఏండ్ల కంటే ఎక్కువ వయసున్న 17,152 మందిపై యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసిన్ శాస్త్రవేత్తలు విస్తృతస్థాయి పరిశోధనలు చేశారు. వారంలో ఎన్నిసార్లు బిగ్గరగా నవ్వుతారంటూ? ఓ ప్రశ్నావళిని సిద్ధం చేశారు. సమాధానాలను రాబట్టిన తర్వాత కొన్నేండ్లు వారి ఆరోగ్యాన్ని పర్యవేక్షించారు. వారంలో ఒక్కసారి కూడా బిగ్గరగా నవ్వని వారికి గుండె సమస్యలు ఎక్కువగా వచ్చినట్టు గుర్తించారు. ఒకటి కంటే ఎక్కువసార్లు బిగ్గరగా నవ్వినవారికి గుండె సమస్యలు తక్కువగా వచ్చినట్టు, రోజూ బిగ్గరగా నవ్వేవారికి గుండె సమస్యలు పెద్దగా ఎదురుకాలేదని తెలిపారు. బిగ్గరగా నవ్వితే, శరీరంలోని నాడీలు, కండరాలు ఉత్తేజితమవుతాయని, రక్త ప్రసరణ సుదుగ్గా సాగుతుందని, మానసిక-శారీరక ప్రశాంతత కలుగుతుందని నిపుణులు చెబుతున్నారు. గుండె సమస్యలు ఉన్నవారికి 'లాఫింగ్ థెరపీ' ఇస్తున్న విషయాన్ని గుర్తు చేస్తున్నారు.

గుజరాత్‌లో నకిలీ దవాఖాన!
బీజేపీ పాలిత రాష్ట్రంలో బయటపడ్డ మరో బాగోతం

అహ్మదాబాద్, జూలై 11: గుజరాత్‌లో నకిలీలు బయటపడుతూనే ఉన్నాయి. ఇప్పటికే రాష్ట్రంలో నకిలీ ప్రభుత్వ కార్యాలయం, నకిలీ టోల్‌ప్లాజాను గుర్తించగా తాజాగా నకిలీ దవాఖాన గుట్టు రట్టయ్యింది. అహ్మదాబాద్ జిల్లాలోని బవ్లా తాలుకాలో ఉన్న కేరళ గ్రామంలో అనన్య మల్టీ స్పెషాలిటీ పేరుతో ఒక దవాఖాన కొన్నాళ్లుగా నడుస్తున్నది. ఇటీవల ఓ బాలిక ఇక్కడ చికిత్స పొందుతూ మరణించింది. అయితే, దవాఖానకు తెచ్చే వరకు బాలిక ఆరోగ్యం కాస్త స్థిమితంగానే ఉందని, దవాఖానకు వచ్చిన తర్వాతనే సరైన వైద్యం చేయనందుకు మరణించిందని ఆమె తల్లిదండ్రులు ఆరోపించారు. దీంతో వైద్య శాఖ అధికారులు దవాఖానను తనిఖీ చేయగా నకిలీ బాగోతం బయటపడింది. దవాఖాన వేరే వైద్యుడి పేరు మీద రిజిస్టర్ కాగా మెహుల్ చావ్‌డా అనే వైద్యరంగానికి సంబంధం లేని వ్యక్తి దవాఖానను నడిపిస్తున్నట్టు బయటపడింది. దీంతో దవాఖానను సీజ్ చేశారు.

మణిపూర్ నుంచి తొలిసారి సుప్రీం జడ్జి



జస్టిస్ కోటీశ్వర్ సింగ్ జస్టిస్ మహదేవన్

న్యూఢిల్లీ: మణిపూర్ నుంచి తొలిసారిగా ఒకరు సుప్రీంకోర్టు న్యాయమూర్తి కాబోతున్నారు. సర్వోన్నత న్యాయస్థానంలో జడ్జీలుగా నియమించేందుకు చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని కొలీజియం గురువారం కేంద్రానికి ఇద్దరి పేర్లను సిఫారసు చేసింది. అందులో మణిపూర్‌కు చెందిన, ప్రస్తుతం జమ్ము కశ్మీర్, లడఖ్ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా ఉన్న ఎన్ కోటీశ్వర్ సింగ్, మద్రాస్ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మహదేవన్ ఉన్నారు. సింగ్‌ను సుప్రీంకోర్టు జడ్జీగా నియమిస్తే ఈశాన్య రాష్ట్రానికి చెందిన వ్యక్తికి తొలిసారిగా ప్రాతినిధ్యం కల్పించినట్టు అవుతుందని కొలీజియం ఒక ప్రకటనలో పేర్కొంది. తమిళనాడుకు చెందిన మహదేవన్ వెనుకబడిన వర్గాలకు చెందిన వారు. సుప్రీంకోర్టులో మొత్తం 34 మంది న్యాయమూర్తులకు ఇటీవల ఇద్దరు పదవీ విరమణ చేయడంతో ఆ స్థానాల భర్తీ కోసం కొలీజియం తాజా సిఫారసులు చేసింది.



థెర్మాక్స్ గ్లోబల్ అనే ప్రైవేట్ కంపెనీ నిర్వహించిన వాకిన్ ఇంటర్వ్యూకు పోటెత్తిన నిరుద్యోగులు

గుజరాత్ మాడల్ అంటే గిదేనా?

ఇంటర్వ్యూలకు పిలిచిన ప్రైవేటు కంపెనీ
పోటెత్తిన అభ్యర్థులు.. కూలిన రెయిలింగ్

అహ్మదాబాద్, జూలై 11: బీజేపీ పాలిత గుజరాత్‌లో ఓ ప్రైవేటు కంపెనీ నిర్వహించిన వాకిన్ ఇంటర్వ్యూకు నిరుద్యోగులు పోటెత్తారు. 10 పోస్టులను భర్తీ చేయడానికి ఇంటర్వ్యూలు నిర్వహించగా దాదాపు 1,800 మంది వరకు తరలివచ్చారు. అభ్యర్థులు బారులు తీరిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇంతకాలంగా బీజేపీ చెప్తున్న గుజరాత్ మాడల్ ఇదేనా అంటూ నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. థెర్మాక్స్ గ్లోబల్ అనే సంస్థ మంగళవారం అంకలేశ్వర్‌లోని ఓ హోటల్‌లో హాల్‌ను అద్దెకు తీసుకొని ఇంటర్వ్యూలు నిర్వహించింది. దీని గురించి ముందుగానే పేపర్లలో ప్రకటన ఇచ్చింది. దీంతో వందల మంది అభ్యర్థులు హోటల్ ముందు బారులు తీరారు. అభ్యర్థుల మధ్య తోపులాటతో హోటల్ రెయిలింగ్ ఊడిపోయి పలువురు కింద పడిపోయారు.

నరేంద్ర మోదీ నిరుద్యోగ నమూనా
గుజరాత్ మాడల్ బట్టబయలైందని కాంగ్రెస్ విమర్శించింది. నరేంద్ర మోదీ ఈ నిరుద్యోగ నమూనానే దేశమంతా రుద్దుతున్నారని పేర్కొన్నది. దీనికి బీజేపీ గుజరాత్ శాఖ కౌంటర్ ఇచ్చింది. ఈ కంపెనీ ఇంటర్వ్యూలకు పిలిచిన ప్రకటనలోనే అనుభవం కలిగిన వారికి మాత్రమే అని స్పష్టంగా పేర్కొన్నదని, కాబట్టి వచ్చిన అభ్యర్థులంతా నిరుద్యోగులు కాదని 'ఎక్స్‌'లో చెప్పుకొచ్చింది.

డబుల్ ట్రబుల్ ఇంజిన్

సర్టిఫికెట్ కన్నా సంప్రదాయాలే ముఖ్యం
హిందూ వివాహంపై అలహాబాద్ హైకోర్టు తీర్పు

లక్నో: హిందువుల మధ్య జరిగే పెండ్లికి చట్టబద్ధత రావాలంటే, ఆ వివాహం హిందూ సంప్రదాయాల ప్రకారం జరిగి ఉండాలని అలహాబాద్ హైకోర్టు లక్నో ధర్మాసనం తీర్పు చెప్పింది. సంప్రదాయబద్ధంగా పెండ్లి జరగకుండా, కేవలం వివాహ ధ్రువపత్రం మాత్రమే ఉంటే, ఆ వివాహం చెల్లదని స్పష్టం చేసింది. పిటిషనర్ వాదన ప్రకారం, ఆమె, ఆమె తల్లి ఓ మత గురువును అనుసరిస్తున్నారు. ఆ గురువు ఈ మహిళతో దగ్గర తెల్ల కాగితాలపై సంతకాలు చేయించారు. తన సంస్థలో రెగ్యులర్ మెంబర్‌గా చేర్చుకోవడానికి ఈ సంతకాలు తీసుకుంటున్నట్టు మాయ మాటలు చెప్పారు. కానీ కొంత కాలం తర్వాత తన తండ్రి వద్దకు ఆ గురువు వెళ్లి, 'మీ కుమార్తెను నేను ఆర్య సమాజ్‌లో పెండ్లి చేసుకున్నాను. వివాహం రిజిస్ట్రేషన్ అయింది' అని చెప్పారు. దీంతో ఈ వివాహాన్ని రద్దు చేయాలని బాధిత యువతి న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. విచారించిన కోర్టు పై విధంగా తీర్పు చెప్పింది.


పాల కల్తీని ఆవిరితో గుర్తించొచ్చు!

ఇంట్లోనే సులభంగా చేసుకొనే వినూత్న పద్ధతి.. అభివృద్ధి చేసిన జపాన్‌యూ పరిశోధకులు

న్యూఢిల్లీ, జూలై 11: ప్రస్తుతం సర్వం కల్తీమయంగా మారింది. పాలను కూడా కొందరు కేటుగాళ్లు కల్తీ చేస్తున్నారు. డిటర్జెంట్ పౌడర్, యూరియా, వెజిటబుల్ ఆయిల్, నల్లా నీళ్లకు కొన్ని కెమికల్స్ కలిపి సింథటిక్ పాలను తయారుచేస్తున్నారు. ఇలాంటి సింథటిక్ పాలు ఆరోగ్యానికి హాని కలిగిస్తాయి. దీంతో కల్తీ పాల పట్ల ప్రజల్లో ఆందోళన నెలకొన్నది. ఈ నేపథ్యంలో ఇంట్లోనే సులువుగా కల్తీ పాలను గుర్తించే సరికొత్త పరీక్షను బనారస్ హిందూ విశ్వవిద్యాలయం, సిక్కిం విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధక బృందం కనిపెట్టింది.

ఎలా కనిపెట్టవచ్చంటే?
మెడికల్ సిరంజిలో పాలు తీసుకోవాలి. సిరంజి సాయంతో ఓ పాల చుక్కను చిన్న గాజు పలకపై వేయాలి. కాసేపు వేచిచూడాలి. పాలు ఆవిరవుతున్న క్రమంలో పాలలోని కొన్ని కణాలు ఒకదానికి ఒకటి దగ్గరగా చేరి చివరకు పాల చుక్క అంచున ఒక రింగ్‌లాగా ఏర్పడతాయి. అలా జరిగితే ఆ పాలు సింథటిక్ పాలని భావించవచ్చు. సాంకేతికంగా దీన్ని విశ్లేషించాలనుకొంటే.. స్మార్ట్‌ఫోన్‌లో ఆ ఫొటో తీసి తాము అభివృద్ధి చేసిన మెషీన్ లెర్నింగ్ విధానంతో పాల కల్తీని గుర్తించవచ్చని పరిశోధకులు చెప్తున్నారు.

ఆ పరీక్షకు.. దీనికి తేడా ఏంటంటే?
పాలు స్వచ్ఛమైనవా? కావా? అని తెలుసుకోవడానికి అయోడిన్ పరీక్ష వంటివి చేస్తుంటారు.



సింథటిక్ పాల చుక్క అంచుల్లో రైస్ మాదిరిగా ఏర్పడిన కణాలు



పాలలో నీటి శాతం, స్టార్చ్ మోతాదు ఎంత ఉన్నది అనేది దీంతో తెలుస్తుంది. అయితే సింథటిక్ పాలను ఈ పద్ధతుల్లో కచ్చితత్వంతో గుర్తించలేము. అయితే, తమ మెషీన్ లెర్నింగ్ విధానంతో సింథటిక్ పాలను 96.7% కచ్చితత్వంతో గుర్తించవచ్చని పరిశోధకులు చెబుతున్నారు. ఈ విధానాన్ని త్వరలోనే అందరికీ అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు.

ఇది మన దేశీ స్పేస్‌స్టేషన్

- ఐఎస్ఎస్‌కు దీటుగా అన్నిరకాల ఏర్పాట్లు
- ఏకకాలంలో 16 మంది కూడా ఉండొచ్చు
- 2027 నాటికి సిద్ధం: బెంగళూరు స్టార్టప్



(స్పెషల్ టాస్క్ బ్యూరో)
హైదరాబాద్, జూలై 11 (నమస్తే తెలంగాణ): అంతరిక్ష వ్యోమగాములు నివసించడానికి, పరిశోధనలు నిర్వహించడానికి అంతర్జాతీయ అంతరిక్ష పరిశోధన కేంద్రం (ఐఎస్ఎస్) సేవలు అందిస్తున్నది. అమెరికా, రష్యా, జపాన్, యూరోప్, కెనడా సంయుక్తంగా దీన్ని నిర్వహిస్తున్నాయి. అయితే, వినువీధుల్లో అద్భుత విజయాలు సాధిస్తున్న భారత్‌కు ఇప్పటికీ సొంతంగా స్పేస్‌స్టేషన్ లేదు. భారతీయ అంతరిక్ష స్టేషన్ (బీఏఎస్) పేరిట ఇస్రో ఓ స్పేస్‌స్టేషన్‌ను నిర్మించాలనుకొన్నప్పటికీ అది అందుబాటులోకి రావడానికి 2035 వరకూ వేచిచూడాలని కేంద్రప్రభుత్వమే చెప్తుండటం గమనార్హం. ఇలాంటి సమయంలో బెంగళూరుకు చెందిన ఆకాశల్యి అనే స్టార్టప్ కంపెనీ స్పేస్‌స్టేషన్ నిర్మాణానికి సిద్ధమైంది.

ఎప్పుడు అందుబాటులోకి?
2027నాటికి ఈ స్పేస్‌స్టేషన్‌ను అందుబాటులోకి తీసుకురావడానికి ప్రణాళికలు సిద్ధంచేసినట్టు కంపెనీ సీఈవో సిద్ధార్థ్ జేనా తెలిపారు. ఈ మేరకు ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్టు తెలిపారు. తమ స్పేస్‌స్టేషన్‌లో ఏకకాలంలో 6-16 మంది ఉండొచ్చని, అంతరిక్షంలోని గ్రహ శకలాలు, రేడియేషన్ నుంచి రక్షించే అన్నిరకాల ఏర్పాట్లు ఐఎస్ఎస్‌కు దీటుగా తమ స్పేస్‌స్టేషన్‌లో ఉంటాయని పేర్కొన్నారు. ఐఎస్ఎస్‌తో పోలిస్తే తమ స్టేషన్ ఎంతో దృఢమైనదని వెల్లడించారు. 2030లో ఐఎస్ఎస్ జీవితకాలం ముగియనున్నది. దీన్ని కూల్చేసే కాంట్రాక్టును కూడా నాసా.. స్పేస్‌ఎక్స్‌కు ఇవ్వడం గమనార్హం.

ఏమిటీ స్పేస్‌స్టేషన్?
రోదసి ప్రయోగాలు ఊపందుకొన్న నేపథ్యంలో వ్యోమగాములు పరిశోధనలు చేసుకోవడానికి, రోదసి యాత్రికులు నివసించడానికి ఆకాశల్యి సంస్థ 'ఎక్స్‌పాండబుల్ స్పేస్ హ్యాబిటేట్' (ఎక్స్‌ఎస్‌హెచ్) పేరిట ఓ స్పేస్‌స్టేషన్‌ను నిర్మించనున్నది. 2023 నవంబర్‌లోనే దీనికి సంబంధించిన ప్రొటోటైప్ 'అంతరిక్ష హబ్' డిజైన్‌ను ఐఐటీ-రూర్కీ, ఐఐఎస్-బెంగళూరులో సిద్ధంచేసింది.



మంత్రి శ్రీధర్ బాబుతో సమావేశమైన పీఎస్ఆర్, మైక్రోలింక్ సంస్థల ప్రతినిధులు

పీఎస్ఆర్ ఇండస్ట్రీస్ 500 కోట్ల పెట్టుబడి

రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి

హైదరాబాద్, జూలై 11 (నమస్తే తెలంగాణ): రాష్ట్రానికి చెందిన పీఎస్ఆర్ ఇండస్ట్రీస్ భారీ పెట్టుబడులు పెట్టబోతున్నది. ఎలక్ట్రానిక్, ఐటీతోపాటు ఇతర ఉత్పత్తుల పరిశ్రమలను ఏర్పాటు చేయడానికి రూ.500 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టబోతున్నట్టు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. అమెరికా టెలికం దిగ్గజం మైక్రోలింక్ నెట్‌వర్క్స్ నుంచి సాంకేతిక పరిజ్ఞానం అందుకోవడానికి ఇరు సంస్థలు ఒప్పందం చేసుకున్నాయని మంత్రి చెప్పారు. గురువారం సచివాలయంలో మైక్రోలింక్ గ్లోబల్ ప్రతినిధులతో పాటు పీఎస్ఆర్ ఇండస్ట్రీస్ వైస్ చైర్మన్ శ్రీరంగారావుతో మంత్రి సమావేశమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పీఎస్ఆర్ సంస్థ ఏర్పాటు చేయనున్న పరిశ్రమలతో వచ్చే మూడేండ్లకాలంలో 700 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయని పేర్కొన్నారు. ఇటీవల అమెరికా పర్యటనలో భాగంగా మైక్రోలింక్ నెట్‌వర్క్స్ యాజమాన్యం, పీఎస్ఆర్ ఇండస్ట్రీస్ జరిపిన చర్చలు ఫలవంతమయ్యాయని, ఇరు సంస్థల సాంకేతిక బదిలీకి అంగీకరించాయని పేర్కొన్నారు.

'బ్యాంక్ గ్యారెంటీని మినహాయించండి'

టెలికం శాఖకు వొడాఫోన్ ఐడియా మొర

న్యూఢిల్లీ, జూలై 11: వచ్చే ఏడాది సెప్టెంబర్‌లో చెల్లించాల్సిన స్పెక్ట్రమ్ బకాయి కోసం పెట్టిన రూ.24,747 కోట్ల బ్యాంక్ గ్యారెంటీని రద్దు చేయాలని టెలికం శాఖను వొడాఫోన్ ఐడియా కోరినట్టు సమాచారం. ఇప్పటికే భారీ లోటు అప్పుల్లో ఈ ప్రైవేట్ రంగ టెలికం సంస్థ కూరుకుపోయిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఇంత భారం తమపై మోపవద్దని టెలికం శాఖ వద్ద వొడాఫోన్ ఐడియా మొర పెట్టుకున్నట్టు పీటీఐకి సంబంధిత అధికారి ఒకరు తెలిపారు. కాగా, స్పెక్ట్రమ్ వేలం నిబంధనల ప్రకారం గడువు తేదీకి ఏడాది ముందే చెల్లించాల్సిన మొత్తాన్ని బ్యాంక్ గ్యారెంటీగా డిపాజిట్ చేయాల్సి ఉన్నది. ఇటీవలి వేలంలో వొడాఫోన్ ఐడియా స్పెక్ట్రమ్ కొన్న విషయం తెలిసిందే.

విశాఖ ప్రైవేటీకరణ ఆలోచన లేదు

- కార్మికులు ఆందోళన చెందొద్దు
- కేంద్రమంత్రి కుమారస్వామి

హైదరాబాద్,జూలై 11 (నమస్తే తెలంగాణ): విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించే ఆలోచన కేంద్రానికి లేదని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామి స్పష్టం చేశారు. ఈ ప్లాంట్‌పై అనేక మంది ఆధారపడి ఉన్నారని చెప్పారు. విశాఖ ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజులతో కలిసి గురువారం వైజాగ్‌లోని స్టీల్‌ప్లాంట్‌ను కేంద్రమంత్రి పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ తమ బాధ్యతని, ప్లాంట్‌లోని అన్ని విభాగాలను పరిశీలించామని, ప్రధాని ఆశీస్సులతో ప్లాంట్ వందశాతం సామర్థ్యంతో ఉత్పత్తి చేస్తుందని ధీమా వ్యక్తంచేశారు. తనకు 2 నెలలు సమయమివ్వాలని, ప్రధాన మంత్రికి పూర్తిస్థాయి నివేదిక ఇచ్చిన తర్వాత ఆయన నిర్ణయాన్ని అధికారికంగా ప్రకటిస్తామని తెలిపారు. కార్మికులు ఆందోళన అవసరం లేదని భరోసా ఇచ్చారు. అంతకుముందు ప్లాంట్‌లో కార్మిక సంఘాలు, ఉద్యోగ సంఘాలు, స్థానిక ప్రజాప్రతినిధులతో సమావేశమై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఇండ్లకు తగ్గిన గిరాకీ

ప్రాప్‌టైగర్ తాజా నివేదికలో వెల్లడి

ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో హైదరాబాద్‌లో 14 శాతం క్షీణత



న్యూఢిల్లీ, జూలై 11: హైదరాబాద్‌లో ఇండ్ల అమ్మకాలు పడిపోయాయి. ప్రముఖ ప్రాపర్టీ బ్రోకరేజీ వేదిక ప్రాప్‌టైగర్ తాజా నివేదికలో హౌజింగ్ సేల్స్ క్షీణించినట్టు తేలింది. దేశవ్యాప్తంగా హైదరాబాద్‌సహా 8 ప్రధాన నగరాల్లో ఉన్న హౌజింగ్ డిమాండ్, సప్లైపై ప్రాప్‌టైగర్.. తమ త్రైమాసిక గణాంకాలను విడుదల చేసింది. ఇందులో ఈ ఏడాది జనవరి-మార్చితో పోల్చితే ఏప్రిల్-జూన్‌లో ఓవరాల్‌గా గృహ విక్రయాలు 6 శాతం పతనమైనట్టు చెప్పింది. అయితే అహ్మదాబాద్ తర్వాత హైదరాబాద్‌లోనే గిరాకీ ఎక్కువగా పడిపోయినట్టు స్పష్టం చేయడం గమనార్హం.

ఇదీ సంగతి..

ఈ జనవరి-మార్చిలో హైదరాబాద్ గృహ విక్రయాలు 14,298 యూనిట్లుగా ఉన్నాయి. అయితే ఏప్రిల్-జూన్‌లో 12,296 యూనిట్లకే పరిమితమయ్యాయి. 2 వేలకుపైగా హౌజ్ సేల్స్ తగ్గాయి. దీంతో 14 శాతం క్షీణత నమోదైంది. గతంతో పోస్తే మార్కెట్‌లోకి అందుబాటులోకి వచ్చిన కొత్త ఇండ్ల సంఖ్య కూడా పడిపోయినట్టు తేటతెల్లమైంది. కాగా, లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బిల్డర్లు, ఇన్వెస్టర్లు వేచిచూసే ధోరణిని అవలంభించడం వల్లే ఇదంతా అని ప్రాప్‌టైగర్ చెప్తున్నది. కానీ రాష్ట్రంలో నెలకొన్న ప్రతికూల పరిస్థితులే వ్యాపారాన్ని దెబ్బతీస్తున్నాయని లోకల్ టాక్. పాలనాపరమైన అంశాల్లో ప్రభుత్వం నత్త నడకన సాగుతున్న దన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మిగతా నగరాల్లో..

బెంగళూరులో అత్యధికంగా ఇండ్ల అమ్మకాలు 30 శాతం పెరిగాయి. జనవరి-మార్చిలో 10,381 యూనిట్లు అమ్ముడైతే.. ఏప్రిల్-జూన్‌లో 13,495 యూనిట్లు సేల్స్ నమోదయ్యాయి. ఢిల్లీ-ఎన్‌సీఆర్ (గురుగ్రామ్, నోయిడా, గ్రేటర్ నోయిడా, ఘజియాబాద్, ఫరీదాబాద్)లోనూ 10 శాతం పుంజుకొని 11,065 యూనిట్లకు చేరాయి. అంతకుముందు 10,058 యూనిట్లే. ఇక అహ్మదాబాద్‌లో 26 శాతం తక్కి 9,500 యూనిట్ల అమ్మకాలే జరిగాయి. మునుపు 12,915 యూనిట్ల సేల్స్ ఉన్నాయి. చెన్నైలో 10 శాతం, ముంబై ఎంఎంఆర్ (ముంబై, నవీ ముంబై, థానె)లో 8 శాతం, పుణెలో 5 శాతం చొప్పున హౌజింగ్ సేల్స్ తగ్గాయి. కోల్‌కతాలోనూ 16 శాతం ఇండ్ల అమ్మకాలు దిగజారాయి. మొత్తంగా ఈ 8 నగరాల్లో ఏప్రిల్-జూన్ ఇండ్ల అమ్మకాలు 1,13,768 యూనిట్లుగా ఉన్నాయి. జనవరి-మార్చిలో 1,20,642 యూనిట్లుగా ఉన్నాయని ప్రాప్‌టైగర్ తెలియజేసింది.



బీవైడీ నుంచి నయా ఈవీలు

సింగిల్ చార్జింగ్‌తో 521 కి.మీ.

న్యూఢిల్లీ, జూలై 11: చైనాకు చెందిన ఈవీల తయారీ సంస్థ బీవైడీ.. దేశీయ మార్కెట్‌లోకి ఒకేసారి మూడు ఎలక్ట్రిక్ వాహనాలను విడుదల చేసింది. అట్టో 3 ఈవీల్లో భాగంగా డైనమిక్, ప్రీమియం, సుపీరియర్ వెర్షన్లలో ఈ మాడళ్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. వీటిలో డైనమిక్ ధరం రూ.24.99 లక్షలు కాగా, సుపీరియర్ రూ.33.99 లక్షలుగా నిర్ణయించింది. ఈ కార్ల కోసం ముందస్తుగా రూ.50 వేలు చెల్లించి బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుంది. వీటిలో 49.92 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన డైనమిక్ మాడల్ సింగిల్ చార్జింగ్‌తో 468 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. అలాగే 60.48 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన ప్రీమియం, సుపీరియర్ మాడళ్లు సింగిల్ చార్జింగ్‌తో 521 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనున్నది.

హైబ్రిడ్‌పై పన్ను సంగతేంటి?

కార్లపై యూపీలో రోడ్ ట్యాక్స్ రద్దు

లక్షల్లో తగ్గుతుండటంతో తెలంగాణ వాహనదారుల్లో ఆసక్తి

హైదరాబాద్, జూలై 11 (నమస్తే తెలంగాణ): ఉత్తరప్రదేశ్ (యూపీ) తరహాలో తెలంగాణలోనూ హైబ్రిడ్ కార్లపై రోడ్ ట్యాక్స్‌ను మినహాయించాలనే డిమాండ్ రోజురోజుకూ పెరుగుతున్నది. దీనివల్ల ఒక్కో కారు ఆన్‌రోడ్ ధర సుమారు రూ.2 నుంచి 3 లక్షలదాకా తగ్గే అవకాశం ఉండటంతో కొనుగోలుదారులు వేచిచూసే ధోరణిని అవలంభిస్తున్నారు. ఇక కొందరైతే యూపీ వెళ్లి కారు కొనేందుకూ ఆసక్తి చూపుతున్నారంటే అతిశయోక్తి కాదు. ప్రస్తుతం రాష్ట్రంలో రూ.10 లక్షలు ఖరీదయ్యే వాహనాలకు రోడ్ ట్యాక్స్ 12 శాతంగా ఉన్నది. ఆపై ధర పలికితే 14 శాతం వసూలు చేస్తున్నారు. మారుతి సుజుకీ, టయోటా వంటి కంపెనీలు కొన్ని హైబ్రిడ్ మాడల్ కార్లను విక్రయిస్తున్నాయి. వీటి ధరలు రూ.10 లక్షలపైనే ఉండటంతో రోడ్ ట్యాక్స్ రూ.2-3 లక్షల వరకు ఉంటున్నది. కాగా, బ్యాటరీ ఆధారిత ఎలక్ట్రిక్ మోటార్‌తో పాటు పెట్రోల్ లేదా డీజిల్ ఇంజిన్‌ల ద్వారా నడిచే అవకాశం ఉండటం ఈ హైబ్రిడ్ కార్ల ప్రత్యేకత. దీనివల్ల మైలేజీ ఎక్కువగా ఉండటమేగాక, కాలుష్యం కూడా తక్కువగా ఉంటున్నది. అందుకే యూపీ సర్కారు ఈ నెల 1 నుంచి హైబ్రిడ్ కార్లపై రోడ్ ట్యాక్స్‌ను తొలగించింది. దీంతో అక్కడ హైబ్రిడ్ కార్ల విక్రయాలు ఒక్కసారిగా ఊపందుకున్నాయి. దేశ రాజధాని నగరం ఢిల్లీకి దగ్గరగా ఉన్న గ్రేటర్ నోయిడాలోనైతే నెలనెలా పెద్ద ఎత్తున అమ్మకాలు నమోదవుతున్నాయి. గతంతో పోల్చితే ఇప్పుడు హైబ్రిడ్ కార్ల రిజిస్ట్రేషన్లు 50 శాతానికి పెరిగినట్టు వాహన పరిశ్రమ ప్రతినిధులూ చెప్తున్నారు.



ఈవీ విక్రయాల్లో..

రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ అయ్యే తొలి 5,000 విద్యుత్తు ఆధారిత (ఈవీ) కార్లకు రిజిస్ట్రేషన్ చార్జీల నుంచి మినహాయింపునిచ్చారు. కానీ ఈ సంఖ్య ఎప్పుడో దాటిపోయింది. దీంతో ఇప్పుడు ఎలక్ట్రిక్ కార్లకూ మామూలుగానే రిజిస్ట్రేషన్ చార్జీలను వసూలు చేస్తున్నారు. అయితే మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌లో ఈవీల రిజిస్ట్రేషన్‌పై పన్ను మినహాయింపు ఉండటంతో చాలామంది అక్కడ కార్లను కొనుగోలు చేస్తున్నట్టు ఆటో ఇండస్ట్రీ వర్గాలు పేర్కొంటున్నాయి. తెలంగాణలోనూ ఎలక్ట్రిక్, హైబ్రిడ్ కార్లపై రిజిస్ట్రేషన్ చార్జీలను పూర్తిగా మినహాయించాలని కోరుతున్నారు. దీనివల్ల కాలుష్యం గణనీయంగా తగ్గడమేగాక, వాహన విక్రయాలూ పెరుగుతాయంటున్నారు. మరి దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందో వేచిచూడాల్సిందే.

టీసీఎస్ లాభం 12,040 కోట్లు

తొలి త్రైమాసికంలో 9 శాతం వృద్ధి • రూ.10 మధ్యంతర డివిడెండ్ ప్రకటన

ముంబై, జూలై 11: దేశీయ ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) అంచనాలకుమించి రాణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికిగాను రూ.12,040 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.11,074 కోట్లకంటే ఇది 8.7 శాతం అధికం. అలాగే మార్చి త్రైమాసికంలో నమోదైన లాభంతో పోలిస్తే 3.1 శాతం తగ్గింది. ఆదాయం మాత్రం ఏడాది ప్రాతిపదికన 5.4 శాతం ఎగబాకి రూ.62,613 కోట్లకు చేరుకున్నది. గడిచిన త్రైమాసికంలో ఉద్యోగుల వేతనాలు పెంచడంతో కంపెనీ ఆర్థిక వనరులపై ప్రభావం చూపిందని సీఎఫ్‌వో సమీర్ తెలిపారు.

- భారత్‌తోపాటు అభివృద్ధి చెందుతున్న మార్కెట్లు రెండంకెల వృద్ధి నమోదైంది.
- సంస్థకు వచ్చిన ఆదాయంలో తయారీ రంగం 9.4 శాతం వృద్ధిని కనబరచగా, ఎనర్జీ-యుటిలిటీ 5.7 శాతం, లైఫ్ సైన్స్, హెల్త్‌కేర్ 4 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నాయి.
- గత త్రైమాసికంలో కొత్తగా 5,452 మంది ఉద్యోగులు చేరడంతో మొత్తం సంఖ్య 6,06,998కి చేరుకున్నారు. వీరిలో 35.5 శాతం మహిళా ఉద్యోగులు కావడం విశేషం.
- సంస్థలో ప్రస్తుతం ఉద్యోగుల వలసలు రేటు 12.1 శాతంగా ఉన్నది.
- వాటాదారులకు ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు రూ.10 మధ్యంతర డివిడెండ్‌ను సంస్థ ప్రకటించింది.
- ప్రస్తుతం కంపెనీ వద్ద రూ.11,168 కోట్ల విలువైన నగదు నిల్వలు ఉన్నాయి.
- 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఉద్యోగులు 13,249 మంది తగ్గారు. గడిచిన 19 ఏండ్లలో ఇలా తగ్గడం ఇదే తొలిసారి కావడం విశేషం.

నూతన ఆర్థిక సంవత్సరం లాభాలతో ప్రారంభించాం. ఇండస్ట్రీ, మార్కెట్ల పరంగా అన్నింటా స్థాయిలో వృద్ధిని కనబరిచాం. క్లయింట్లతో ఉన్న సంబంధాలను కొనసాగించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. కృత్రిమ మేధస్సుపై ప్రత్యేక దృష్టి సారించడానికి ఫ్రాన్స్, అమెరికాల్లో ల్యాబ్‌లు, లాటిన్ అమెరికా, కెనడా, యూరప్‌లలో ప్రత్యేకంగా డెలివరీ సెంటర్లను ఏర్పాటు చేశాం.

- కే కృతివాసన్, టీసీఎస్ సీఈవో, ఎండీ





నైపుణ్యాలు కలిగిన ఉద్యోగులే సంస్థలకు వెన్నెముక. భారీ ప్రాజెక్టులు దొరకబుచ్చుకోవడం కన్నా.. సరైన మానవ వనరులను ఒడిసి పట్టుకోవడమే సవాలు. అందుకే రిక్రూట్‌మెంట్ ప్రాసెస్‌ను ప్రత్యేక సంస్థలకు అప్పగిస్తుంటాయి బడా కంపెనీలు. ఆ బాధ్యతను సమర్థంగా నిర్వర్తిస్తూ సత్తా చాటుతున్నది వనపర్తి బిడ్డ మేఘన. బహుళ జాతి సంస్థలకు మన్నికైన మానవ వనరులు అందించే లక్ష్యంతో మేఘన 'యశస్వి హెచ్ఆర్ కన్సల్టెన్సీ'ని స్థాపించింది.

స్కిల్డ్ ఉద్యోగులు కావాలా నాయనా..

స్టార్టప్ స్టోరీస్

హైదరాబాద్‌లోని మెహిదీపట్నం అడ్డాగా మొదలైన ఈ సంస్థ భారతదేశ వ్యాప్తంగా దాదాపు 200కు పైగా ఐటీ, ఇతర సంస్థలకు నిపుణులైన మానవ వనరులను అందించడంలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నది. నిరుద్యోగులకు ఉపాధియోగం అందిస్తూనే, వ్యాపార సంస్థలకు విజయాన్ని కట్టబెడుతున్న అంత్రప్రెన్యూర్ మేఘన ఈ వారం మన స్టార్టప్ స్టార్..

మాది వనపర్తి. మా కుటుంబసభ్యులంతా వైద్యరంగంలో స్థిరపడినవారే. వారికి భిన్నంగా నేను కంప్యూటర్స్‌లో డిగ్రీ పూర్తిచేశాను. తర్వాత ఎంబీఏ చదివాను. అందులో హెచ్ఆర్ మేనేజ్‌మెంట్ ఎంచుకున్నాను. చిన్నప్పటి నుంచి ఉద్యోగం చేయడం కన్నా.. సొంతంగా ఒక వ్యవస్థను నెలకొల్పి.. పదిమందికీ ఉపాధి కల్పించాలనే ఆలోచన ఉండేది. అది ఒక్కసారిగా నెరవేరేది కాదని నాకు తెలుసు. అందుకే ఎంబీఏ పూర్తయ్యాక ఒక సాధారణ ఉద్యోగిగా నా ప్రయాణం మొదలుపెట్టాను. వృత్తి నైపుణ్యాలను మెరుగుపర్చుకుంటూ మేనేజర్ స్థాయికి ఎదిగాను. తర్వాత అంత్రప్రెన్యూర్‌గా నిలబడేందుకు కావాల్సిన ప్రాక్టికల్ నాలెడ్జ్ కోసం హెచ్ఆర్ ఫ్రాంచైజీ సంస్థతో కలిసి కొన్నాళ్లు పనిచేశాను.

మలుపు తిప్పిన ఫ్రాంచైజీ..

ఏ రంగంలోనైనా రాణించాలంటే అందుకు తగిన నైపుణ్యాలను ముందుగా పెంపొందించుకోవాలి. అప్పుడే సొంతంగా వ్యవస్థను నిర్మించగలిగే ఆత్మవిశ్వాసాన్ని పొందగలుగుతాం. ఈ క్రమంలో నేను కూడా హెచ్ఆర్ సేవలు అందించే ఫ్రాంచైజీని తీసుకున్నాను. దాన్ని నిర్వహించే క్రమంలో వివిధ అంశాల్లో పూర్తిస్థాయి అవగాహన వచ్చింది. అదే నా జీవితాన్ని మలుపు తిప్పింది. అంత్రప్రెన్యూర్‌గా నా కల నెరవేరింది. 2011లో మరో భాగస్వామ్యంతో యశస్వి హెచ్ఆర్ కన్సల్టెన్సీ సంస్థను ప్రారంభించాను. అప్పటికే నాకు పెళ్లయ్యింది. దాంతో హైదరాబాద్‌లోనే స్థిరపడాలన్న ఉద్దేశంతో సంస్థ బలోపేతానికి నిరంతరం శ్రమించాను.

డిగ్రీ నుంచే..

మహబూబ్‌నగర్ ప్రాంతంలో పేరెన్నికగన్న గైనకాలజిస్టుల్లో మా అమ్మ ఒకరు. నాన్నతోపాటు మా కుటుంబ నేపథ్యం అంతా వైద్యమే! డాక్టర్ కూతురు డాక్టర్ కావాలన్న విధానానికి స్వస్తి చెబుతూ నా దారి మార్చుకున్నాను. డిగ్రీ నుంచే నా లక్ష్యాన్ని చేరుకునేలా దారి నిర్మించుకుంటూ వచ్చాను. కుటుంబ సహకారం, సరైన సమయంలో దొరికిన ప్రోత్సాహం, ఏర్పడిన నెట్‌వర్క్ ఇవన్నీ నేను ఎదగడానికి ఎంతగానో దోహదం చేశాయి. హైదరాబాద్ నుంచి దుబాయ్, సౌత్ ఆఫ్రికాలోని సంస్థలకు కావాల్సిన నాణ్యమైన ఉద్యోగులను అందించే స్థాయికి చేరుకునేలా ఊతమిచ్చాయి.

సంస్థలకు సవాలే...

ప్రపంచమే కుగ్రామంగా మారిపోయిన ఈ టెక్ యుగంలో సంస్థలకు కావాల్సిన వ్యక్తులను ఎంపిక చేసుకోవడం చాలా కీలకం. టెక్నాలజీ సాయంతో ఈ ప్రక్రియ సులభతరమైనా... సంస్థలు సరైన వ్యక్తిని ఎంపిక చేసుకోవడం అనుకున్నంత తేలికైన పనికాదు. మా సంస్థ ప్రారంభించిన మొదటి నెలలోనే ఐటీ సెక్టార్‌కు పదుల సంఖ్యలో టెక్నికల్ మ్యాన్‌పవర్‌ను అందించగలిగాం. క్వాలిటీ మ్యాన్‌పవర్ హంటింగ్‌లో కాస్త ఎదురుపోటుగా ఉన్నా.. మనల్ని నమ్ముకున్న సంస్థను మోసం చేసినవాళ్లం అవుతాం. అందుకే క్వాంటిటీ కన్నా క్వాలిటీ మ్యాన్‌పవర్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని భావించాం. మా సంస్థను ఎంతో ఇష్టంతో మొదలుపెట్టి, మరింతో కష్టంతో కాదనుకున్న లక్ష్యాలను అధిగమిస్తూ ముందుకువెళ్తున్నాం. ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా సుమారు 200 సంస్థలకు మానవ వనరులు సమకూరుస్తూ మా ప్రత్యేకతను చాటుకుంటున్నాం.

... కడార్ల కిరణ్

నీటి ఉపవాసం మేలేనా?

అధిక బరువు.. ఇప్పుడు చాలామంది ఎదుర్కొంటున్న సమస్య. వేళాపాళ లేని ఆహార నియమాలు, నిద్రలేమి, పని ఒత్తిడి, జంక్‌ఫుడ్ ఇవన్నీ అధిక బరువుకు కారణం అవుతున్నాయి. జీవనశైలిలో మార్పు రాకపోతే.. జిమ్‌లో గంటల తరబడి కష్టపడినా పెద్ద ప్రయోజనం ఉండదు. అయితే సహజ పద్ధతుల్లో బరువు తగ్గితే ఆరోగ్యంతోపాటు అందమూ రెట్టింపవుతుంది. ఇలాంటి సంప్రదాయ పద్ధతుల్లో ఉపవాసం ఒకటి. ఇందులో వాటర్ ఫాస్టింగ్ ప్రత్యేకం అని చెబుతున్నారు. ఏమిటీ వాటర్ ఫాస్టింగ్?

బరువు తగ్గేందుకు చేసే ఒక ప్రక్రియ వాటర్ ఫాస్టింగ్. ఈ ఉపవాస దీక్షలో దాదాపు 24 గంటలు నీళ్లు మాత్రమే తీసుకోవాలి. పండ్ల రసాలు కూడా తాగొద్దు. దీన్ని పాటించడం వల్ల కాలేయంతోపాటు కండరాల కణజాలాల్లో నిల్వ ఉన్న గ్లైకోజెన్ వినియోగం అవుతుంది. తద్వారా శరీర బరువు తగ్గుతుంది. వాటర్ ఫాస్టింగ్ వల్ల శరీరంలోని వ్యర్థాలు బయటికి వెళ్లిపోతాయని, జీర్ణక్రియ మెరుగుపడుతుందని పలు అధ్యయనాల్లో వెల్లడైంది. బరువు తగ్గడానికి, ఇన్సులిన్ సమతుల్యతకు కూడా ఇది సాయపడుతుందని తేలింది. అయితే, నీటి ఉపవాసం కారణంగా శరీరంలో విటమిన్లు, ఖనిజాలు, ఎలక్ట్రోలైట్ల శాతం పడిపోతుంది. దీంతో బలహీనత ఆవహిస్తుంది. వైకల్యం వచ్చే ప్రమాదమూ ఉంది. నిపుణుల సూచన మేరకే ఈ ఉపవాసం చేపట్టాలి. అంతేకాదు డయాబెటిస్, హృద్రోగ సమస్యలు ఉన్న వాళ్లు వాటర్ ఫాస్టింగ్ చేయకూడదు.



నమస్తే తెలంగాణ

జిందగీ

11

హైదరాబాద్ | శుక్రవారం 12 జూలై 2024 www.ntnews.com

చిన్నతెర

బస్తీలో పుట్టిపెరిగినా భయపడకుండా అడుగేసింది. తెలంగాణ ఉద్యమంలో గళం విప్పి పోలీస్ స్టేషన్ మెట్లు కూడా ఎక్కింది. అందరూ ఎగతాళి చేసినా పట్టువదలకుండా అనుకున్నది సాధించింది. చదువుకునేందుకు కూడా స్తోమత లేని దశ నుంచి సంపాదించే స్థాయికి ఎదిగింది. ఇతరుల సాయంతో చదువుకుని తన కెరీర్‌ని తానే మలుచుకుంది. తండ్రి వద్దన్నా ఎదిరించి నిలిచింది. తాను పుట్టిపెరిగిన బస్తీకే అతిథిగా హాజరై అందరికీ తన గాథ వినిపించింది. చుట్టూ ఉన్న చుట్టాలే మాటలతో బాధించినా తానేంటో నిరూపించుకుని నటిగా గుర్తింపు సాధించింది తెలంగాణ బిడ్డ శ్వేతా రెడ్డి. నలుగురు ఆడపిల్లల్ని కష్టపడి పెంచిన తల్లిదండ్రులకు కొడుకుగా మారి వారి రుణం తీర్చుకుంటున్నానంటూ జిందగీతో శ్వేత పంచుకున్న ముచ్చట్లు..



మా బస్తీకే గెస్ట్‌గా వెళ్లా!

నాన్నది కరీంనగర్, అమ్మది వరంగల్. మా కుటుంబం హైదరాబాద్‌లో సెటిలైంది. నా బాల్యమంతా ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ సమీపంలో ఉన్న అరుంధతినగర్ బస్తీలో సాగింది. మేం నలుగురం అక్కాచెల్లెళ్లం. నేనే చిన్నదాన్ని. నాన్న ఆటో నడిపేవారు. అమ్మ ఆరోగ్యం సరిగ్గా ఉండేది కాదు. నాన్న ఒక్కడి రెక్కల కష్టం మీదే ఇల్లంతా నడిచేది. అందుకే అక్కలకు చిన్నవయసులోనే పెండ్లిళ్లు చేసేశారు. నన్ను చదివించాలని నాన్న చాలా కష్టపడే వారు. నేను ఏడో తరగతిలో ఉండగా తెలంగాణ ఉద్యమ గీతాలు పాడేందుకు వెళ్లేదాన్ని. అక్కడ ఆటా పరిచయమైంది. ఎక్కడ కార్యక్రమాలు ఉన్నా నన్ను తీసుకెళ్లేది. ఈ క్రమంలోనే ఒకసారి ఉస్మానియా యూనివర్సిటీలో ఉద్యమ గీతాలు ఆలపిస్తుంటే పోలీసులు అరెస్ట్ చేశారు. అలా ఎనిమిదో తరగతిలోనే ఉద్యమంలో భాగంగా ఒకరోజు పోలీస్‌స్టేషన్‌లో ఉన్నాను. ఆ సమయంలోనే ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్ ఎండీ వేదసాగర్ సార్ పరిచయమయ్యారు. ఆయన నన్ను చూసి వాళ్ల స్కూల్లో 9, 10 తరగతులకు ఉచితంగా చేర్చుకున్నారు. అలా హైస్కూల్ చదువు పూర్తిచేశా.

సింగర్ కావాలనుకున్నా..

పదో తరగతి పూర్తయిన తర్వాత పల్లా రాజేశ్వర్ రెడ్డిగారు వారి కాలేజీలో ఫ్రీ సీట్ ఇచ్చారు. దాంతో డిప్లొమాలో చేరాను. చదువు పూర్తయిన తర్వాత హైదరాబాద్‌లో ఓ కోరింగ్‌లో జాయినయ్యి పార్ట్‌టైమ్ జాబ్‌చేస్తూ ఉండేదాన్ని. ఆ సమయంలోనే సీరియల్స్‌లో చేసే అవకాశం వచ్చింది. నిజానికి నాకు చిన్నప్పటి నుంచీ పాటలు పాడటం అంటే ఇష్టం. సింగర్ అవ్వాలని ఉండేది. కానీ, కుటుంబ పరిస్థితుల వల్ల ఆ ఆలోచనను పక్కనపెట్టా. లోకల్ చానల్‌లో యాంకర్‌గా చాన్స్ వచ్చింది. రెండు నెలల తర్వాత లైవ్ ప్రోగ్రామ్ ఇచ్చాను. ఆ కార్యక్రమానికి వచ్చిన ఓ కాస్టింగ్ మేనేజర్ 'అంతర్‌మంతర్' సీరియల్లో వారం రోజులకు గానూ ఓ పాత్రలో అవకాశం ఇచ్చారు. అలా మొదటిసారి తెరమీద కనిపించా.

నాన్న ఒప్పుకోలేదు..

సీరియల్స్‌లో అవకాశం వచ్చినప్పుడు మొదట నాన్న ఒప్పుకోలేదు. దాదాపు ఎనిమిది నెలలు నాతో మాట్లాడలేదు. బంధువులు కూడా ఆడపిల్ల బయటికి వెళ్లి సంపాదించాలా? అని చాలా మాటలన్నారు. కానీ, నేను పట్టు విడవలేదు. ఎట్టకేలకు నాన్న ఓకే అన్నారు. సీరియల్స్‌లో రాణించి నా సక్సెస్‌తో అందరికీ సమాధానం చెప్పా. ఇప్పుడు అందరూ నాన్నకు ఫోన్ చేసి నా గురించి గొప్పగా మాట్లాడుతుంటే ఆయన చాలా ఆనందపడతారు. మా కోసం జీవితమంతా కష్టపడ్డ నాన్నకు అండగా నిలవాలని నిర్ణయించుకున్నా. ప్రస్తుతం నాన్న, అక్కవాళ్లందరూ చాలా హ్యాపీ. మొదట్లో నాకు వచ్చే డబ్బులు నా అవసరాలకు కూడా సరిపోయేవి కావు. నాన్న దగ్గరే తీసుకునేదాన్ని. ఏదో ఒకరోజు నేను సాధించి చూపిస్తాను అని చెప్పేదాన్ని. అనుకున్నట్లుగానే మూడేండ్లలో మంచి పేరు వచ్చింది. నేను పుట్టిపెరిగిన బస్తీలో జరిగిన బతుకమ్మ సంబురాలకు నన్ను గెస్ట్‌గా పిలిచారు. నా ముందున్న వారికి నేనేంటో తెలుసు. నేను అక్కడే పెరిగాను. అలాంటి వారిముందు నేను అతిథిగా స్పీచ్ ఇవ్వడం చాలా సంతోషం కలిగించింది. ఎక్కడికి వెళ్లినా అభిమానులు గుర్తించి ఆదరించడం చాలా బాగుంటుంది.

నా సంపాదనతో..

2016లో నా మొదటి సంపాదన తీసుకున్నా. అప్పటినుంచి అమ్మానాన్నలకు ఏ లోటు రాకుండా చూసుకోవాలని నిర్ణయించుకున్నా. ఏటా అమ్మానాన్నల పెండ్లి రోజును గ్రాండ్‌గా సెలబ్రేట్ చేస్తాను. మా కోసం వాళ్లెంతో కష్టపడ్డారు. ఇప్పుడు వాళ్లను హ్యాపీగా ఉంచడమే కూతురిగా నా బాధ్యత. ఇప్పటివరకైతే కెరీర్ మీదే దృష్టి సారించాను. పెండ్లి ఆలోచనైతే ప్రస్తుతానికి లేదు. ఆడపిల్ల బయటికి వెళ్లి సంపాదించడం ఏంటని ప్రశ్నించిన వారితోనే 'బాగా చేస్తున్నావమ్మా' అనిపించుకున్నా. నా మీద గాసిప్స్ చెప్పినవాళ్లతోనే పొగిడించుకున్నా. బస్తీ నుంచి ఈ స్థాయికి రావడం గర్వంగా ఫీలవుతున్నా.


... హరిణి

సినిమాల్లోనూ..

> ప్రస్తుతం జీ తెలుగులో 'చిరంజీవి లక్ష్మీ సౌభాగ్యవతి', 'మా అన్నయ్య' సీరియల్స్ చేస్తున్నాను. గౌతమ్, రఘు చాలా సపోర్ట్ చేస్తారు. గౌతమ్ తన సొంత చెల్లిలా చూసుకుంటుంది. నా మొదటి సీరియల్లో హీరోయిన్ చెల్లెలిగా నటించా. దాంతో చెల్లెలి పాత్రలే ఎక్కువగా వస్తున్నాయి. అయితే, ఆ పాత్రలకు ప్రాధాన్యం ఉండటంతో ఒప్పుకొంటున్నా. నేను నటించిన ఓ సీరియల్ కన్నడలో కూడా డబ్ అవుతున్నది. దాంతో అక్కడ కూడా నన్ను అభిమానించేవారు ఉన్నారు. ఇటీవల బెంగళూరు వెళ్తే చాలామంది వచ్చి పలకరించారు. తమిళంలోనూ అవకాశాలు వచ్చాయి. కానీ, తెలుగులో చేయడం కంఫర్ట్‌గా ఉంది. అలాగే, భగవంత్ కేసరి, 30 రోజుల్లో ప్రేమించడం ఎలా?, కాటేదాటిన తదితర చిత్రాల్లో నటించాను. ఇంకొన్ని సినిమా అవకాశాలు వచ్చాయి. సీరియల్స్ బిజీతో చేయ్య కుదరడం లేదు.

సింక్ మెరిసిపోతుందిలా!

ఇంటిని శుభ్రంగా ఉంచడం తమ కర్తవ్యంగా భావిస్తారు అతివలు. నిద్ర ముంచుకొస్తున్నా.. పడుకునే ముందు వంటింటిని చక్కగా సర్దుకొని పడుకోవడం రివాజు. అయితే, అన్ని పనులు ఒకెత్తు.. సింకు శుభ్రం చేయడం మరో ఎత్తు. ఎంత కడిగినా.. నాలుగు రోజులకే సింకు అందం వెంబడే జిడ్డు పేరుకుపోతుంది. ఈ చిట్కాలు పాటించడంవల్ల సింక్ మరికొంత తెలికగా తొలగించవచ్చు. ఆ చిట్కాలేంటో చూద్దాం..



- సింకు శుభ్రంగా ఉండటానికి కొన్ని రకాల రసాయన ఉత్పత్తులను ఉపయోగిస్తూ ఉంటారు. వాటి వాడకం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తవచ్చు. సింక్‌లో వేడి నీరు పోసి కాసింత డిటర్జెంట్ పౌడర్ గానీ, బ్లీచింగ్ పౌడర్ గానీ వేసి ఐదు నిమిషాల తర్వాత కడగాలి.
- వెనిగర్, బేకింగ్‌సోడా, నిమ్మరసం కలిపి సింక్ మొత్తం చల్లాలి. అరగంట తర్వాత వేడినీటితో శుభ్రం చేయాలి. సింక్ శుభ్రం చేసినప్పుడు చివరగా డెటాల్, ఫినాయిల్ వంటి ఘాటైన క్లీనర్‌ని రంధ్రంలో వేస్తే పైప్‌లో ఉండే సూక్ష్మజీవులు కూడా నశిస్తాయి.

కొమ్ముల్లా మెరిసే మెరుపు!

ప్రస్తుతం దేశవ్యాప్తంగా ట్రెండింగ్‌లో ఉన్న టాపిక్ అనంత్ అంబానీ, రాధికా మర్చంట్ వివాహ వేడుక. అంగరంగ వైభవంగా జరుగుతున్న ఈ వేడుకకు ఆనే కమంది ప్రముఖులు, బాలీవుడ్ తారలు హాజరవుతున్నారు. అంబానీల స్థాయికి తగినట్టే ప్రతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. నీతా అంబానీ, ఇషా అంబానీ, శ్లోకా మెహతాతో పాటు ఈ పెండ్లి వేడుకలకు హాజరవుతున్న తారలందరూ ధరిస్తున్న దుస్తులు, ఆభరణాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఈ క్రమంలో దీపికా పదుకొణె ధరించిన పర్పుల్ చీర వార్తల్లో నిలిచింది. తొరానీ సంస్థ రూపొందించిన ఈ చీర తయారీకి ఏకంగా 3,400 గంటల సమయం పట్టిందట. అంతేకాదు హైదరాబాద్‌లోని రామహల్లా ప్యాలెస్, తారలోని రాయల్ టూంబ్స్ వాస్తుకళను స్ఫూర్తిగా తీసుకుని ఈ చీరను తయారు చేశారు. ముత్యాలైన ఎంబ్రాయిడరీతో మెరుపులు చేసిన సొగసైన ముత్యాలు, జోరీలు పొదిగారు. జలీ వర్క్ మేకప్‌తో రూపొందించిన చీర కట్టుకున్న దీపిక దానిపైకి డీప్ నెక్ బైస్, హాఫ్ లెంగ్త్ స్లీవ్స్ బ్లౌజ్ ధరించి అదరహో అనిపించింది. తొమ్మిది గజాల చీరకట్టులో బేబీబంప్‌తో మరింత అందంగా మెరిసిపోయింది.



ఖర్చు తగ్గించినా ఆదానే!

సంపాదించిన దాంట్లో ఎంతోకొంత పొదుపు చేయాలని ప్రతి ఒక్కరూ అనుకుంటారు. అందుకు తగిన ప్రణాళికలు కూడా సిద్ధం చేసుకుంటారు. అయితే, నెలాఖరు వచ్చేసరికి అంచనాలన్నీ తలకిందులవుతాయి. పోపులపెట్టెలో కూడబెట్టిన చిల్లర కూడా వెతుక్కోవాల్సి వస్తుంది. ఈ పరిస్థితి తలెత్తొద్దు అంటే.. ఖర్చులను నియంత్రించడం ఒక్కటే మార్గం. ఖర్చులు తగ్గించడం కూడా సంపాదనే!

ముందుగా పక్కాగా ఉండే పద్దులు ఏమిటో లిస్ట్ చేసుకోవాలి. ఇంటి అద్దె, పిల్లల స్కూలు ఫీజు, పాలు, పేపర్లు, కరెంటుబిల్లు, ఫోన్ రీచార్జ్‌లు ఇలా నెలవారీ ఖర్చులు ఎంతో అంచనాకు రావాలి. వీటిలో తగ్గింపులు కుదరవు. ముందుగా వీటికి కేటాయించిన సొమ్మును వేతనం నుంచి పక్కన పెట్టాలి.

కూరగాయల దగ్గర పేచీల్లా చేయకూడదు. ఏ పూటకు ఆ పూట కాయగూరలు తెచ్చుకుంటే.. లెక్కాపత్రం ఉండదు. సమయం కూడా వృథా! అలాకాకుండా వారానికి ఒకసారి రైతుబజార్‌లో, అంగడిలో చెల్లే కాస్త తక్కువ ధరకు కాయగూరలు దొరుకుతాయి. ఎక్కువ మొత్తంలో తీసుకుంటాం కాబట్టి, డిమాండ్ చేసి మరీ ధరలు తగ్గించమనొచ్చు. కొసరు కూడా కొట్టుకోవచ్చు.



ప్రతి నెలా ఒకే బడ్జెట్ సూత్రాలు పాటిస్తానంటే కుదరదు. ఒక నెల పాపాయి పుట్టినరోజు ఉండొచ్చు. మరోనెల అబ్బాయి ఇష్టపడే స్టార్ హీరో సినిమా విడుదల కావొచ్చు. వాటిని దృష్టిలో ఉంచుకొని నిధుల కేటాయింపు జరపాలి. బయటికి ఫంక్షన్లు ఉంటే.. దగ్గరి బంధువులు అయితేనే తప్ప వెళ్లొద్దు.

పిల్లల పుట్టినరోజు వేడుకలు ప్రతి ఏడాదీ ఘనంగా నిర్వహించాల్సిన అవసరం లేదు. కొత్త దుస్తులు కొనివ్వి, స్కూల్‌లో చాక్లెట్లు పంచడం వరకే పరిమితం చేయండి. బంధుగణాన్నంతా పిలిచి వేడుక చేస్తే.. ఖర్చులు తడిసి మోపెడవుతాయి.